

www.prajapaksham.in

ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

ఎపిలో అర్నాబ్ నష్టం రూ.4,600 కోట్లు

• తుఫాను బాధిత ప్రాంతాల్లో ఎపి సిఎం చంద్రబాబునాయుడు ఏరియల్ సర్వే

07

సంపుటి 09, సంచిక: 329 | శుక్రవారం | 30-10-2026 | ఖమ్మం

Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar**

పేజీలు: 12+8 | వెల రూ. 5.00

ఖర్గే నివాసంలో నేడు సిఇసిపై ప్రజా అభిశంసన

• లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమార్ అధ్యతన కార్యక్రమం
• 1వ తేదీన రామ్‌లీలా మైదానంలో ఇండియా కూటమి ర్యాలీ
• సిజెపి మద్దతు



న్యూఢిల్లీ : ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి)పై ఇండియా కూటమి ఈనెల 30న 'ప్రజా అభిశంసన' కార్యక్రమం చేపట్టనుంది. ఓట్ల దొంగతనం, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు వ్యతిరేకంగా ఢిల్లీలో నవంబర్ 1న ర్యాలీ నిర్వహించనుంది. లాఠీ దెబ్బలకు భయపడకుండా ర్యాలీకి తరలి రావాలని ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ విద్యార్థి సంఘాలకు పిలుపునిచ్చారు. ర్యాలీ కోసం రామ్ లీలా మైదానంలో ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) ర్యాలీకి సంఘీభావం ప్రకటించింది. ఓటు రాజ్యాంగం కల్పించిన హకు అని, దానిని రక్షించుకునేందుకే ర్యాలీకి మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించింది. కాగా, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే నివాసంలో నిర్వహించతలపెట్టిన ఈ ప్రక్రియకు మాజీ లోక్‌సభ స్పీకర్ మీరా కుమార్ అధ్యక్షత వహించనున్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఈ ప్రక్రియను ప్రారంభించనుండగా, పార్టీ మాజీ అధినేత రాహుల్ గాంధీ ముగింపు వ్యాఖ్యలు చేసి తీర్మానాన్ని ఆమోదించనున్నారని వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమం కోసం మొదట నిర్ణయించిన వేదిక అయిన హోటల్ అశోక్‌లో, ఆ తర్వాత రామ్‌లీలా మైదాన్‌లో నిర్వహించడానికి ఢిల్లీ పోలీసులు అనుమతి నిరాకరించడంతో, వేదికను ఖర్గే నివాసానికి మార్చారు. 'ఓట్ల దొంగతనం' అంశంపై ప్రతీకాత్మక నిరసనగా ప్రధాన ఎన్నికల కమిషనర్ (ఇసిసి) జ్ఞానేష్ కుమార్‌పై ఢిల్లీలోని ఖర్గే నివాసంలోని 'ప్రజా అభిశంసన' ప్రక్రియకు తుది రూపునిచ్చేందుకు ఇండియా కూటమి నాయకులు గురువారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు ప్రియాంక గాంధీ వాద్రా, జైరామ్ రమేష్, కెసి వేణుగోపాల్, సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు మీరా కుమార్, సిపిఐ రాజ్యసభ సభ్యులు పిపి సునీర్, టిఎంసికి చెందిన డెరెక్ ఓ'బ్రెయన్, సమాజ్‌వాదీ పార్టీకి చెందిన హరేంద్ర మాలిక్, జెఎంఎంకు చెందిన మహువా మాజీ, సిపిఐ(ఎం)కి చెందిన జాన్ బ్రిట్టాస్ తదితరులు పాల్గొన్నారు. జ్ఞానేశ్ కుమార్‌పై ఇండియా కూటమి చేపట్టనున్న 'బహిరంగ అభిశంసన'కు మీరా కుమార్ అధ్యక్షత వహిస్తారని వర్గాలు తెలిపాయి. జ్ఞానేశ్ కుమార్‌ను అభిశంసించాలనే తీర్మానాన్ని ఖర్గే ప్రవేశపెట్టనుండగా, ఆ తీర్మానం ఆమోదం పొందే ముందు రాహుల్ గాంధీ ముగింపు ప్రసంగం చేస్తారు. బెంగళూరులో ఖర్గే మీడియాతో మాట్లాడుతూ సిఇసి పాల్పడిన 'ఓట్ల దొంగతనం, అక్రమాల' కారణంగానే

తరువాయి 8లో

దేశ వ్యాప్తంగా 'ఓట్‌చోరీ' నిరసనలు కొనసాగుతాయ్

బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలను ఎదుర్కోవాలి
బిజెపికి కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే సవాల్

లాఠీలకు భయపడొద్దు

ఇండియా కూటమి ర్యాలీలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి
విద్యార్థి సంఘాలకు ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ పిలుపు

రామ్‌లీలా మైదానంలో ర్యాలీకి ముమ్మర ఏర్పాట్లు

07



పెట్టుబడులు పెట్టండి రెట్టింపు చేసుకోండి

• తెలంగాణలో పెట్టుబడులకు ప్రభుత్వం తరపున రక్షకుడిగా ఉంటా • 2034 నాటికి లక్ష కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థ.. 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల లక్ష్యం • ఢిల్లీలో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026'కర్టెన్ రైజర్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి సిఎం రేవంత్ రెడ్డి • వికసిత్ భారత్ లక్ష్య సాధనకు అన్ని రాష్ట్రాలు కలిసి పనిచేయాలి • తెలంగాణ విజయగాథలో కేంద్రం భాగస్వామి : కేంద్ర మంత్రి పీయూష్ గోయల్



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలకు భద్రత కల్పించడం, వారి వ్యాపారాలు వృద్ధి చెందేలా చూడటం తెలంగాణ ప్రభుత్వం తరపున తన వ్యక్తిగత బాధ్యత అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలనుకునే పారిశ్రామికవేత్తలు తమ పెట్టుబడి లక్ష్యాలను రెట్టింపు చేసుకోవాలని పిలుపునిచ్చారు. పారిశ్రామికవేత్తలు ఆశించే వృద్ధి అంచనాలు, లాభాల లక్ష్యాలను కూడా రెట్టింపు చేసుకోవాలని సూచించారు. పెట్టుబడిదారుల విజయానికి అడ్డంకులు తొలగించి, అవసరమైన ప్రభుత్వ సహకారం అందిస్తానని సిఎం హామీ ఇచ్చారు. డిసెంబరు 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లోని భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న గ్లోబల్ సమ్మిట్‌కు పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులను సిఎం ఆహ్వానించారు. 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్2026' కర్టెన్ రైజర్ కార్యక్రమం ఢిల్లీలో గురువారం రాత్రి జరిగింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ పాల్గొన్నారు. రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వాకిటి శ్రీహరి, మహ్మద్ అజారుద్దీన్, పారిశ్రామికవేత్తలు, విధాన రూపకర్తలు, అధికారులను ఉద్దేశించి ప్రసంగించారు. వివిధ రంగాల్లో హైదరాబాద్ సాధించిన విజయాలు, ప్రభుత్వం అందిస్తున్న మద్దతుపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో సిఎం రేవంత్ రెడ్డి ప్రసంగిస్తూ 1991 నుంచి రాష్ట్రంలో వివిధ రాజకీయ పార్టీల ప్రభుత్వాలు అధికారంలో ఉన్నప్పటికీ, రాజకీయ భిన్నాభిప్రాయాలకు అతీతంగా హైదరాబాద్ పెట్టుబడుల ప్రస్థానానికి అందరూ మద్దతుగా నిలిచారని అన్నారు.

పెట్టుబడిదారుల అభిప్రాయాలకే ప్రాధాన్యం : వ్యాపార రంగంపై పారిశ్రామికవేత్తలకు ఎక్కువ అవగాహన

తరువాయి 8లో

పరిశ్రమ నిర్వచనంలో మినహాయింపులపై

సుప్రీం కోర్టుకు ఎఐటియుసి

పారిశ్రామిక సంబంధాల కోడ్‌లో ధార్మిక ఆసుపత్రులు, విద్యాసంస్థలు మినహాయించటంపై సవాల్

విచారణకు అంగీకరించిన ఉన్నత న్యాయస్థానం : పిటిషన్ స్వీకరణ

న్యూఢిల్లీ : పారిశ్రామిక సంబంధాల కోడ్ (ఇండస్ట్రియల్ రిలేషన్స్ కోడ్ – ఐఆర్‌సి) 2020 కింద పరిశ్రమ నిర్వచనం అత్యంత అస్పష్టంగా ఉండటాన్ని సుప్రీం కోర్టులో ఎఐటియుసి తమిళనాడు శాఖ సవాలు చేసింది. ముఖ్యంగా కొత్త చట్టంలో ధార్మిక (విద్యాసంస్థ, ఆసుపత్రి తదితర) సంస్థలు, ప్రభుత్వ విధులు నిర్వహించే విస్తృత శ్రేణి సంస్థలకు మినహాయింపు ఇవ్వడంతో పరిశ్రమ నిర్వచనం అస్పష్టంగా ఉందని పేర్కొంది. ఈ పిటిషన్‌ను విచారించేందుకు బుధవారం నాడు సుప్రీంకోర్టు అంగీకరించింది. పరిశ్రమ పరిధిలోకి వచ్చే సంస్థలలో పనిచేసే కార్మికులకు ఐఆర్‌సి చట్టపరమైన రక్షణలను కల్పిస్తుంది. ఐఆర్‌సిలోని సెక్షన్ 2(పి) 'పరిశ్రమ' పరిధిలోకి వచ్చే సంస్థలను నిర్వచించింది. దాని ప్రకారం 'మానవ అవసరాలు లేదా కోరికలను తీర్చే ఉద్దేశ్యంతో వస్తువులు లేదా సేవలను ఉత్పత్తి, సరఫరా లేదా పంపిణీ చేయడం కోసం యజమాని, కార్మికుడి మధ్య సహకారంతో నిర్వహించబడే ఒక క్రమబద్ధమైన కార్యకలాపంలో నిమగ్నమైన ఏదైనా సంస్థ' పరిధిలోకి

తరువాయి 8లో

శ్రద్ధ వహించడంలో వైఫల్యం రుజువైతే

డిజిటల్ మోసాల బాధితులకు నష్టపరిహారం చెల్లించాలి

• బ్యాంకులను జవాబుదారీగా చేయాలి
• బాధితులు కోల్పోయిన మొత్తాన్ని పరిహారంగా అందించాలి
• సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు



న్యూఢిల్లీ : డిజిటల్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు గురువారం కీలక వ్యాఖ్యలు చేసింది. డిజిటల్ మోసాల బాధితులకు నష్ట పరిహారం చెల్లించేలా బ్యాంకులను జవాబుదారీగా చేయాలని చెప్పింది. ఒకవేళ బ్యాంక్ తగిన శ్రద్ధ వహించడంలో విఫలమవడం వల్లే మోసం జరిగినట్లు రుజువైతే, డిజిటల్ అరెస్టుల వంటి నేరాల బాధితులకు వారు కోల్పోయిన మొత్తాన్నైనా నష్ట పరిహారంగా అందించాలని ఆదేశించింది. బాధితులకు తగిన నష్టపరిహారం అందించేందుకు ప్రతిపాదిత నియంత్రణ చట్రం తప్పనిసరిగా నిబంధనలు కల్పించాలని ధర్మాసనం స్పష్టం చేసింది. డిజిటల్ అరెస్ట్ కుంభకోణం అంశంపై సుమోటోగా విచారణ జరిపిన సిజెఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు వ్యాఖ్యానించింది. డిసెంబర్ 31 నాటికి అమల్లోకి రానున్న ఆర్‌బిఐ కెవైసి సవరణ ఆదేశాలను పరిశీలిస్తామని సుప్రీంకోర్టు తెలిపింది. ప్రతిపాదిత మార్గదర్శకాల పరిధిలోకి వచ్చే ఆర్థిక సంస్థల వివరాలను, బాధితులకు

తరువాయి 8లో

100 శాతం ఇథనాల్‌తో నడిచే వాహనాలకు అనుమతిస్తే...

సప్లయ్ ఎలా చేస్తారు ?

ప్రభుత్వాన్ని 'ప్రశ్నించిన' సుప్రీంకోర్టు

07



సబ్ ప్లాన్ నిధులు

పక్కదారి పట్టనీయొద్దు

• లక్షిత వర్గాల సంక్షేమానికే వినియోగించాలి
• ఎస్‌సి, ఎస్‌టిల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ
• డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క , మంత్రి అడ్లూరి సమీక్ష

ప్రజాపక్షం/హైదరాబాద్

ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులు నిర్దేశిత లక్ష్యాల నుంచి పక్కదారి పట్టకుండా, లక్షిత వర్గాల సంక్షేమం, అభివృద్ధికే వినియోగించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. నిధుల ఖర్చు, లబ్ధిదారులకు అందుతున్న ప్రయోజనాలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టి, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వ్యవసాయం, విద్యుత్, గృహ వసతి, మౌలిక సదుపాయాలు, వైద్య సేవల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ లక్షిత వర్గాల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు.డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో గురువారం వివిధ శాఖల ఉన్నతాధికారులతో డిప్యూటి సిఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సమీక్ష నిర్వహించారు. సబ్‌ప్లాన్ నిధుల వినియోగం, సంక్షేమ పథకాల అమలును పరిశీలించారు. ఈ సందర్భంగా

తరువాయి 8లో

మూసీ సుందరీకరణను

వెంటనే ఆపాలి

ఆ ప్రాజెక్టు నిధులను రైతులు, వ్యవసాయానికి ఖర్చుపెట్టాలి
కెటిఆర్ డిమాండ్



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలోని ఎల్‌నినో కరువు పరిస్థితుల నేపథ్యంలో లక్షన్నర కోట్ల రూపాయాలతో చేపడుతున్న 'మూసీ' సుందరీకరణ ప్రాజెక్ట్ పనులను వెంటనే ఆపాలని, ఆ ప్రాజెక్ట్‌కు పెట్టే నిధులను రైతులకు, వ్యవసాయానికి ఖర్చు పెట్టాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిజం నిలకడ మీద తేలుతుందని పెద్దలు ఎప్పుడో చెప్పారని, ఇంకా క్షమాపణలు చెప్పేవాళ్లు చాలా మంది ఉన్నారని, తనపై వచ్చిన ఆరోపణలన్నీ దూది పింజల్లా తేలిపోతాయని, కొండా సురేఖ చేసిన ట్విట్టర్‌నుద్దేశించి కెటిఆర్

తరువాయి 12లో

భారత్‌పై ఎల్ నినో దెబ్బ

• అసాధారణంగా పెరగనున్న ఉష్ణోగ్రతలు
• 2026 అక్టోబరు నుంచి 2027 మార్చి నాటికి 55 వేల మరణాలు?
• ప్రపంచ వ్యాప్తంగా 3.73 లక్షల మంది మృతి చెందే అవకాశం
• షికాగో విశ్వవిద్యాలయానికి చెందిన 'క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్' అంచనా



న్యూఢిల్లీ : భారతదేశాన్ని ఎల్‌నినో తీవ్రంగా దెబ్బకొట్టనుందా..? ఎల్‌నినో కారణంగా పెరుగుతున్న అసాధారణ ఉష్ణోగ్రతలు రానున్న నెలల్లో ప్రాణనష్టాన్ని పెంచనున్నాయా..? తాజా పరిశోధన ఆధారిత అంచనాలు ఈ ప్రశ్నలకు ఔననే సమాధానం ఇస్తున్నాయి. అమెరికా లోని షికాగో విశ్వవిద్యాలయానికి చెందిన 'క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్' రూపొందించిన న్యూ ట్రాకర్ ప్రకారం.. 2026 అక్టోబర్ నుంచి 2027 మార్చి నాటికి భారత్‌లో అధిక వేడి కారణంగా సాధారణస్థాయికి మించి సుమారుగా 55 వేల మరణాలు సంభవించే అవకాశం ఉన్నది. ఆ మరణాల్లో ఎక్కువ భాగం మార్చి నెలలోనే నమోదయ్యే ప్రమాదం ఉందని న్యూ ట్రాకర్ అంచనా వేసింది. అక్టోబర్ నుంచి వచ్చే ఏడాది మార్చి వరకు ప్రపంచవ్యాప్తంగా అధిక వేడి కారణంగా సాధారణ స్థాయికి మించి సుమారు 3.73 లక్షల మరణాలు సంభవించే అవకాశం ఉంది. ఈ ఆరు నెలల కాలంలో నైజీరియాలో 56 వేల మరణాలు, భారత్‌లో 55 వేల మరణాలు సంభవించవచ్చని అంచనా. ఇండోనేషియాలో 29 వేలు, బ్రెజిల్‌లో 19 వేల

తరువాయి 12లో

ఆ 550 ఎకరాలు ప్రభుత్వానివే

• ప్రైవేట్ వ్యక్తుల అప్పీళ్లను కొట్టివేసిన సుప్రీంకోర్టు
• మియాపూర్ భూ వివాదంలో రాష్ట్ర ప్రభుత్వం చరిత్రాత్మక విజయం

ప్రజాపక్షం/హైదరాబాద్

మియాపూర్ భూ వివాదంలో తెలంగాణ ప్రజా ప్రభుత్వం చారిత్రాత్మక విజయం సాధించింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మియాపూర్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 100, 101కు సంబంధించిన భూ వివాదంలో సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. సుమారు 550 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉన్న ప్రభుత్వ భూములపై హక్కులు కోరుతూ ప్రైవేట్ వ్యక్తులు దాఖలు చేసిన అప్పీళ్లను (సివిల్ అప్పీల్ నెం.10699/2013 తదితర కేసులు) సుప్రీం కోర్టు గురువారం కొట్టివేసింది. జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్,

తరువాయి 12లో



వీడిన హత్య మిస్టరీ

'సామినేని' కేసులో నిందితుల అరెస్ట్

• వివరాలను వెల్లడించిన సిపి సునీల్ దత్ • ఘటనకు రేపటితో ఏడాది పూర్తి

ప్రజాపక్షం/ ఖమ్మం

ఏడాది తర్వాత హత్య కేసు మిస్టరీ వీడింది. గతేడాది అక్టోబర్ 31న సిపిఎం రాష్ట్ర నాయకులు, ఖమ్మంజిల్లా చింతకాని మండలం పాతర్లపాడు గ్రామం మాజీ సర్పంచ్ సామినేని రామారావు తన ఇంటి వద్దనే హత్యకు గురయ్యాడు. హతుడు రాజకీయ నాయకుడు కావడంతో అప్పట్లో ఈ హత్య కేసు జిల్లాలో సంచలనం సృష్టించింది. హత్య తెల్లవారుజామున జరగడం, హంతకులు ఎవరో గుర్తించకపోవడంతో దర్యాప్తులో తీవ్ర జాప్యం జరిగింది. ఎట్టకేలకు ఖమ్మంజిల్లా ఖమ్మం రూరల్ మండలం తెల్దారుపల్లికి చెందిన నలుగురు వ్యక్తులు సామినేని రామారావును హత్య చేసినట్లు పోలీసులు గుర్తించి గురువారం కోర్టులో ప్రవేశపెట్టారు. కోర్టులో ప్రవేశపెట్టడానికి ముందు నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. ఖమ్మం సిపి సునీల్ దత్ తెలిపిన వివరాల ప్రకారం...

తరువాయి 12లో

సిఇసి ఇష్టారాజ్యం!

కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న ఆరోపణలకు ఆయన అనుసరిస్తున్న విధానాలు మరింత బలాన్ని చేకూరుస్తున్నవి. వాస్తవానికి, ప్రజాస్వామ్యంలో ఎన్నికల సంఘం విశ్వసనీయత దాని అధికారాల విస్తృతితోనో, దాని అధిపతి హోదాతోనో నిర్ణయమవదు. ఆ అధికారాలను ఎంత పారదర్శకంగా వినియోగిస్తోంది? తన నిర్ణయాలపై వచ్చే ప్రశ్నలకు ఎంత బాధ్యతాయుతంగా సమాధానమిస్తోంది? సంస్థలోని భిన్నాభిప్రాయాలకు ఎంత విలువ ఇస్తోంది? అనే అంశాలే దాని నైతిక బలాన్ని నిర్ణయిస్తాయి. ఎన్నికల నిర్వహణలో కీలక బాధ్యతలు నిర్వర్తించే సంస్థ ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా మౌనం వహిస్తే, ఆ మౌనాన్ని సాధారణ పరిపాలనా లోపంగా కాకుండా, ప్రజాస్వామ్య సంస్థలపై ప్రజలు ఉంచిన విశ్వాసాన్ని ప్రశ్నార్థకం చేసే దుష్ట సంప్రదాయంగా మారుతుంది. సిఇసి వ్యవహారశైలిపై, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై వెలువడిన ఆరోపణల నేపథ్యంలో, ప్రజాస్వామ్యానికి జవాబుదారీతనం బోధించాల్సిన సంస్థ తన జవాబుదారీతనాన్ని ఎలా నిరూపించుకుంటుంది? అనే ప్రశ్న తెరపైకి వస్తున్నది. ఎందుకంటే, సమాచార హక్కు చట్టం (ఆర్‌టిఐ) నోటీసును సిఇసి బేఖాతరు చేస్తున్న తీరు ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వ, ప్రజా సంస్థల నిర్ణయాల వెనుక ఉన్న సమాచారం తెలుసుకోవడానికి ఈ చట్టం అవకాశం కల్పిస్తుంది. సాధారణంగా సమాచార హక్కు దరఖాస్తుకు 30 రోజుల్లో సమాధానం ఇవ్వాలి. అయితే, ఎన్నికల సంఘం వద్ద ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు వ్యక్తం చేసిన అభ్యంతరాలకు సంబంధించిన పత్రాలను కోరుతూ దాఖలైన దరఖాస్తుకు గడువు ముగిసినా సమాధానం రాలేదనే సమాచారం ఆందోళన కలిగిస్తోంది. పదవీ విరమణ చేసిన నౌకాదళ అధికారి, సమాచార హక్కు కార్యకర్త దాఖలు చేసిన ఈ దరఖాస్తులో, ఇద్దరు కమిషనర్లు నమోదు చేసిన విభేదాలు, వాటిపై ప్రధాన ఎన్నికల కమిషనర్ తీసుకున్న చర్యలు, సంబంధిత ఫైల్ నోటింగ్స్ వివరాలను కోరారు. అక్టోబర్ 26 నాటికి 30 రోజుల గడువు ముగిసినా సమాధానం అందలేదని, దరఖాస్తును త్వరగా పరిష్కరించాలని మళ్లీ విజ్ఞప్తి చేసినట్లు అందుబాటులో ఉన్న సమాచారం స్పష్టం చేస్తున్నది. కోరిన ప్రతి పత్రాన్ని ఏ పరిస్థితిలోనైనా వెల్లడించాలనే నియమం లేదు. చట్టంలో పేర్కొన్న మినహాయింపులు వర్తిస్తే సంబంధిత ప్రజా సమాచార అధికారి కారణాలతో కూడిన నిర్ణయం తీసుకోవచ్చు. అయితే, అలాంటి మినహాయింపు వర్తిస్తే దానిని స్పష్టంగా తెలియజేయాలి. చట్టబద్ధమైన గడువులో సమాధానం ఇవ్వడం, సమాచారం నిరాకరిస్తే అందుకు కారణాలు చెప్పడం ప్రజా సంస్థ బాధ్యత. మౌనం ఈ రెండింటికీ ప్రత్యామ్నాయం కాదు. ముఖ్యంగా ఓటర్ల జాబితాల రూపకల్పన, ఓటు హక్కు వినియోగం, ఎన్నికల నిర్వహణ వంటి అంశాలకు సంబంధించిన ప్రశ్నలపై పారదర్శకతకు మరింత ప్రాధాన్యం ఉంటుంది. ఎన్నికల సంఘంలోని ఇద్దరు కమిషనర్లు పది నెలల వ్యవధిలో కనీసం 14 సందర్భాల్లో తమ అభ్యంతరాలను అధికారికంగా నమోదు చేశారన్న వార్త సహజంగానే ఆందోళన కలిగిస్తుంది. ముగ్గురు సభ్యుల ఎన్నికల సంఘంలో ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు ప్రత్యేకమైన రాజ్యాంగ హోదా ఉన్నప్పటికీ, మిగతా ఇద్దరు కమిషనర్లను పక్కనపెట్టి ఏకపక్షంగా వ్యవహరించే అధికారం ఆయనకు లేదు. ఈ వ్యవహారంలో ప్రధాన ఎన్నికల కమిషన్‌పై విమర్శలు తీవ్రతరం కావడానికి మరో కారణం సమాచార హక్కు దరఖాస్తుకు సమాధానం రాకపోవడం. ఎన్నికల సంఘంలోని ఇద్దరు సభ్యులు లేవనెత్తిన అభ్యంతరాలపై తీసుకున్న చర్యలు, వాటికి సంబంధించిన ఫైల్ నోటింగ్‌ను కోరిన దరఖాస్తుకు చట్టబద్ధమైన గడువులో స్పందించకపోవడం అనుమానాలను పెంచుతుంది. సమాచార హక్కు చట్టం ప్రకారం నిర్ణీత గడువులో స్పందించకపోతే దరఖాస్తును తిరస్కరించినట్లుగా పరిగణించే నిబంధన ఉంది. దరఖాస్తుదారుడు తదుపరి అప్పీల్ ప్రక్రియను ఆశ్రయించవచ్చు. ఈ చట్టపరమైన వ్యవస్థను పౌరులు వినియోగించుకోవాల్సిన పరిస్థితి రావడం ఒక అంశమైతే, ఆ చట్టాన్ని అమలు చేయాల్సిన సంస్థే గడువును పాటించకపోవడం మరో తీవ్రమైన అంశం. ఇదే సమయంలో సిఇసి రాజీనామా చేయాలంటూ దేశవ్యాప్తంగా నిరసనలు జరుగుతున్నాయన్న సమాచారం కూడా రాజకీయ, ప్రజాస్వామ్య చర్చల్లో భాగమైంది.

అక్టోబర్ 2 నుంచి నిరసనలు కొనసాగుతున్నాయి. అయితే, ప్రజల ఆందోళనలను పూర్తిగా పట్టించుకోనవసరం లేదన్న భావనతో వ్యవహరించడం మాత్రం బాధ్యతాయుతమైన ప్రజా నాయకత్వానికి తగదు. విమర్శల కు సమాధానం ఇవ్వడం బలహీనత కాదు. సమాధానం చెప్పకుండా ఉండటమే అనుమానాలకు అవకాశం కల్పిస్తుంది. కేంద్ర ప్రభుత్వ మద్దతు ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు రాజకీయంగా రక్షణ కల్పిస్తోందా? అనే అనుమానం కూడా బలంగా ఉంది. ఎందుకంటే, ఎన్నికల సంఘం స్వతంత్రతపై ప్రజలకు సందేహాలు కలిగించే పరిస్థితులు ఏర్పడితే వాటిని తొలగించే బాధ్యత ప్రభుత్వంతోపాటు ఎన్నికల సంఘంపైనా ఉంటుంది. రాజ్యాంగ సంస్థ స్వతంత్రంగా పనిచేస్తోందని చెప్పడం మాత్రమే సరిపోదు. దాని నిర్ణయాలు, చర్యలు కూడా ఆ స్వతంత్రతను ప్రతిబింబించాలి. కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తోందన్న ఆరోపణలకు సంస్థ పారదర్శకమైన ప్రక్రియలతో సమాధానం చెప్పాలి. లేకపోతే, పరోక్షంగా సిఇసికి కేంద్ర ప్రభుత్వ మద్దతు ఉందని స్పష్టమవుతుంది. సమస్య గంభీరతను బట్టి, దానిపై తలెత్తిన సందేహాలకు సమాధానం ఇవ్వాల్సిన అవసరం ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. అందుకే, ఓటర్ల జాబితా సవరణ విషయంలో ఈ ప్రశ్నలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ఓటర్ల జాబితా ఎన్నికల ప్రక్రియకు పునాది. అర్హులైన పౌరుల పేర్లు జాబితాలో ఉండాలి. అనర్హమైన నమోదులను తొలగించాలి. ఈ రెండు లక్ష్యాల మధ్య సమతుల్యతను కాపాడటం ఎన్నికల సంఘం బాధ్యత. సవరణ ప్రక్రియలో భారీ సంఖ్యలో పేర్లు తొలగించినప్పుడు, అర్హులైన ఓటర్ల హక్కులకు భంగం కలగలేదని నిరూపించే పారదర్శక వ్యవస్థ ఉండాలి. అభ్యంతరాలు, అప్పీళ్లు, పేర్ల పునరుద్ధరణకు స్పష్టమైన విధానాలు అమలులో ఉండాలి. సాంకేతిక వ్యవస్థల నిర్వహణలోనూ అధికారులందరికీ తగిన సమాచారం, బాధ్యతలకు అనుగుణమైన ప్రాప్యత ఉండాలి. ఓటు హక్కు వినియోగంపై ప్రభావం చూపే నిర్ణయాలను ప్రజలు పరిశీలించలేని పరిస్థితి ఏర్పడితే, ఎన్నికల ప్రక్రియపై విశ్వాసం దెబ్బతింటుంది. అందుకే సమాచార హక్కు దరఖాస్తుకు సమాధానం ఇవ్వాలి, ఇద్దరు కమిషనర్లు నమోదు చేసిన అభ్యంతరాలపై తీసుకున్న చర్యలను వివరించాలి, అవసరమైతే స్వతంత్ర పరిశీలనకు సహకరించాలి. ఆరోపణలు నిరాధారమైతే ఆధారాలతో వాటిని ఖండించాలి. ప్రక్రియలో లోపాలు ఉంటే సరిదిద్దాలి. అప్పుడే సిఇసి నిజాయితీ నిగ్గుతేలుతుంది. ప్రతిష్ట పెరుగుతుంది. అయితే కమిషన్‌లో నిర్ణయాలన్నిటినీ ఏకగ్రీవంగా తీసుకున్నామని ఎన్నికల కమిషన్ సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో చెప్పటం ఈ సందర్భంగా గమనించదగింది.



కెటిఆర్‌పై వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నా..

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌గారిపై గతంలో నేను చేసిన కొన్ని వ్యక్తిగత వ్యాఖ్యల పట్ల వివరణ ఇవ్వాలని అనుకుంటున్నాను. అప్పటి రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో, ప్రతిపక్షాన్ని విమర్శించే క్రమంలో ఆ విధంగా మాట్లాడానే తప్ప ఉద్దేశపూర్వకంగా కాదు. ఆనాడు నేను చేసిన కొన్ని నిరాధారమైన వ్యాఖ్యలు చేయకుండా ఉండవలసింది. కెటిఆర్ గారిని లేదా ఆయన కుటుంబ సభ్యులను బాధపెట్టాలని గానీ, వారి ప్రతిష్టకు భంగం కలిగించాలనే దురుద్దేశం గాని నాకు ఎంతమాత్రం లేవు. నా వ్యాఖ్యలు వారిని గానీ, వారి కుటుంబ సభ్యులను గానీ నొప్పించి ఉంటే అందుకు చింతిస్తూ, ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నాను.

– 'ఎక్స్'లో మాజీ మంత్రి కొండా సురేఖ



తరగతి గదిలోనే పొదుపు పాఠాలు నేర్పలేమా?

నేటి విద్యావ్యవస్థలో ఆర్థిక క్రమశిక్షణ, పొదుపు పాఠాలు చెప్పడానికి అవకాశం లేకుండాపోయింది. ఎంత ఖర్చు పెడితే అంత గౌరవం పెరుగుతుందనే దురభిప్రాయంలో యువత కొట్టుమిట్టాడుతోంది. చిన్నప్పటి నుంచే పిల్లల్లో పొదుపు పట్ల అవగాహన కల్పించాలి. పొదుపుకు, పిసినారితనానికి వ్యత్యాసం నేర్పాలి. సంపాదించిన నెలసరి వేతనంతో కొంత మేరకు పొదుపు చేయడం కనీస కర్తవ్యమని నేర్పుకోవాలి. మొక్కై వంగనిది, మానై వంగదు కదా. లేత మనసుల్లో ఆర్థిక అక్షరాస్యత బీజాలు నాటాలి. చిన్నతనంలో పొదుపు పాఠాలు నేర్చిన పిల్లలు రేపటి కుటుంబానికి సుఖ సంతోషాలను అందించగలరని తెలుసుకోవాలి.

ప్రపంచవ్యాప్తంగా పొదుపు ప్రాధాన్యాన్ని అవగాహన కల్పించటానికి ప్రతి ఏట 31 అక్టోబర్ రోజున ప్రపంచ పొదుపు దినోత్సవం (వరల్ థ్రిఫ్ట్ లేదా సేవింగ్స్ డే) పాటించడం 1925 నుంచి ఆనవాయితీగా వస్తున్నది. భారత మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ 31 అక్టోబర్ 1984 రోజు మరణించడంతో, 1985 నుంచి ప్రపంచ పొదుపు దినాన్ని భారత ప్రభుత్వం 30 అక్టోబర్ రోజున నిర్వహించడం కొనసాగుతున్నది. 2026 ప్రపంచ పొదుపు దినోత్సవం ఇతివృత్తంగా 'ఏఐ సలహాలు, మానవుడి నిర్ణయాలు' అనే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం కొనసాగుతున్నది.

నేటి డిజిటల్ యువత ఉద్యోగాలు చేస్తూ పరిమిత వేతనాలను పొందుతున్నారు. తాము పొందిన వేతనాలతో కుటుంబాలను సజావుగా నడపడం లేదు. ప్రాధాన్యాలు మరిచి పోతున్నారు. విలాసాలు కూడా కనీస అవసరాలు అనుకుంటున్నారు. డబ్బు చేతిలో ఉన్నపుడు చేతులకు ఎముకలు లేవన్నట్లు అనాలోచితంగా ఖర్చు చేస్తున్నారు. ధనం ఉన్నపుడు ఎగిరి పడడంతో పాటు లేనపుడు అప్పులు చేయడానికి కూడా వెనకాడడం లేదు. విలాసాలకు, కనీస అవసరాలకు వ్యత్యాసాలు మరిచి పోతున్నారు. ఎంత సంపాదించిన నెలలోని తొలి వారంలోనే ఖర్చు పెడుతున్నారు. రేపటి అనుకోని ఆపదలను తట్టుకోవడానికి పొదుపు ధనం వినియోగపడుతుందనే కనీస అవగాహన కోల్పోతున్నారు. నేటి విద్యాలయాలు మార్కులు, ర్యాంకుల పాఠాలు నేర్పుతున్నారు. ఉద్యోగాలు పొందడానికి అవసర విద్యను బోధిస్తున్నారు. సంపాదించిన ధనాన్ని పొదుపుగా వాడుకోవడాన్ని నేర్పే విద్య కరువైయ్యింది. చాప ఉన్నంత వరకే కాళ్లు చాపుకోవడం నేర్పాలి. దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవడం బోధించాలి. ప్రమాదాలు చెప్పి రావని, అనారోగ్యాలు అడిగి రావని తెలుసుకోవాలి. అనుకోని విపత్తుల్లో ఆదా చేసిన డబ్బు ఆదుకుంటుందనే ఇంగితం మరువరాదు.

చిన్నతనం నుంచే పాకెట్ మనీని దాచుకోవడం నేర్పించాలి. తొలి దశలో గళ్ల గురిగిలో చిల్లర డబ్బుల్ని దాచుకోవడం నేర్పాలి. పిల్లలతో పాటు యువతకు డబ్బు ప్రాధాన్యాన్ని, ఖర్చు చేసే పద్ధతులను, పొదుపు చేయవలసిన అవసరాన్ని బోధించాలి. తమ బ్యాంక్‌లో పొదుపు ధనాన్ని దాచుకోవడం బోధించాలి. ప్రతి నెల వేతనంలో కొంత శాతాన్ని విధిగా పొదుపు చేయడం నేర్చుకోవాలి. మన అలవాట్లకు, వ్యయానికి సమీప సంబంధం ఉందని తెలపాలి. నేటి పొదుపు రేపటి భరోసా కావాలి. వృత్తిలో ఎదగడం, కుటుంబంలో శాంతి నెలకొనడం, పిల్లల చదువులు, గృహ నిర్మాణం, వాహనాల నిర్వహణ, పిల్లల పెళ్లిళ్లు, అనుకోని ఖర్చులు లాంటివని మన ఆర్థిక క్రమశిక్షణతో ప్రత్యక్ష సంబంధాలను కలిగి ఉంటాయని మరువరాదు. తెలియక పోవడం పొరపాటు కాకపోవచ్చని, తెలుసుకోకపోవడం నేర సమానమని తెలుసు కోవాలి. ఆర్థిక క్రమశిక్షణ లోపించిన కుటుంబాల్లో మానసిన ఒత్తిడి, అనారోగ్యాలు, అశాంతి, గొడవలు, పిల్లల పెంపకంలో ఇబ్బందులు, భవిష్యత్తు పట్ల అనిశ్చితి లాంటివని వెంటాడుతుంటాయి. నేటి విద్యావిధానంలో పాఠ్యాంశాలు, నైపుణ్యాలు, మానవీయ విలువలు, మంచి అలవాట్లు, కంప్యూటర్ అక్షరాస్యత లాంటి అంశాలతో పాటు ఆర్థిక అక్షరాస్యతను చిన్నతనం నుంచే కూడా విధిగా బోధించాలి.

సకల విలువలను నేర్పే కేంద్రాలుగా తరగతి గదులు మారాలి. నేటి బాలలే రేపటి పౌరులని, నేటి ఆదాయమే రేపటి ప్రమాదాలకు చికిత్స అని, నేటి పొదుపు చేసిన ధనమేరా రేపటి కుటుంబ సంతోషాలకు పునాది అని తెలుసుకుందాం. పొదుపు మంత్ర మహాత్మ్యాన్ని చిన్నారుల మనస్సుల్లో ముద్రిద్దాం.

బిఎంఆర్

ఉగ్రవాదం – మానవత్వంపై మాయని గాయం



చిటికెన కిరణ్ కుమార్
9490841284

మనిషి తన జీవితాన్ని నిర్మించుకోవడానికి ఎన్నో కలలు కంటాడు. కుటుంబంతో ఆనందంగా గడపాలని, పిల్లలకు మంచి భవిష్యత్తును అందించాలని, తన శ్రమతో నాలుగు రూపాయలు సంపాదించి గౌరవంగా బతకాలని కోరుకుంటాడు. సంతలో సరుకులు కొనడానికి వెళ్లిన వ్యక్తికి, బస్సులో ప్రయాణిస్తున్న కార్మికుడికి, రేపటి పరీక్ష కోసం సిద్ధమవుతున్న విద్యార్థికి కావలసింది ప్రశాంతమైన జీవితం మాత్రమే. అలాంటి సాధారణ మనుషుల జీవితాల్లో కి ఒక్కసారిగా చొచ్చుకొచ్చే బాంబు పేలుడు వారి ప్రాణాలనే కాదు, ఎన్నో కుటుంబాల భవిష్యత్తును కూడా ఛిన్నాభిన్నం చేస్తుంది. మనిషి సాధించిన విజ్ఞానం జీవనాన్ని సులభతరం చేయడానికి ఉపయోగపడాలి గానీ, అదే విజ్ఞానం ప్రాణాలను హరించే విధ్వంసానికి సాధనంగా మారడం నాగరిక సమాజం ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన విషాదం. ఉగ్రవాదం మిగిల్చే గాయం శరీరానికి తగిలిన గాయంతో ముగియదు; అది కుటుంబాల జ్ఞాపకాల్లో, సమాజపు మనసులో, తరతరాల భయాల్లో కొనసాగుతూనే ఉంటుంది.

2005 అక్టోబర్ 29న దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన వరుస బాంబు పేలుళ్లు ఈ చేదు వాస్తవాన్ని దేశం ముందుంచాయి. దీపావళి పండుగకు సిద్ధమవుతున్న సమయంలో పహర్‌గంజ్, సరోజినీ నగర్ మార్కెట్ ప్రాంతాలతో పాటు మరో ప్రాంతంలో పేలుళ్లు సంభవించాయి. కొనుగోళ్లతో సందడిగా ఉన్న వీధులు క్షణాల్లో భయానక దృశ్యాలుగా మారాయి. అనేకమంది ప్రాణాలు కోల్పోగా, ఎంతోమంది గాయాలపాలయ్యారు. ఆ రోజు తమ కుటుంబ సభ్యుల కోసం ఎదురుచూసిన వారి ఇళ్లలో ఆనందం స్థానంలో ఆవేదన నిండిపోయింది. పండుగ వెలుగుల మధ్య చీకటిని నింపిన ఈ దాడి, ఉగ్రవాదం ఎవరినీ వ్యక్తిగతంగా గుర్తించకుండా సాధారణ ప్రజల జీవితాలనే లక్ష్యంగా చేసుకోగలదని గుర్తుచేసింది. ఉగ్రవాదం పుట్టుకను అర్థం చేసుకోవడానికి దాని వెనుక పనిచేసే హింసాత్మక భావజాలాన్ని పరిశీలించాలి. రాజకీయ, సామాజిక లేదా ఇతర లక్ష్యాలను సాధించడానికి అమాయక ప్రజల ప్రాణాలను బలితీసుకోవడం ఏ కారణంతోనూ సమర్థనీయం కాదు. భిన్నాభిప్రాయం ప్రజాస్వామ్యంలో సహజం. ఒకరి ఆలోచన మరొకరికి నచ్చకపోవచ్చు. సమస్యలపై విభేదాలు ఉండవచ్చు. వాటిని చర్చలతో పరిష్కరించుకోవడం నాగరికత; భయాన్ని ఆయుధంగా మార్చి ఇతరులపై దాడి చేయడం అమానవీయత. చర్చించాల్సిన చోట తుపాకీని, ప్రశ్నించాల్సిన చోట బాంబును ఆశ్రయించే మనస్తత్వం సమాజంలో సహజీవనానికి ముప్పుగా మారుతుంది.

భిన్నత్వాన్ని అంగీకరించే సంస్కారం బలపడినప్పుడే హింసాత్మక ఆలోచనలకు ప్రజల మనసుల్లో స్థానం తగ్గుతుంది. భారతదేశం అనేక భాషలు, సంస్కృతులు, సంప్రదాయాలు, జీవన విధానాలతో కూడిన విస్తృత సమాజం. ఈ వైవిధ్యమే మన దేశానికి ప్రత్యేకమైన బలం. ఒక ప్రాంతంలో జరిగే విషాదం పట్ల మరో ప్రాంతానికి చెందిన ప్రజలు స్పందించడం, కష్టాల్లో ఉన్నవారికి సహాయం అందించడం మన సామాజిక అనుబంధానికి నిదర్శనం. ఉగ్రవాదం ప్రజల్లో అనుమానాలను పెంచి, పరస్పర విశ్వాసాన్ని దెబ్బతీయడానికి ప్రయత్నించవచ్చు. అలాంటి సమయంలో ఒక వ్యక్తి చేసిన నేరాన్ని మొత్తం సమాజానికి ఆపాదించడం మరో అన్యాయానికి దారితీస్తుంది. నేరానికి బాధ్యులైన వారిని ఆధారాలతో గుర్తించి చట్టం ముందు నిలబెట్టాలి. అమాయకులపై అనుమానాలు మోపడం, కులం లేదా మతం ఆధారంగా ప్రజలను దూరం పెట్టడం సమస్యకు పరిష్కారం కాదు. న్యాయం వ్యక్తుల చర్యలను ఆధారంగా చేసుకోవాలి; సామాజిక గుర్తింపులను కాదు.

ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన ఉగ్ర దాడులు కూడా ఇదే పాఠాన్ని నేర్పుతున్నాయి. భద్రత అనేది పోలీసు సిబ్బంది లేదా సైనిక బలగాల బాధ్యతతోనే ముగిసిపోదు. రద్దీ ప్రాంతాల్లో అపరిచిత వస్తువులు కనిపించినప్పుడు వాటిని తాకకుం డా అధికారులకు సమాచారం అందించడం, అత్యవసర సూచనలను పాటించడం, ప్రమాద సమయంలో గందరగోళం సృష్టించకుండా ఉండటం ప్రజలకూ అవసరం. అప్రమత్తత అంటే ప్రతి ఒక్కరినీ అనుమానించడం కాదు; ప్రమాద సూచనలను బాధ్యతతో గుర్తించి సరైన అధికారులకు తెలియజేయడం. భయం కాకుండా వివేకం ప్రజల ప్రవర్తన కు మార్గదర్శకంగా ఉండాలి.

ఉగ్రవాదాన్ని అరికట్టడానికి దేశాల మధ్య సహకారం కూడా అవసరం. నేరాలకు సంబంధించిన సమాచారాన్ని చట్టబద్ధంగా పంచుకోవడం, అక్రమంగా నిధులు సమకూర్చే మార్గాలను గుర్తించడం, హింసాత్మక నెట్‌వర్క్‌లను అడ్డుకోవడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని బాధ్యతాయుతంగా వినియోగించడం వంటి చర్యలు సమన్వయంతో సాగాలి. ఒక దేశంలో రూపొందే హింసాత్మక ప్రణాళిక మరొక దేశ ప్రజలను లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉన్నందున అంతర్జాతీయ సహకారానికి ప్రాధాన్యం పెరిగింది. అదే సమయంలో న్యాయపద్ధతులు, మానవ హక్కులు, చట్టపాలన పట్ల గౌరవం నిలవాలి. ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే చర్యలు నిర్దిష్టమైన ఆధారాలపై ఆధారపడాలి. చట్టాన్ని గౌరవిస్తూ భద్రతను కాపాడినప్పుడే ప్రజల్లో సంస్థల పట్ల విశ్వాసం బలపడుతుంది.

శాంతి అంటే సమస్యలు లేని ప్రపంచం అని కాదు. అభిప్రాయ భేదాలు, పోటీలు, ప్రయోజనాల మధ్య ఘర్షణలు ఎప్పుడూ ఉండవచ్చు. వాటిని హింసకు దారితీయకుండా పరిష్కరించుకునే సామర్థ్యమే నిజమైన శాంతి. కుటుంబంలో మొదలయ్యే పరస్పర గౌరవం, పాఠశాలలో అలవడే సహనం, సమాజంలో పెరిగే సహకారం, దేశాల మధ్య కొనసాగాల్సిన చర్చలు— ఇవన్నీ శాంతియుత జీవనానికి బలమైన పునాదులు. శాంతి గురించి మాట్లాడ టం మాత్రమే కాకుండా, మన రోజువారీ ప్రవర్తనలోనూ దాన్ని పాటించాలి. నిర్ధారణ లేని వార్తను పంచుకోకపోవడం, భిన్నమైన అభిప్రాయాన్ని విన డం, కష్టాల్లో ఉన్నవారికి సహాయం చేయడం వంటి చిన్న చర్యలు కూడా పెద్ద సామాజిక మార్పుకు దోహదం చేస్తాయి. మానవత్వం అనేది సభల్లో వినిపించే మాట మాత్రమే కాదు; మనిషి పట్ల మనం చూపే ప్రవర్తనలో కనిపించాలి.

ఉగ్రవాదం సృష్టించే భయానికి సమాజం తన ఐక్యతను కోల్పోవడం దానికి మరో విజయాన్ని అందించినట్లవుతుంది. అందుకే ఇలాంటి దాడుల తర్వాత ప్రజలు సంయమనం పాటించడం, బాధితులకు అండగా నిలవడం, న్యాయ విచారణకు సహకరించడం, వదంతులకు దూరంగా ఉండడం అవసరం. హింసకు పాల్పడినవారిని చట్టం ముందు నిలబెట్టాలి; అదే సమయంలో అమాయకులపై ద్వేషం మళ్లకుండా జాగ్రత్త పడాలి. మనిషి ప్రాణానికి ఉన్న విలువను గుర్తించే దృష్టి బలపడితేనే ఉగ్రవాదం కోరుకునే భయం, విభజనలకు సమాజం సమాధానం చెప్పగలదు. దేశ భద్రతను కాపాడే అప్రమత్తతకు, ప్రజల మధ్య విశ్వాసాన్ని నిలబెట్టే మానవీయతకు సమానమైన ప్రాధాన్యం



2005 అక్టోబర్ 29న ఢిల్లీలో వరుస బాంబుపేలుళ్ల విధ్వంస దృశ్యాలు

అమెరికాలో 2001 సెప్టెంబర్ 11న జరిగిన దాడులు వేలాది కుటుంబాలను విషాదంలోకి నెట్టాయి. యూరప్‌లోని పలు నగరాలు, ఆఫ్రికా, పశ్చిమాసియా ప్రాంతాలు ఉగ్రవాద హింసను ఎదుర్కొన్నాయి. పాకిస్థాన్‌లోని పెషావర్ పాఠశాలపై 2014లో జరిగిన దాడిలో చిన్నారులు సహా ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. ఇలాంటి ఘటనలు భౌగోళికంగా వేర్వేరు చోట్ల జరిగినా, వాటి వెనుక మిగిలిన కన్నీరు ఒకటే. పాఠశాలకు వెళ్లిన పిల్లవాడు, కార్యాలయానికి వెళ్లిన ఉద్యోగి, ప్రయాణంలో ఉన్న సాధారణ పౌరుడు— వీరందరికీ సురక్షితంగా తిరిగి ఇంటికి చేరే హక్కు ఉంది. ఏ దేశ ప్రజల ప్రాణాలైనా సమానమైన విలువ కలిగినవే. ఈ అవగాహన అంతర్జాతీయ సహకారానికి పునాది కావాలి.

ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో భద్రతా వ్యవస్థల పాత్ర ఎంతో కీలకం. ప్రమాదాన్ని ముందుగానే గుర్తించే నిఘా, అనుమానాస్పద కార్యకలాపాలపై సమన్వయంతో స్పందించడం, పేలుడు పదార్థాలను నిర్వీర్యం చేసే నిపుణుల సేవలు, గాయపడిన వారికి వేగంగా వైద్య సహాయం అందించడం వంటి చర్యలు ప్రాణాలను కాపాడగలవు. అయితే ఇవ్వాలి. ఒక పేలుడు కొన్ని క్షణాల్లో భవనాలను ధ్వంసం చేయవచ్చు; కానీ దానివల్ల ఏర్పడిన బాధను తగ్గించడానికి సంవత్సరాల ఆదరణ అవసరమవుతుంది. కోల్పోయిన ప్రాణాలను తిరిగి తీసుకురాలేకపోయినా, మరో కుటుంబం అలాంటి విషాదాన్ని ఎదుర్కోకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చు. భద్రతా వ్యవస్థలను బలోపేతం చేయడం, యువతలో వివేచన పెంచడం, బాధితులకు అండగా నిలవడం, భిన్నత్వాన్ని గౌరవించడం, ప్రపంచ దేశాల మధ్య సహకారాన్ని పెంపొందించడం మన చేతుల్లో ఉన్న మార్గాలు. ద్వేషం మనుషులను విడదీస్తుంది; కరుణ వారిని దగ్గర చేస్తుంది. భయం జీవితాన్ని కుదిస్తుంది; విశ్వాసం ముందుకు నడిపిస్తుంది. ఉగ్రవాదం మానవత్వంపై మాయని గాయం మిగిల్చినా, ఆ గాయాన్ని మరింత లోతుగా చేయకుండా నివారించే శక్తి మన సమిష్టి బాధ్యతలో ఉంది. ప్రతి మనిషి సురక్షితంగా జీవించే హక్కును గౌరవించే సమాజమే నిజమైన నాగరిక సమాజం. మానవ ప్రాణాన్ని మించిన సిద్ధాంతం లేదని, శాంతిని మించిన విజయం లేదని మన జీవన విధానమే చాటాలి.

ప్రతిష్టంభన కొనసాగిస్తున్న ఇజ్రాయెల్ తీర్పు

ఇజ్రాయెల్ రాజకీయాలు మరోసారి అనిశ్చితి కూడలిలో నిలిచాయి. అక్టోబరు 27న జరిగిన పార్లమెంటరీ ఎన్నికలు ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహును అధికారానికి దూరం చేయలేకపోయాయి; అదే సమయంలో ఆయనకు మరోసారి నిరాటంకంగా పాలించే అవకాశాన్నీ ఇవ్వలేదు. అక్టోబరు 29 నాటికి వెలువడిన ప్రాథమిక లెక్కింపులో నెతన్యాహు నేతృత్వంలోని కూటమికి 53 స్థానాలు, గాడి ఐసెన్‌కాట్ నాయకత్వంలోని ప్రతిపక్ష కూటమికి 48 స్థానాలు లభించే అవకాశముంది. అరబ్ పార్టీలకు కలిపి 19 స్థానాలు దక్కవచ్చని అంచనా. 120 మంది సభ్యులున్న నెస్సెట్ (ఇజ్రాయెల్ పార్లమెంటు)లో ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి 61 స్థానాలు అవసరం. అంటే, అత్యధిక స్థానాలు సాధించే కూటమి కూడా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేని పరిస్థితి ఏర్పడింది. రాయిటర్స్, అసోసియేటెడ్ ప్రెస్, బిబిసి, ది గార్డియన్ విశ్లేషణల సారాంశం ఇదే: నెతన్యాహు రాజకీయంగా ఓడిపోలేదు, కానీ ఆయనకు ప్రజలు తిరుగులేని అధికారాన్ని కూడా అప్పగించలేదు.

ఈ ఎన్నికలను కేవలం అధికార, ప్రతిపక్షాల మధ్య పోటీగా చూడటం పొరపాటు. 2023 అక్టోబరు 7న హమాస్ జరిపిన దాడులు, ఆ తర్వాత గాజాలో సాగిన యుద్ధం, లెబనాన్, ఇరాన్‌తో ఘర్షణలు, దేశ భద్రతకు సంబంధించిన వైఫల్యాలు ఈ ఎన్నికలపై గణనీయమైన ప్రభావం చూపాయి. దాడులను ముందుగా గుర్తించడంలో విఫలమైన భద్రతా వ్యవస్థకు ఎవరు బాధ్యత వహించాలి? యుద్ధ విజయాల ప్రకటనలు ప్రజలకు శాశ్వత భద్రతను అందించగలవా? ఈ ప్రశ్నలకు నెతన్యాహు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సి ఉంది. అయితే, సైనిక విజయాలు, ఇరాన్ నుంచి ముప్పు వంటి అంశాలను ముందుకు తెచ్చి తన నాయకత్వమే దేశానికి రక్షణ కవచమని ఆయన ప్రచారం చేశారు. ప్రతిపక్షం మార్పును కోరినా, ప్రత్యామ్నాయ ప్రభుత్వానికి అవసరమైన ఐక్యతను ఓట్ల రూపంలో పూర్తిగా సాధించలేకపోయింది.

నెతన్యాహు కూటమి ప్రస్తుత పార్లమెంటులో ఉన్న 68 స్థానాల నుంచి 53 స్థానాలకు పడిపోవడం గమనించాల్సిన పరిణామం. ఇది ఆయన నాయకత్వంపై అసంతృప్తికి సూచన. అయినప్పటికీ, ఆయన రాజకీయంగా అంతమయ్యారని ప్రకటించడం తొందరపాటు అవుతుంది. ది వాషింగ్టన్ పోస్ట్ విశ్లేషణ సూచించినట్లుగా, ఆయన రాజకీయంగా నిలదొక్కుకునే సామర్థ్యాన్ని ఈ ఫలితం మరోసారి వెల్లడించింది. అవినీతి కేసులు, 2023 భద్రతా వైఫల్యాలపై స్వతంత్ర విచారణకు సంబంధించిన వివాదాలు, అల్ట్రా ఆర్థడాక్స్ వర్గాలకు సైనిక సేవ నుంచి మినహాయింపులు, అతివాద మిత్రపక్షాల ఒత్తిళ్లు ఆయన ముందున్న సవాళ్లు. అయినా, ప్రతిపక్ష కూటమిలోని విభిన్న రాజకీయ శక్తుల మధ్య విభేదాలే ఆయనకు మరో అవకాశాన్ని కల్పించవచ్చు.

ఇప్పుడు ప్రభుత్వ ఏర్పాటులో అరబ్ పార్టీల పాత్ర కీలకం కానుంది. వాటికి 19 స్థానాలు లభిస్తే, నెతన్యాహును వ్యతిరేకించే కూటమికి మెజారిటీ సాధించే మార్గం తెరుచుకుంటుంది. కానీ అరబ్ పార్టీల మద్దతుతో ప్రభుత్వం ఏర్పాటు చేయడాన్ని ప్రతిపక్షంలోని పలువురు నేతలు గతంలోనే వ్యతిరేకించారు. నెతన్యాహు కూడా వారితో సహకారానికి నిరాకరించారు. ఇక్కడ ఇజ్రాయెల్ ప్రజాస్వామ్యంలో అంతర్లీనంగా ఉన్న వైరుధ్యం బయటపడుతోంది. అరబ్ పౌరుల ఓట్లు ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగమే అయితే, ప్రభుత్వ ఏర్పాటులో వారి రాజకీయ పాత్రను ముందుగానే తిరస్కరించడం ఎంతవరకు సమర్థనీయం? వారి ప్రాతినిధ్యాన్ని అంగీకరించకుండా ప్రజాస్వామ్య సమానత్వం గురించి మాట్లాడటం ఆచరణలో విరుద్ధమైన వైఖరి అవుతుంది. అయితే, అరబ్ పార్టీల మద్దతుతో ప్రభుత్వం ఏర్పడినా అది స్థిరంగా కొనసాగుతుందని చెప్పలేం. ఐసెన్‌కాట్ కూటమిలోని మితవాద, మధ్యేవాద, వామపక్ష పార్టీల మధ్య భద్రత, పాలస్తీనా సమ స్య, మతపరమైన విధానాలపై విభేదాలున్నాయి. మరోవైపు, నెతన్యాహు ప్రత్యర్థి పార్టీల నుంచి కొందరిని తనవైపు తిప్పుకోవడం ద్వారా ఐక్య ప్రభుత్వ ఏర్పాటుకు ప్రయత్నించడం ద్వారా మెజారిటీ సాధించవచ్చు. ఈ రెండు మార్గాలూ విఫలమైతే మరో ఎన్నిక అనివార్యం కావచ్చు. ఇలాంటి పరిస్థితి దేశ పరిపాలనను బలహీనపరచడంతోపాటు యుద్ధం, ఆర్థిక వ్యవస్థ, అంతర్జాతీ య సంబంధాలపై అనిశ్చితిని పెంచుతుంది.

ఈ ఎన్నికల్లో అరబ్ పౌరుల అధిక భాగస్వామ్యం కూడా చారిత్రక ప్రాధాన్యం సంతరించుకుంది. దాదాపు 77.7శాతం ఓటింగ్ నమోదవడం రెండు దశాబ్దాలకు పైగా కాలంలో అత్యధిక స్థాయిగా వార్తా సంస్థలు పేర్కొన్నాయి. అరబ్ పార్టీలకు లభించనున్న ప్రాతినిధ్యం వారి రాజకీయ స్వరాన్ని నిర్లక్ష్యం చేయలేమని స్పష్టం చేస్తోంది. అదే సమయంలో, పాలస్తీనా రాజ్య ఏర్పాటు విషయంలో ప్రధాన యూదు రాజకీయ పార్టీలలో విస్తృతమైన ఏకాభిప్రాయం లేకపోవడం, ఇజ్రాయెల్ అంతర్జాతీయ ప్రతిష్ఠ దెబ్బతినడం వంటి సమస్యలకు ఎన్నికలు పరిష్కారం చూపలేదు.

అంతిమంగా, ఇజ్రాయెల్ ఎన్నికల ఫలితం నెతన్యాహు విజయం లేదా ప్రతిపక్ష ఓటమి అనే సరళమైన నిర్వచనానికి అందదు. ఇది విభజిత సమాజం ఇచ్చిన అప్రమత్తమైన తీర్పు. కొత్త ప్రభుత్వం ఏర్పడటం మాత్రమే ప్రజాస్వామ్య విజయానికి కొలమానం కాదు; భద్రతా వైఫల్యాలకు జవాబుదారీతనం, మైనారిటీలకు సమాన రాజకీ య హక్కులు, యుద్ధానికి బదులుగా శాంతికి ప్రాధాన్యం, పాలస్తీనీయుల హక్కులపై న్యాయబద్ధమైన విధానం కూడా అంతే ముఖ్యం. ఎన్నికల అనంతర చర్చల్లో ఈ అంశాలు పక్కకు నెట్టబడితే, ప్రభుత్వ పగ్గాలు ఎవరి చేతిలో ఉన్నా ఇజ్రాయెల్ సంక్షోభం కొనసాగుతుంది. ప్రజాస్వామ్యం అంటే కేవలం ఓట్ల లెక్కింపు కాదు; ప్రజల తీర్పులోని హెచ్చరికలను అధికారంలో ఉన్నవారు ఎంత నిజాయితీగా స్వీకరిస్తారన్నదే అసలైన పరీక్ష.

డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
ramkishore.1504@gmail.com

మోదీ పాలనపై ప్రజల్లో అసంతృప్తి

- అగ్రనేతల కంచుకోటల్లోనూ బిజెపికి ఎదురుదెబ్బలు
- మోదీకి మీడియా ఫోబియా ఉంది
- జర్నలిస్టులను ఎదుర్కొనే ధైర్యం పిఎంకు లేదు
- బిజెపి వ్యతిరేక శక్తుల విజయం తథ్యం
- టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్



ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రధాని మోదీ పాలనపై యువతతో పాటు వివిధ వర్గాల ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని, బిజెపి అగ్రనేతలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలతో పాటు ఆ పార్టీకి కంచుకోటలుగా ఉన్న ప్రాంతాల్లోనూ ఎదురవుతున్న రాజకీయ పరిణామాలు మోదీ పాలనపై ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తికి నిదర్శనమని టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. గాంధీభవన్‌లో గురువారం జరిగిన మీడియా సమావేశంలో దేశంలో బ్యాలెట్‌లో కాంగ్రెస్ విజయాలపై ప్రధాని మోదీ చేసిన ట్విట్‌పై ఆయన స్పందిస్తూ రాజకీయాల్లో ఎన్ని స్థానాల్లో గెలిచామన్నదే కాకుండా, ఎక్కడ గెలిచామన్నది కూడా ముఖ్యమని, నాగ్‌పూర్‌లో కాంగ్రెస్ విజయం సాధించి బిజెపికి గట్టి సమాధానం చెప్పిందని పేర్కొన్నారు. మోదీకి మీడియా ఫోబియా ఉందని, జర్నలిస్టులను ఎదుర్కొనే ధైర్యం ఆయనకు లేదని విమర్శించారు. నాగ్‌పూర్, వారణాసి, పాట్నా, పుణే తదితర ప్రాంతాల్లో చోటుచేసుకున్న ఎన్నికల ఫలితాలలో బిజెపి పాలనపై యువతతో పాటు వివిధ వర్గాల ప్రజల్లో అసంతృప్తి తెలియజేస్తుందన్నారు. గోరఖ్‌పూర్‌లో బిజెపి స్వల్ప ఆధిక్యంతో బయటపడిందని వ్యాఖ్యానించారు. వివిధ ప్రాంతాల్లో బిజెపి పరిస్థితిపై ప్రధాని మోదీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో బిజెపి వ్యతిరేక శక్తులు మరింత బలపడుతున్నాయని, ఈ శక్తుల విజయం తథ్యమన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో కుంటిసాకులు చెప్పేవారికి సమాధానం లభించిందని అన్నారు. ఎస్ఐఆర్ ద్వారా మరోసారి అధికారంలోకి రావాలని బిజెపి ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

రైళ్లను నిరాకరించడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు

ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఇండియా కూటమి నిర్వహించనున్న ర్యాలీకి కాంగ్రెస్ శ్రేణులను తరలించేందుకు రైళ్లను నిరాకరించడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయని మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. ప్రధాని, కేంద్ర హోంమంత్రి కార్యాలయాల ఒత్తిడి మేరకే ఈ నిర్ణయం తీసుకున్నారని విమర్శించారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా కాంగ్రెస్ శ్రేణులను ఢిల్లీకి తరలిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా రావడం వల్ల ఒరిగేదేమీ లేదని ఆయన వ్యాఖ్యానించారు.

ఎల్ నినోపై రాజకీయ విమర్శలు తగదు

ఎల్ నినో వంటి ప్రకృతి సంబంధిత పరిణామాలను రాజకీయాలతో ముడిపెట్టడం సరికాదని, ఎల్ నినోను బటన్ తిప్పి తెప్పించవచ్చన్నట్లుగా మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడుతున్నారని మహేష్ కుమార్ విమర్శించారు. విపత్తుల సమయంలో రాజకీయ విమర్శలకు దిగడం తగదన్నారు. కరోనా సమయంలో కెసిఆర్ చేసిన వ్యాఖ్యలను కూడా ఈ సందర్భంగా ప్రస్తావిస్తూ తాము పూర్తిగా సహరించామన్నారు.
మంత్రి కొండా సురేఖకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని మహేష్ కుమార్ గౌడ్ ఒక ప్రశ్నకు సమాధానమిచ్చారు. ఎంఎల్‌ఎ అనిరుధ్ ప్రస్తావించిన నిధుల అంశాన్ని పార్టీ క్రమశిక్షణ కమిటీ పర్యవేక్షిస్తోందని ఆయన మరో ప్రశ్న సమాధానమిచ్చారు. ఒక్క అనిరుధ్ నియోజకవర్గంలోనే కాదని, అసలు రాష్ట్రంలో నిధుల కొరత కొరత ఉన్న విషయం వాస్తవమని, నిధుల కొరతకు గత బిఆర్ఎస్ ప్రభుత్వం విచ్చలవిడిగా చేసిన అప్పులే కారణమని ఆయన అన్నారు.

ఆంధ్రప్రదేశ్‌కు తెలంగాణ విద్యుత్ సహాయక బృందాలు

ప్రజాపక్షం/హైదరాబాద్: అర్నబ్ తుఫాన్ దాటికి తీవ్రంగా దెబ్బతిన్న ఆంధ్రప్రదేశ్ విద్యుత్ వ్యవస్థను వేగంగా పునరుద్ధరించేందుకు తెలంగాణ ప్రభుత్వం మానవీయ దృక్పథంతో సహాయ హస్తం అందించింది. ఎపి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవిలు గురువారం తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్కకు ఫోన్ చేసి సహాయం అందించాలని కోరారు. తుఫాన్ కారణంగా అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, ఏలూరు, ఎన్‌టిఆర్, గుంటూరు తదితర జిల్లాల్లో 16 వేలకు పైగా విద్యుత్ స్తంభాలు నేలకొరిగి, వందలాది గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయినట్లు చం ద్రబాబు వివరించారు. ఎపి సిఎం విజ్ఞప్తిపై స్పందించిన డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, ఈ విషయాన్ని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డితో చర్చించారు. అనంతరం బాధితులకు అండగా నిలిచేందుకు ఎపికి సహాయక బృందాలను పంపాలని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్‌తో పాటు టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండి జితేష్ వి.పాటిల్, ఎన్ పిడిసిఎల్ సిఎండి వరుణ్ రెడ్డిలను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో లైన్‌ల మరమ్మతులు, విద్యుత్ పునరుద్ధరణ పనులను వేగవంతం చేసేందుకు టెక్నికల్ బృందాలను, అవసరమైన యంత్రాలను తక్షణమే పంపే ఏర్పాట్లు చేయాలన్నారు. ఉప ముఖ్యమంత్రి ఆదేశాలతో టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండి జితేష్ వి.పాటిల్ తక్షణ చర్యలు చేపట్టి ఎస్‌పిడిసిఎల్ ఉద్యోగులతో కూడిన ప్రత్యేక సహాయక బృందాలను ఆంధ్రప్రదేశ్‌కు పంపించారు. ఈ బృందాలు తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించే పనుల్లో పాల్గొననున్నాయి. ఆపద సమయంలో ప్రాంతీయ భేదాలకు అతీతంగా తెలంగాణ ప్రభుత్వం స్పందించిన తీరు రెండు తెలుగు రాష్ట్రాల నడుమ ఉన్న సోదరభావానికి, ఆత్మీయ బంధానికి నిదర్శనంగా నిలిచింది.

గ్రామాల అభివృద్ధికి కృషి



- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క

ప్రజాపక్షం/వెంకటాపూర్/ములుగు: గ్రామాల అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించి, మౌలిక సదుపాయాల కల్పనకు అన్ని విధాలా కృషి చేస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క అన్నారు. గురువారం వెంకటాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చైర్మన్ శ్రీనివాస్‌తో పాటు కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మండల కేంద్రంలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన అంతర్గత సీసీ రోడ్లు, డ్రెయిన్లను మంత్రి ప్రారంభించారు. సిఆర్ఆర్ (ప్లెయిన్) 2025–26 నిధులతో రూ.54 లక్షల అంచనా వ్యయంతో సిసి రోడ్లు, సిఆర్ఆర్ (ఎస్‌సిపి) 2024–25 నిధులతో రూ.45 లక్షల అంచనా వ్యయంతో సిసి డ్రెయిన్ల పనులు చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గతంలో కాలనీలో పర్యటించినప్పుడు ఇచ్చిన హామీ మేరకు అభివృద్ధి పనులను మంజూరు చేసినట్లు తెలిపారు. స్థానిక సర్పంచ్, నాయకుల సూచనలు, సలహాలు, విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకొని పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ గ్రామాల అభివృద్ధికి తన శాయశక్తులా కృషి చేస్తానని అన్నారు. ఆశించిన మేర వర్షాలు కురవని నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటి వనరులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంద ని మంత్రి అన్నారు. గ్రామాల్లో రోడ్లు, మురుగునీటి కాలువలు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తున్న ట్లు తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి దశలవారీగా అభివృద్ధి పనులు చేపడతామని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాల అభివృద్ధి లో భాగస్వాములు కావాలని కోరారు. సొసైటీ అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపడు తూ రైతులకు, ప్రజలకు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్, మల్లారెడ్డి, పంచాయతీరాజ్ రాష్ట్ర డైరెక్టర్ బైరెడ్డి భగవాన్‌రెడ్డి, సర్పంచ్‌లు, మండల నాయకులు, పిఎసిఎస్ డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.



మతసామరస్యానికి మోటూరి కృషి ఆదర్శణీయం

రాజ్యాంగ పరిరక్షణే కెపికి నిజమైన నివాళి: జస్టిస్ చంద్రకుమార్, ఇటి నరసింహ

ప్రజాపక్షం/హైదరాబాద్: మతసామరస్యం, ప్రజాస్వామ్య పరిరక్షణ, ప్రజాహక్కుల సాధన కోసం మోటూరి కృష్ణ ప్రసాద్ చేసిన కృషి చిరస్మరణీయమని జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య హక్కులను కాపాడుకోవడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి నరసింహ పేర్కొన్నారు. వామపక్ష శ్రేయోభిలాషి, భారత జాతీయ ఉద్యమ జాతీయ కన్వీనర్ మోటూరి కృష్ణ ప్రసాద్ జయంతి సందర్భంగా గురువారం హైదరాబాద్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో ఇండియన్ నేషనలిస్ట్ మూవ్‌మెంట్ (ఐఎన్ఎం) ఆధ్వర్యంలో స్మారక సభ నిర్వహించారు. ఆ సంస్థ జాతీయ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ జబేర్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో పలువురు మేధావులు, వామపక్ష నాయకులు కృష్ణ ప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ పాతబస్తీలో జన్మించిన కృష్ణ ప్రసాద్ విద్యార్థి దశ నుంచే ఉద్యమాల పట్ల ఆకర్షితులై అనేక పోరాటాల్లో పాల్గొన్నారని గుర్తుచేశారు. ఉర్దూ, ఇంగ్లీష్, తెలుగు భాషల్లో అనర్గళంగా ప్రసంగిస్తూ యువతను ఉద్యమాల వైపు ఆకర్షించారని తెలిపారు. మత ఘర్షణలకు వ్యతిరేకంగా ప్రజల మధ్య స్నేహభావం, సామరస్య వాతావరణం నెలకొల్పేందుకు సంస్థను ఏర్పాటు చేసి అనేక సదస్సులు, సమావేశాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారని కొనియాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం తెలంగాణ రాష్ట్ర డెమొక్రటిక్ ఫోరం ఏర్పాటులోనూ, దాని కార్యకలాపాల్లోనూ ఆయన క్రియాశీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ఇటి నరసింహ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజలు పోరాడి సాధించుకున్న హక్కులను హరిస్తోందని విమర్శించారు. ఓటు హక్కును తొలగించే ప్రమాదం ఉన్న ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.
ప్రజాస్వామ్య వ్యవస్థను, రాజ్యాంగాన్ని కాపాడేందుకు ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఢిల్లీలో యువత సాగించిన పోరాటాలను చూసి ఉంటే కామ్రేడ్ మోటూరి కృష్ణ ప్రసాద్ గర్వపడేవారని పేర్కొన్నారు. కరోనా సమయంలో విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటున్న ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు శాస్త్రవేత్తగా కృష్ణ ప్రసాద్ కృషి చేశారని నరసింహ గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎఐకెఎంఎస్ జాతీయ కార్యదర్శి జెవి చలపతి, ఐఎఫ్‌టియు జాతీయ కార్యదర్శి ప్రదీప్, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె. గోవర్ధన్, సిపిఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్, శ్రామిక మహిళా ఫోరం రాష్ట్ర కన్వీనర్ ప్రేమ్ పావని, ఐఎన్ఎం జాతీయ ఉపాధ్యక్షుడు మహమ్మద్ అబ్దుల్ మజీద్, ప్రొఫెసర్ వినాయక్ రెడ్డి, మసియోద్దీన్ అఫ్సర్, కైరుద్దీన్ సూఫీ తదితరులు ప్రసంగించారు.

‘ఖేలో ఇండియా’ గేమ్స్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీని ఆహ్వానించాలని వాకిటి శ్రీహరి విజ్ఞప్తి

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణలో నిర్వహించనున్న ఖేలో ఇండియా గేమ్‌ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించి, రాష్ట్రానికి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ సూచించారు. క్రీడాకారులకు ప్రపంచస్థాయి సదుపాయాలు కల్పించడంతో పాటు వసతి, రవాణా, భద్రత, వైద్యం, క్రీడా వేదికల ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ మేరకు గురువారం న్యూఢిల్లీలో తెలంగాణ క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి సమావేశమై ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా ఖేలో ఇండియా గేమ్స్ ప్రారంభోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ముఖ్య అతిథిగా ఆహ్వానించాలని వాకిటి శ్రీహరి కోరారు. ప్రధాని హాజరైతే పోటీలకు జాతీయ స్థాయిలో ప్రాధాన్యత పెరగడంతో పాటు యువ క్రీడాకారులకు స్ఫూర్తి లభిస్తుందని పేర్కొన్నారు. పోటీలకు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే క్రీడాకారులు, కోచ్‌లు, సహాయక సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కేంద్ర మంత్రి సూచించారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ రూపొందించిన కార్యాచరణ ప్రణాళికను అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.
ఈ క్రీడల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతుల ను గుర్తించి, వారికి మెరుగైన శిక్షణ, ప్రోత్సా హం అందించే అవకాశాలపైనా చర్చించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రభుత్వ సలహాదారు ఎపి జితేందర్ రెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యద ర్శి వాణి ప్రసాద్, స్పోర్ట్స్ అథారిటీ వైస్ చైర్మ న్, మేనేజింగ్ డైరెక్టర్ సోనీ బాలాదేవి, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను శ్రీకృష్ణ సదర్ సమ్మేళనం ఉత్సవ కమిటీ సభ్యులు గురువారం ప్రజాభవన్‌లో కలిసి నవంబర్ 4న నిర్వహించనున్న సదర్ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపి,టిపిసిసి కార్యనిర్వాహక అధ్యక్షుడు అంజన్‌కుమార్ యాదవ్, కార్పొరేటర్ శంకర్ యాదవ్, పాండు యాదవ్, ప్రసాద్ యాదవ్, ప్రవీణ్ యాదవ్, రాజేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం మొండిచేయి

రూ.18 వేల వేతన హామీ ఏమైంది?: మొట్టే నర్సింహ్మా



ప్రజాపక్షం/హైదరాబాద్: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొట్టే నర్సింహా విమర్శించారు. ఎన్నికల సమయంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు నెలకు రూ.18 వేల వేతనం చెల్లిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదని, ఆ హామీ నీటిమూటగా మారిందని ఆరోపించారు. హిమాయత్‌నగర్‌లోని ఎఐటియుసి కార్యాలయంలో గురువారం రాష్ట్ర అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర సమితి సమావేశం యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నరాటి ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో మొట్టే నర్సింహా మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కెసిఆర్ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల వేతనాలను మూడు విడతల్లో పెంచారని తెలిపారు. రూ.4,100 నుంచి రూ.13,650 వరకు వేతనాలు పెరిగాయని పేర్కొన్నారు. అలాగే గ్రేడ్2 సూపర్వైజర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసి నియామకాలు చేపట్టిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన రూ.18 వేల వేతన హామీని ఇప్పటికైనా అమలు చేయాలని కోరారు. అంగన్‌వాడీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి, వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న చింతపండు, పోపులు, గుడ్ల నాణ్యతపై కూడా సమావేశంలో ఆందోళన వ్యక్తం చేశారు. చిన్నారులకు అందించే ఆహార పదార్థాల నాణ్యతను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు న్యాయం జరిగేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తక్షణ చర్యలు తీసుకోవాలని ఎఐటియుసి మాజీ జాతీయ కార్యదర్శి బివి విజయలక్ష్మి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర ఇంచార్జి ప్రేమ్ పావని, గౌరవ అధ్యక్షుడు టేకుమళ్ల సమ్మయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.కరుణకుమారి, నాయకులు సిహెచ్.సీతామహాలక్ష్మి, సరస్వతి, పార్వతి, చంద్రకళ, ప్యారిజాన్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

కెటిఆర్‌వి పచ్చి అబద్ధాలు

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మండిపాటు



ప్రజాపక్షం/హైదరాబాద్ : అధికారం కోల్పోయిన అసహనంతోనే బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్ ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మండిపడ్డారు. ఎల్‌నినో, కరువు పరిస్థితులపై అవగాహన లేకుండా పరస్పర విరుద్ధ వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. గురువారం సిఎల్‌పి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టులో తొలి దశగా 21 కిలోమీటర్ల అభివృద్ధికి రూ.7,345 కోట్లతో డిపిఆర్ రూపొందించి టెండర్లు పిలిచామని తెలిపారు. ఇటీవల నిర్వహించింది ప్రజాభిప్రాయ సేకరణ కాదని, ఎడిబి సమక్షంలో నిర్వాసితులతో జరిగిన స్టేక్‌హోల్డర్ల సమావేశమని స్పష్టం చేశారు. డిపిఆర్ లేదంటూనే లక్షన్నర కోట్లు ఖర్చవుతాయని కెటిఆర్ ఎలా చెబుతున్నారని ప్రశ్నించారు.తెలంగాణలో విద్యుత్ కోతలు లేవని, 20 వేల మెగావాట్ల డిమాండ్ వచ్చినా సరఫరా చేశామని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. విద్యుత్ కొరతతో నిలిచిపోయిన పరిశ్రమ లేదా ఐటీ కంపెనీని చూపించాలని కెటిఆర్‌కు సవాల్ విసిరారు. కాళేశ్వరం బ్యారేజీల్లో నీటి నిల్వపై ఎన్‌డిఎస్‌ఎ సూచనలను పరిగణనలోకి తీసుకుంటూనే దేవాదుల, సీతారామసాగర్ ప్రాంతాల్లో నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయని తెలిపారు. అధిక నీటి వినియోగం ఉండే పంటలకు బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలని మాత్రమే ప్రభుత్వం సూచించిందని, రైతులకు అండగా నిలవాల్సిన ప్రతిపక్షాలు కరువు పరిస్థితులను రాజకీయాలకు వాడుకోవడం దారుణమని విమర్శించారు.

రాష్ట్రంలో రానున్న మూడు రోజులు వర్షాలు

హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు

ప్రజాపక్షం/హైదరాబాద్ : అర్నబ్ తుఫాన్ ప్రభావంతో రాష్ట్రంలో రానున్న మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందన్నారు. రాబోయే రెండు రోజుల పాటు తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉండనున్న నేపథ్యంలో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. గురువారం నుంచి ఆదివారం వరకు రాష్ట్రంలో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. అయితే ఆదివారం నుంచి మంగళవారం వరకు వర్షాల తీవ్రత కొంత పెరిగే అవకాశముందన్నారు. ఈ సమయంలో కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. అర్నబ్ తుపాను ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా పగటి ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గినట్లు వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. కొన్ని జిల్లాల్లో సాధారణంతో పోలిస్తే 1.5 నుంచి 5.8 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు తగ్గినట్లు చెప్పారు.

పోలీసు అమరవీరుల స్మరణలో మెగా రక్తదాన శిబిరాలు

- 38 కేంద్రాల్లో రక్తదాన కార్యక్రమం.. 5,700 యూనిట్ల సేకరణ లక్ష్యం
- శిబిరాలను ప్రారంభించిన డిజిపి సివి ఆనంద్

ప్రజాపక్షం/హైదరాబాద్ :ప్రాణదానంతో సమానమైన రక్తదానాన్ని ఉద్యమంలా చేపట్టి, సేకరించిన రక్తాన్ని ప్రభుత్వ ఆసుపత్రులకు అందించడం అభినందనీయమని రాష్ట్ర డిజిపి సివి ఆనంద్ అన్నారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారితో పాటు తలసేమియా చిన్నారులు, క్యాన్సర్ బాధితులకు ఈ రక్తం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. రక్తదానం, అవయవదానంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రైవేటు ఆసుపత్రులు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలకు నివాళిగా హైదరాబాద్ సిటీ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం నగర వ్యాప్తంగా మెగా రక్తదాన శిబిరాలు నిర్వహించారు. కమిషనరేట్ పరిధిలోని 38 కేంద్రాల్లో సుమారు 30 బ్లడ్ బ్యాంకుల సహకారంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో 5,700 యూనిట్ల రక్తాన్ని సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించారు. పేట్లబురుజులోని సిఎఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన శిబిరాన్ని డిజిపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 21 నుంచి 31 వరకు పోలీసు అమరవీరుల సంస్మరణార్థం రాష్ట్రవ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల రక్షణ కోసం పోలీసులు పండుగలు, సెలవులను సైతం పక్కనపెట్టి విధులు నిర్వర్తిస్తున్నారని కొనియాడారు. నగర పోలీస్ కమిషనర్ విసి సజ్జనర్ మాట్లాడుతూ పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, వారికి నిజమైన నివాళి అర్పించాలనే ఉద్దేశంతోనే నగరవ్యాప్తంగా భారీ స్థాయిలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ఉస్మానియా, గాంధీ, నిమ్స్, కింగ్ కోఠి, నిలోఫర్, ఎంఎన్‌జె క్యాన్సర్ ఆసుపత్రులు, చిరంజీవి బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులతో పాటు రెడ్‌క్రాస్, తలసేమియా ఫౌండేషన్, రోటరీ, లయన్స్ క్లబ్ వంటి సంస్థలకు, స్వచ్ఛందంగా రక్తదానం చేసిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అడిషనల్ సిపిలు ఎం. శ్రీనివాసులు, తఫ్సీర్ ఇక్బాల్, జాయింట్ సిపి జోయల్ డేవిస్, డిసిపిలు ఆర్. వెంకటేశ్వర్లు, రాహుల్ హెగ్డే, లావణ్య నాయక్ జాదవ్‌లతో పాటు పలువురు పోలీసు అధికారులు, వైద్యులు, బ్లడ్ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.



ప్రజలకు పోలీసు సేవలను చేరవేయడమే ‘సురక్ష’ లక్ష్యం

పోలీసు శాఖ అందిస్తున్న సేవలు, సిబ్బంది త్యాగాలు, ప్రజల భద్రత కోసం చేపడుతున్న చర్యలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలంగాణ డిజిపి, ‘సురక్ష’ దినపత్రిక ప్రధాన సంపాదకుడు సివి ఆనంద్ సూచించారు. పోలీ సు శాఖకు, ప్రజలకు మధ్య సమాచార వారధిగా ‘సురక్ష’ నిలవాలని అన్నారు. ‘సురక్ష’ దినపత్రిక ప్రథమ వార్షికోత్సవం గురువారం హైదరాబాద్‌లోని పేట్లబురుజు సిటీ పోలీస్ కాలేజీలో జరిగింది. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల విస్తరణతో సమాచారం క్షణా ల్లో ప్రజలకు చేరుతోంద ని, అయితే వార్తల్లోని వా స్తవాలను నిర్ధారించడం కీలకమని పేర్కొన్నారు. పోలీసులపై తప్పుడు కథనాలు ప్రచారంలోకి వచ్చినప్పుడు వాస్తవాలను ప్ర జలకు వివరించాలని సూ చించారు. పోలీసులు విధి నిర్వహణలో ఎదుర్కొనే సవాళ్లు, అమరవీరుల సేవలు, రక్తదాన శిబిరాలు, నేరాల నివారణ చర్యలు, దర్యాప్తు వి వరాలు, ప్రజలు పాటించాల్సిన భద్రతా జాగ్రత్తలపై ప్రత్యేక కథనాలు ప్రచురించాలని చెప్పారు. ప్రాంతీయ యాసలు, భాషా వైవిధ్యం ప్రత్యేకతను చాటుతాయని, స్థానిక భాష తెలిసినప్పుడే ప్రజల సమస్యలను సులభంగా అర్థం చేసుకుని మెరుగైన సేవలు అందించగలరని తెలిపారు. వార్తల ప్రచురణలో వాస్తవికత, స్పష్టత, ప్రజోపయోగానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్, ‘సురక్ష’ కార్యనిర్వాహక సంపాదకుడు రమేష్, ప్రముఖ పాత్రికేయుడు పమిడికా ల్వ మధుసూదన్, మామిడి హరికృష్ణ, వివిధ జి ల్లాలు, పోలీసు యూనిట్ల పిఆర్‌ఓలు పాల్గొన్నారు.



మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ :: ఉప్పల్ సర్కిల్-9

తేది: 29.10.2026

NIT No.	పని పేరు	అంచనా విలువ	బిడ్ సమర్పణకు ఆఖరి తేదీ & సమయం	అధికారి పేరు & చిరునామా
టెండర్ నోటీసు NIT No. 28/ EEC-9/UPL/ MMC/2026-27, తేది: 29.10.2026	MMC, ఉప్పల్ జోన్, ఉప్పల్ సర్కిల్ పరిధిలోని 23-చిల్కానగర్, 24-బీరప్పగడ్డ, 25-హబ్సిగూడ, 26-రామనాథపూర్, 27-వెంకట్‌రెడ్డినగర్, 28-ఉప్పల్ ప్రాంతాల లోని హిందూ స్మశాన వాటికలలో, దీపావళి పండుగ సందర్భంగా పూజలు నిర్వహించడానికి 08.11.2026న 1 రోజు (180 LED ల్యాంప్‌లు), 'ఆల్ సోల్స్ డే' సందర్భంగా 02.11.2026న 1 రోజు (180 LED ల్యాంప్‌లు) మరియు ఛత్ పూజ సందర్భంగా 15-11-2026న తాత్కాలిక విద్యుత్ దీపాల 120/110W LED ల్యాంప్‌లు ఏర్పాటు కొరకు అంచనా (ఎస్టిమేట్).	రూ. 1.25 లక్షలు	31.10.2026 మ.12.00గం.ల వరకు	శ్రీ కె.రమేష్ బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఉప్పల్ సర్కిల్-9, ఎంఎంసి.

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ http://www.Tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఉప్పల్ సర్కిల్-9, ఎంఎంసి.

DIPR R.O. No. : 12692-PP/CL/ADVT/2026-27, Date: 29-10-2026

అదనపు DME / సూపరింటెండెంట్ కార్యాలయం
ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, వికారాబాద్.

Rc.No. /A1/GGH/VKB/2026 — టెండర్ నోటిఫికేషన్ — తేదీ : 29.10.2026

వికారాబాద్ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లోని వివిధ విభాగాలకు పరికరాల సప్లయ్ నిమిత్తం, ప్రతిష్ఠాత్మక కంపెనీలు / సంస్థల నుండి సీల్డ్ టెండర్లు ఆహ్వానించబడ్డాయి. నిబంధనలు, షరతులతో కూడిన టెండర్ ఫారం నోటిఫికేషన్ తేదీ నుండి ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ వికారాబాద్‌లో చెల్లించవలసిన టెండర్ ఫారాల కొనుగోలు ఛార్జీల కింద రూ.10,000/-(పదివేలు మాత్రమే తిరిగి చెల్లించబడనిది) చెల్లించిన తర్వాత, తేదీ: 02-11-2026 నుండి 09-11-2026 వరకు ఏదేని పనిదినంలో ఉదయం 10.30నుండి సాయంత్రం 4.00గంటల మధ్య సూపరింటెండెంట్ కార్యాలయం, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ వికారాబాద్‌లో లభిస్తుంది. (ggh.vikarabad@gmail.com)

ప్రతీ టెండర్‌కు జతచేయవలసిన EMD వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

1) రూ.5 లక్షల లోపు పరికరాల జాబితా - EMD రూ. 2,00,000/-

టెండర్ షెడ్యూల్ :


1)	టెండర్ ఫారాల అమ్మకం తేదీ	: 02-11-2026 (7 పని దినాలు ఉ.10:30 నుండి సా.4:00 వరకు
2)	టెండర్ ఫారాల అమ్మకం చివరితేదీ	: 09-11-2026.
3)	టెండర్ ఫారాలను సమర్పించడానికి/ స్వీకరించడానికి / స్పష్టత కోరడానికి చివరి తేదీ	: 10-11-2026.
4)	టెండర్ల ఓపెనింగ్	: 11-11-2026 ఉ.10:30 నుండి మ.12:00 వరకు
5)	టెండర్ బాక్స్ తెరిచే ప్రదేశం	: అదనపు కలెక్టర్ ఛాంబర్ (లేదా) అదనపు కలెక్టర్ సమయం ప్రకారం ఒక వారంలోగా, వికారాబాద్ జిల్లా కలెక్టర్ & మెజిస్ట్రేట్ కార్యాలయంలో.

Sd/- అదనపు DME & మెడికల్ సూపరింటెండెంట్ జనరల్ హాస్పిటల్, వికారాబాద్.

DIPR R.O. No. : 12716-PP/CL/ADVT/2026-27, Date: 29-10-2026

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నిక కీలకం

ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్



ప్రజాపక్షం/వైరా: రాష్ట్రంలో త్వరలో జరగనున్న ఖమ్మం–నల్గొండ–వరంగల్ పట్టభద్రుదల ఎమ్మెల్సీ ఎన్నికలు కీలకంగా మారనున్నాయని ఉమ్మడి ఖమ్మంజిల్లా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ అన్నారు. గురువారం వైరాలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. అనంతరం ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఆరేళ్లకొకసారి జరిగే ఈ ఎన్నికల్లో పట్టభద్రుదలు తమ ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా ప్రభుత్వ పనితీరుపై తమ అభిప్రాయాన్ని తెలియజేయాలని రవీందర్ కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వ మూడేళ్ల పాలనపై పట్టభద్రుదలు తమ తీర్పు ఇవ్వాలని అన్నారు. రాష్ట్రంలో అధికార దుర్వినియోగం జరుగుతుందని, కాంగ్రెస్ పాలనపై విద్యావంతులు తమ ఓటు ద్వారా స్పందించాలని ఆయన వ్యాఖ్యానించారు. అనంతరం వైరాలో నూకల ప్రసాద్‌రావు ఇంటి వద్ద నిర్వహిస్తున్న పట్టభద్రుదల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. శ్రీచైతన్య డిగ్రీ కళాశాల అధ్యాపక బృందంతో మాట్లాడి, అర్హులైన ప్రతి పట్టభద్రుదలు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైరా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బానోత్ చంద్రావతి, లకావత్ గిరి బాబు, జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జున్‌రావు, వనమా విశ్వేశ్వరరావు, కౌన్సిలర్లు దొంతెబోయిన వెంకటేశ్వర్లు, సిరిపురం సర్పంచ్ శెట్టిపల్లి శ్రీనివాసరావు, బాణాల వెంకటేశ్వర్లు, మాదినేని దుర్గాప్రసాద్, భూమాల కృష్ణమూర్తి, కామినేని శ్రీనివాసరావు, మద్దెల రవి, తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణపై రైతులకు అవగాహన కార్యక్రమం

గ్రామస్తులు, రైతుల నుంచి అభిప్రాయాల సేకరణ



ప్రజాపక్షం/ రఘునాథపాలెం : సీతారామ ఎత్తిపోతల పథకానికి సంబంధించి ప్యాకేజీ 4 పరిధిలో రఘునాథపాలెం మండలంలో ఎల్ఎం15 కాలువ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియపై రైతులకు అవగాహన కల్పించారు. గురువారం మండల పరిధిలోని మంచుకొండ, కోయచలక, రేగులచలక, చిమ్మపుడి గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన గ్రామసభల్లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ, ఐఅండ్‌పి రైల్వేస్) జి. సదానందం, రఘునాథపాలెం తహసీల్దార్ ఎస్. శ్వేత, నీటిపారుదల శాఖ డిఇఇ జి. మోతీలాల్ తదితరులు పాల్గొని భూసేకరణ ప్రక్రియపై రైతులకు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ కాలువ నిర్మాణానికి చేపట్టనున్న భూసేకరణ నిబంధనలు, పరిహార ప్రక్రియ, విధి విధానాలపై రైతులకు, భూ యజమానులకు అవగాహన కల్పించారు. గ్రామస్తులు, రైతుల నుంచి వచ్చిన అభిప్రాయాలను, సందేహాలు, అభ్యంతరాలను నమోదు చేసుకున్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిబంధనల ప్రకారం న్యాయబద్ధమైన ప్రక్రియ కొనసాగుతుందని అధికారులు తెలిపారు. భూసేకరణకు సంబంధించి త్వరలో సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. కాలువ నిర్మాణానికి సంబంధించి నాలుగు గ్రామాల పరిధిలో సుమారు 113 ఎకరాలు భూసేకరణ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. భూసర్వే అనంతరం సర్వే నెంబర్ల వారీగా ఎంత మేర భూసేకరణ చేపట్టనున్నది తెలుస్తుందన్నారు. భూసేకరణకు రైతులు కూడా సహకరించాలని అధికారులు కోరారు.ఈ సమావేశంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు తేజావత్ శంకర్, కోటేరు నర్సిరెడ్డి, బలుసుపాటి శేషయ్య, యండపల్లి రమాదేవి, ఉప సర్పంచ్ మాధంశెట్టి హన్మంతరావు, ఆయా శాఖల అధికారులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలభివృద్ధికి కృషి

చైర్మన్ పసుపులేటి

ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో జిల్లాలో గ్రంథాలయాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ చైర్మన్ పుసుపులేటి వీరబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పినపాక శాఖలో నూతన గ్రంథాలయ ఏర్పాటుకు సహకరించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఐటిడిఎ పిఒ రాహుల్, జిల్లా గ్రంథాలయాల కార్యదర్శి కరుణకుమారికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రంథాలయాలను విద్యార్థులు, నిరుద్యోగ యువతకు విజ్ఞాన కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, సహకారదాతల సమన్వయంతో జిల్లాలోని శాఖా గ్రంథాలయాలను మరింత అభివృద్ధి చేస్తామని వీరబాబు వెల్లడించారు.

13న బిసి హక్కుల సాధన సమితి జిల్లా రెండో మహాసభ

ముత్తగూడెంలో మహాసభ కరపత్రం ఆవిష్కరణ



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఖమ్మం నగరంలోని ఎఫ్‌సిఐ గోదాము వద్ద 13న ఉదయం 10గంటలకు నిర్వహించనున్న బిసి హక్కుల సాధన సమితి ఖమ్మం జిల్లా రెండో మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ అనుబంధ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ముత్తగూడెంలో గురువారం ఖమ్మం రూరల్ మండల బిసి హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో మహాసభకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ మహాసభకు ఎమ్మెల్సీ కామ్రేడ్ నెల్లికంటి సత్యం ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు నాయకులు తెలిపారు. ఈ మహాసభకు బిసి సంఘాల నాయకులు, కార్యకర్తలు, బిసి బంధువులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా బిసి హక్కుల సాధన సమితి అధ్యక్షుడు మేకల శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి తాటి వెంకటేశ్వరరావు, ఖమ్మంరూరల్ మండల కార్యదర్శి బట్ట బాబు, ఉపాధ్యక్షులు విశ్వనాథం, దొంతగాని రమేష్, నర్రా మునేష్, సహాయకార్యదర్శులు గోకినపల్లి రామ్మూర్తి, పసుపులేటి లక్ష్మయ్య, మేకపోతుల రమేష్, గణపరపు చిన్న వీరన్న తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాల్లో... సిఎం ప్రైవేట్ నిఘా వర్గాలు!

మంత్రులు, ఎమ్మెల్యేల పనితీరుపై ఆరా




ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం: చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకునే దాని కంటే ముందుస్తుగానే వ్యవస్థను సరిచేసుకుంటే మంచిదనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు పూనుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కారు మూడేళ్ల పాలన, పొరపాట్లు, సరిచేసుకోవాల్సిన అంశాలు రానున్న రెండేళ్లలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు,త్వరలో జరగబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రేవంత్ రెడ్డి ప్రైవేటు నిఘా వర్గాలు నియోజకవర్గాల్లో సర్వేకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మంత్రులు, ఎమ్మెల్యేల పనితీరుపై ప్రత్యేక ఆరా తీసేందుకు ఈ సర్వే జరిపేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వినికిడి. ఇప్పటికే పలు మార్లు ప్రజాప్రతినిధులపై సైలెంట్ సర్వే చేయించిన ముఖ్యమంత్రి వారి లోపాలను ఎత్తి చూపి పనితీరు మార్చుకోవాలంటూ సూచించారనే వార్తలు గుప్పుమంటున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుకు ప్రధానంగా దోహదపడ్డ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఈ సర్వేకు అత్యంత ప్రాధాన్యంత సంతరించుకునే అవకాశాలు ఉన్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ముగ్గురు మంత్రులున్న చోట ఎవరి కోటరీ వారిదే అన్నట్లు సాగుతున్న రాజకీయం రాబోయో రోజుల్లో తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపే అవకాశం ఉన్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉండగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వారి అనుచర గణం ఆయా నియోజకవర్గాల్లో ఏం చేస్తున్నారు. ప్రజల నుండి వారి పట్ల ఏ విధమైన స్పందన ఉంది అనేవి కూడా సర్వేలో చోటు చేసుకోనున్న ప్రశ్నలు. అంతే కాకుండా ప్రభుత్వ పనితీరుపై ప్రజలు ఏమనుకుంటున్నారు. అమలుచేస్తున్న ప్రభుత్వ సం క్షేమ పథకాల పట్ల ప్రజల్లో వస్తున్న ప్రతికూల, అనుకూల స్పందన, పథకాలు అమలు చేయాల్సిన అధికారుల పని తీరు తదితర అంశాలపై కూడా స్పష్టమైన నిఘా సర్వే సాగే అవకాశమున్నట్లు వినికిడి. జిల్లాలో ఉన్న ఐదు నియోజకవర్గాల పరిధిలోని 23 మండలాల్లో ఈ సర్వే సాగనుంది. ప్రతీ మండలం నుండి ఐదు గ్రామాలకు ఇప్పటి నిఘా వర్గాలు ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ప్రతీ గ్రామం నుండి 30 నుండి 40 మంది అన్ని వర్గాల ప్రజలను ప్రశ్నించి వారి నుండి సమాధానాలు రాబట్టే ప్రైవేటు సైన్యం, నివేదికలు తయారు చేసి రాష్ట్ర ఇంటెలిజెన్సీ వర్గాలకు అందిస్తాయి. ఆ నివేదికలను క్షు ణ్ణంగా పరిశీలించి ప్రభుత్వానికి అందించనున్నారు.

సాగుకు గోదావరి జలాలే శరణ్యం

సీతారామ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలి

ఎఐకెఎస్ జిల్లా అధ్యక్షుడు దొండపాటి



ప్రజాపక్షం/బోనకల్: ఖమ్మం జిల్లా వ్యవసాయ రంగానికి గోదావరి జలాలే శరణ్యమని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం(ఎఐకెఎస్) జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ అన్నారు. సీతారామ ప్రాజెక్టు నిర్మాణాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి జిల్లాకు సాగునీరు, తాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని బ్రాహ్మణపల్లిలో నిర్వహించిన రైతు సంఘం సభ్యత్వ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయరంగంలో నెలకొన్న సంక్షోభాన్ని పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులకు అవసరమైన ఆర్థిక, మౌలిక వనరులను కల్పించి, వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని అన్నారు. వ్యవసాయ కూలీల కొరతను అధిగమించేందుకు ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలని, రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో కోతుల బెడద కారణంగా కూరగాయల సాగుకు రైతులు దూరమవుతున్నారని, ఈ సమస్యను పరిష్కరించి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకుడు పొరుపల్లి నరసింహారావు, సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, వెంకటేశ్వరరావు, మడుపల్లి వెంకటేశ్వర్లు, వంగాల నరసింహ, పొరుపల్లి రాఘవులు, గుడిద కృష్ణ, కొంగర కృష్ణయ్య, ఏలూరు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గడువుకు ముందే భద్రాద్రి ఆలయాభివృద్ధి పనులు

నవంబర్ 15 నుంచి రాతికట్టడాల పనులు

పుష్కరాల నాటికి సర్వాంగ సుందరంగా ఆలయం, పట్టణం

మంత్రి పొంగులేటి



ప్రజాపక్షం/భద్రాచలం : గోదావరి పుష్కరాల నాటికి భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారి ఆలయాభివృద్ధి పనులు పనులను అనుకున్న గడువుకంటే 10రోజుల ముందే పూర్తి చేస్తామని, నవంబర్ 15 నుండి రాతికట్టడాల పనులు ప్రారంభమవుతాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆలయాన్ని సందర్శించుకున్న మంత్రి.. ఎమ్మెల్యేలు డా. తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, ఆదినారాయణ, కలెక్టర్ అంకిత్, ఎస్‌పి రోహిత్‌రాజ్ తో కలిసి అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆలయ పనులను వేగవంతం చేసేందుకు ఆర్అండ్‌బి, దేవాదాయ శాఖ అధికారులు నిరంతరం సమీక్షలు నిర్వహిస్తున్నట్లు మంత్రి చెప్పారు. ఇప్పటికే కొన్ని స్లాబుల నిర్మాణాలు పూర్తయ్యాయని, మిగిలిన కాంక్రీట్ మాడవీధుల పనులను సమాంతరంగా చేపడుతున్నట్లు చెప్పారు. కొండపై రాతి తొలగింపు పనులను స్థానికులకు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తగా నిర్వహిస్తున్నామన్నారు. గోదావరి పుష్కరాల నాటికి ఆలయంతో పాటు పుష్కరఘాట్లను అభివృద్ధి చేసి భక్తులకు మెరుగైన వసతులుకల్పిస్తామని పేర్కొన్నారు. బాసర నుండి భద్రాచలం వరకు ప్రధాన ఆలయాలను అనుసంధానిస్తూ ప్రత్యేక ఆలయ పర్యాటక మార్గాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. పట్టణంలో వర్షపునీరు నిల్వలు లేకుండా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచేందుకు అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ రాహుల్, సబ్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ, దేవస్థానం ఇఒ దామోదర రావు, ఇంజనీరింగ్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్ నినోపై రైతులకు అవగాహన కల్పించాలి

రైతులు, అధికారులు.. సమన్వయంతో పని చేయాలి

ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



ప్రజాపక్షం/బూర్గంపాడు: రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు, పంట నష్టాలను తగ్గించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని పినపాక ఎమ్మెల్యే, తెలంగాణ శాసన సభ ఎస్‌టి సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం మండల పరిధిలోని లక్ష్మీ పురం గ్రామంలో ఏర్పాటు చేసిన నూ తన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు, వర్షపాతంలో హెచ్చుతగ్గులు చోటుచేసుకునే అవకాశం ఉందన్నారు. రైతులు అప్రమత్తంగా ఉంటూ వ్యవసాయ శాఖ అధికారుల సూ చనలు పాటించాలని, పంటల సాగు, సంరక్షణలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నీటి యాజమాన్యం, తెగుళ్లు, చీడపీడల నివారణకు వ్యవసాయ నిపుణుల సలహాలు తీసుకోవాలని పేర్కొన్నారు. పత్తి కొనుగోలు కేంద్రంలో రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, పత్తి నాణ్యత ప్రమాణాలు, తేమ శాతం నిబంధనలపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. వాతావరణ పరిస్థితులతో సంబంధం లేకుండా రైతులకు అవసరమైన సమాచారం, మార్గదర్శకత్వం అందించి పంట నష్టాలను తగ్గించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధికారి ప్రతినిధి పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ బాదం వెంకటేశ్వర రెడ్డి, ఎడిఎ తాతారావు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానేష్‌కుమార్ రాజీనామాకై రాజీలేని పోరాటం

సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : ఓటు చోరీ క్షమించరాని నేరమని, ప్రజాస్వామ్య విలువలను కాలరాసే హక్కు ఎవ్వరికీ లేదని, ఎన్నికల వ్యవస్థను భ్రష్టు పట్టించిన ఇసి జ్ఞానేష్ కుమార్ రాజీనామాకై రాజీలేని పోరాటం సాగిస్తామని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన గురువారం మాట్లాడుతూ సిఇసి జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 1న ఢిల్లీలో నిర్వహించే ర్యాలీ, నిరసన కార్యక్రమానికి జిల్లా నుండి 120 మందితో కూడిన సిపిఐ ప్రతినిధి బృందం తరలుతుందని చెప్పారు. ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత, ఓటు హ క్కు పరిరక్షణ కోసం రాజీలేని పోరాటాలు సాగిస్తామని స్ప ష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు అత్యంత కీలకమని, ప్రజా తీర్పును గౌరవించడం ప్రతీ వ్యవస్థ బాధ్యతన్నారు. ఓటు చోరీకి సంబంధించి విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించేలా ఎన్నికల సంఘం వ్యవహరించాలన్నారు. పజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం వామపక్ష శ్రేణు లు ప్రజాసంఘాలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఓటు హక్కు రక్షణ ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ ఎన్నికల వ్యవస్థలో జవాబుదారీతనం కోసం తమ పోరాటం కొనసాగిస్తామని పాషా పేర్కొన్నారు.

ఆసుపత్రులను ‘పిఎం రాహత్’ పథకంలో నమోదు చేయాలి

రోడ్డు ప్రమాద బాధితులకు సత్వర వైద్య సేవలు

హైవేపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

రోడ్డు సేఫ్టీ కమిటీ సమావేశంలో కలెక్టర్



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు సత్వర వైద్య సేవలను అందించి వారి ప్రాణాలను కాపాడటమే లక్ష్యంగా అమలు చేస్తున్న పిఎం రాహత్ పథకం కింద జిల్లాలోని ఆరోగ్యశ్రీ జాబితాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు తప్పనిసరిగా నమోదు కావాలని కలెక్టర్ దివాకర టిఏస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్‌కుమార్‌తో కలిసి కలెక్టర్ దివాకర టిఏస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిఎం రాహత్ పథకం నోడల్ అధికారి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా పథకం లక్ష్యాలు, అమలు విధానం, ఆసుపత్రుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆరోగ్యశ్రీ పరిధిలోని 60 ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు పిఎం రాహత్ పోర్టల్‌లో నమోదు చేయించేందుకు కలెక్టరేట్‌లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. శనివారం నాటికి పిహెచ్‌సిలు, సిహెచ్‌సిల ప్రతినిధులు అవసరమైన పత్రాలతో హాజరు కావాలన్నారు. నమోదు ప్రక్రియను వేగవంతం చేసేందుకు కలెక్టరేట్‌లో పది ప్రత్యేక కంప్యూటర్లను ఏర్పాటు చేసి సోమవారం నాటికి వంద శాతం రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలన్నారు. ప్రైవేటు ఆసుపత్రులు కూడా నమోదు చేసుకునేలా పర్యవేక్షించాలన్నారు. ప్రమాదం జరిగిన మొదటి వారం రోజులు అత్యంత కీలకమని డబ్బు లేక చికిత్స ఆగకూడదనే ఉద్దేశంతో బాధితులకు ఏడు రోజుల వరకు గరిష్ఠంగా రూ. 1.5 లక్షల వరకు నగదు రహిత చికిత్స అందించడం ఈ పథకం ప్రధాన లక్ష్యమన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే 112 అత్యవసర నెంబర్‌కు సమాచారం ఇచ్చేలా సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలోని ప్రమాదకర ప్రాంతాలు (బ్లాక్ స్పాట్లు), సమీప ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులను జియో ట్యాగింగ్ చేసి మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని 108 అంబులెన్స్‌లకు వెహికిల్ ట్రాకింగ్ పరికరాలను అమర్చి క్షతగాత్రులను ఆలస్యం లేకుండా సమీపంలోని మెరుగైన వసతులు ఉన్న ఆసుపత్రికి చేర్చేలా కమాండ్ కంట్రోల్ ద్వారా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఖమ్మం దేవరపల్లి జాతీయ రహదారిపై మితిమీరిన వేగం వల్ల ప్రమాదాలు అధికమవుతున్నాయని ప్రమాదాల నివారణకు పోలీస్, రవాణా శాఖలు సమన్వయంతో ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ దివాకర టిఏస్ పిఎం రాహత్ పథకానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎసిపి శ్రీనివాసులు, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రవీంద్రబాబు

ప్రజాపక్షం/చింతకాని : వర్షాభావ పరిస్థితులతో తీవ్రంగా నష్టపోయిన చింతకాని మండల రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని, మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏపూరి రవీంద్రబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నాగిలిగొండ సిపిఐ శాఖ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల జాబితాలో చింతకానికి చోటు కల్పించకపోవడం వల్ల ఇక్కడి రైతులకు అన్యాయం జరుగుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పంటల సాగు కోసం వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. ఇప్పటికే సాగు చేసిన పంటలకు ఆశించిన స్థాయిలో దిగుబడి వచ్చే పరిస్థితి లేదని, మరోవైపు యాసంగి సాగు అగమ్యగోచరంగా ఉందని దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని, ప్రభుత్వం తక్షణమే స్పందించి క్షేత్రస్థాయిలో పంటల పరిస్థితిని పరిశీలించి చింతకాని మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకుని తగిన పరిహారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐకెఎస్ మండల కార్యదర్శి పదిమల వెంకటనర్సయ్య, శాఖ కార్యదర్శి చాట్ల రమేష్, నాయకులు షేక్ హుస్సేన్, దమ్మాలపాటి రవీంద్ర, జాన్, పంది పుల్లయ్య, శేఖర్, ఆనందం, కృష్ణయ్య, వెంకటేశ్వర్లు, మల్లయ్య, గోపీ, పుల్లయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై దాడి

ప్రజాపక్షం/ ఖమ్మం క్రైం : నగరంలోని ముస్తఫానగర్ ప్రాంతంలో వ్యభిచార గృహంపై పోలీసులు దాడులు నిర్వహించారు. సిపి సునీల్ దత్ ఆదేశాల మేరకు సిఐ శివనాథుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎహెచ్‌టియు బృందం సిబ్బంది దాడులు చేశారు. ఈ దాడుల్లో ఇద్దరు మహిళలను రక్షించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిఐ హెచ్చరించారు. మానవ అక్రమ రవాణా, వ్యభిచార గృహాల నిర్వహణకు సంబంధించి సమాచారం ఉంటే తమకు తెలియజేయాలని తెలిపారు.

ఖమ్మం ఆర్‌టిఒ కార్యాలయంలో వసూళ్ల కలకలం!

‘ప్రజాపక్షం’ కథనాలతో యంత్రాంగంలో కదలిక

మంత్రి పొంగులేటికి కాంట్రాక్టర్ల ఫిర్యాదు?

అత్యవసర సమావేశంతో తీవ్ర చర్చనీయాంశం

చర్యలు తీసుకోవాలంటూ పెరుగుతున్న డిమాండ్

ప్రజాపక్షం ఎఫెక్ట్


ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : జిల్లా ఆర్‌టిఒ కార్యాలయంలో వాహనాల నుంచి నెలవారీగా డబ్బులు వసూలు చేస్తున్నారంటూ వెలుగులోకి వచ్చిన ఆరోపణలు ఇప్పుడు అధికార వర్గాల్లో కలకలం రేపుతున్నాయి. గత మూడు రోజులుగా ‘ప్రజాపక్షం’ ప్రచురిస్తున్న వరుస కథనాల నేపథ్యంలో ఈ వ్యవహారం ఉన్నతస్థాయి దృష్టికి వెళ్లినట్లు సమాచారం. అలాగే కాంట్రాక్టర్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీనిపై మంత్రి సంబధిత ఓ జిల్లా స్థాయి అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో బుధవారం అత్యవసర కార్యాలయంలో అధికారులతో అత్యవసర సమావేశం జరిగినట్లు సమాచారం. వాహనాల నుంచి వసూళ్ల ఆరోపణలు, మంత్రికి అందిన ఫిర్యాదు, అత్యవసర భేటీ..ఇలా వరుసగా చోటుచేసుకున్న పరిణామాలు ఆర్‌టిఒ కార్యాలయ వ్యవహారాన్ని మరింత చర్చల్లోకి తెచ్చాయి.

మంత్రికి కాంట్రాక్టర్ల ఫిర్యాదు

కార్యాలయ వ్యవహారాలపై విసిగివేసారిన కాంట్రాక్టర్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతుంది. దీనిపై ఆర్‌టిఒ కార్యాలయ పరిధిలోని క్షేత్ర స్థాయి నుంచి వినపడుతోంది. కాంట్రాక్టర్లు కార్యాలయం నుంచి ప్రభుత్వ పనులకు వాహనాలు వినియోగించినా రక్తం పిండుతున్నారని వాపోయినట్లు తెలిసింది. దీనిపై మంత్రి సంబంధిత జిల్లా స్థాయి అధికారిని పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారని, లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని మండిపడినట్లు సమాచారం. కాగా ఈ వ్యవహారంపై సాగుతున్న చర్చతో ప్రాధాన్యం సంతరించుకుందనే చెప్పాలి. బుధవారం సాయంత్రం ఆర్‌టిఒ కార్యాలయంలో అధికారులు అత్యవసరంగా సమావేశమైనట్లు తెలిసింది. ఈ సమావేశంలో వసూళ్ల ఆరోపణలు, ప్రస్తుత పరిస్థితిపై చర్చ జరిగినట్లు క్షేత్రస్థాయి నుంచి వినికిడి. అలాగే జిల్లా కార్యాలయ పరిధిలోని సంబంధిత ఇతర కార్యాలయాల్లో అవినీతి వ్యవహారాలకు దూరంగా ఉండాలని చర్చించుకున్నట్లు విశ్వనీయ సమాచారం. వీటన్నింటికి ప్రధాన కారణం ‘ప్రజాపక్షం’ పత్రిక వరుసగా ప్రచురించిన కథనాలే అనేది అక్షర సత్యంగా కనిపించింది. అయితే ఈ వ్యవహారంలో తెర వెనుక ఉన్న అసలు లెక్కలపై పలు ప్రశ్నలు రేకెత్తుతున్నాయి. ఒక వైపు వాహనాల నుంచి నెలవారీ వసూళ్ల ఆ రోపణలు, మరోవైపు కాంట్రాక్టర్ల ఫిర్యాదులు, ఇంకో వైపు అధికారుల అత్యవసర సమావేశంతో అవినీతిపై చర్యలుండేనా? అనే ప్రశ్న తెరపైకి వచ్చింది. ఈ పరిణామాల ఇంతలో చర్చనీయాంశంగా మారిన తరుణం లో అసలు వాస్తవాలను సుమోటోగా తీసుకుని నిగ్గు తేల్చాలనే వాదన బలంగా వినిపిస్తోంది. రోజు కార్యాలయంలో జరుగుతున్న పనులు ఎన్ని?, ఫైళ్లు ఎన్ని పాస్ అవుతున్నాయి. ఇందులో ఏమైనా అనధికారి వసూళ్లకు పాల్పడుతున్నారా? అనేది స్పష్టం చేయాల్సిన అవశ్యకత ఉంది.

లక్ష్మీనారాయణ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది

మంత్రి పొంగులేటి



పజాపక్షం/పాల్వంచ : పాల్వంచ హెచ్‌పి గ్యాస్ కార్యాలయ మేనేజర్ అనంతుల లక్ష్మీ నారాయణ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చారు. పాల్వంచ నవభారత్ సమీపంలోని సిల్ క్యాంపస్‌లోని బాధిత కుటుంబాన్ని గురువారం పరామర్శించిన ఆయన వారి సమస్యలను అడిగి తెలుసుకొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని స్పష్టం చేశారు. లక్ష్మీ నారాయణ ఆత్మహత్యకు దారి తీసిన పరిస్థితులను, ఘటనకు కారకులైన వారు ఎవరైనా సరే చట్టం నుండి తప్పించుకోలేరన్నారు. వారిని అరెస్ట్ చేయించేలా చర్యలు తీసుకొంటామని చెప్పారు. ఈ విషయంలో అధికారులు చట్ట ప్రకారం ముందుకు సాగుతున్నారని తెలిపారు. మంత్రి వెంట ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, కలెక్టర్ అంకిత్, మున్సిపల్ కమిషనర్ సుజాత, డిఎస్‌పి సతీష్‌కుమార్, తహసీల్దార్ ప్రసాద్, డిసిసి అధ్యక్షురాలు తోట దేవిప్రసన్న, నాయకులు ఊకంటి గోపాలరావు, డిప్యూటి మేయర్ సిరిపురపు లలిత కుమారి, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భవనచందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రామాలయం ముందు కొండచిలువ కలకలం!




ప్రజాపక్షం/నెక్కొండ: వరంగల్ జిల్లా నెక్కొండ మండలం గుంటూరుపల్లె(అమీన్ పేట)లో రామాలయం ముందు సిసి రోడ్డు పై కొండ చిలువ కనిపించడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. కొండ చిలువను గ్రామస్తులు చంపడం తో ఊపిరి పీల్చుకున్నారు. అయితే జనావాసాల్లోకి వన్యప్రాణులు వస్తుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇలాంటి పరిస్థితుల్లో అటవీశాఖ లేదా సంబంధిత రెస్క్యూ సిబ్బందికి సమాచారం అందించి సురక్షితంగా పట్టించేలా చర్యలు తీసుకోవాలని పలువురు సూచిస్తున్నారు.

'పోక్సో' చట్టంపై అవగాహన ఉండాలి: దండు మోహన్



ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ : లైంగిక వేధింపుల నుంచి మైనర్లను రక్షించడానికి పోక్సో చట్టంపై అవగాహన ఉండాలని ప్యానెల్ అడ్వకేట్ దండు మోహన్ కోరారు. హన్మకొండ జిల్లా న్యాయ సేవా సంస్థ (డిఎల్ఎస్ఎ)కార్యదర్శి, జడ్జీ ఎన్.వెంకట హైమా పూజిత ఆదేశాల మేరకు డిఎల్ఎస్ఎఆధ్వర్యంలో గురువారం హన్మకొండ కుమారపల్లి మార్కెట్ వద్ద గల ప్రభుత్వ బాలికల హై స్కూల్లో పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరైన మోహన్ మాట్లాడుతూ..పిల్లలకు నిత్య జీవితంలో ఎదురయ్యే పలు లైంగిక అంశాల పట్ల తగిన మెలకువలను ఉదాహరణలతో వివరించారు. 18 సంవత్సరాల వయసులోపు పిల్లలపై జరిగే లైంగిక వేధింపులకు ఈ చట్టం వర్తిస్తుందన్నారు. నేర తీవ్రతను బట్టి ఈ చట్టం కింద కఠిన మైన శిక్షలు ఉంటాయని తెలిపారు. పిల్లలపై లైంగిక ఉద్దేశ్యంతో జరిగే ప్రతీ చర్యా "పోక్సో చట్టం" పరిధిలోకి వస్తుందని తెలిపారు. ఎలాంటి బెదిరింపులకు గురి చేసిన భయపడకుండా తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, నమ్మదగిన వ్యక్తులకు చెప్పుకోవాలని, హానికర మనుకుంటే సురక్షితమైన చోటుకు దూరంగా వెళ్ళాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ సుందర్ రామ్, హెడ్మాస్టర్ టీ. భాస్కర్లతో పాటు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటిస్తేనే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల జారీ: బల్దియా కమిషనర్




ప్రజాపక్షం/ఖిలా వరంగల్: భవన నిర్మాణ సంబంధ నిబంధనలు ఖచ్చితంగా పాటిస్తేనే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు జారీ చేస్తామని బల్దియా కమిషనర్ టి వెంకన్న స్పష్టం చేశారు. గురువారం నగరంలోని గొర్రెకుంట, విద్యుత్‌నగర్, నక్కలగుట్ట, సిద్ధార్థనగర్, గోపాల్‌పూర్, వడ్డేపల్లి, ప్రశాంత్‌నగర్ ప్రాంతాల్లో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల జారీ కోసం భవన నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, కొలతలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తెలంగాణ మున్సిపాలిటీల చట్టం...2019, సంబంధిత భవన నిర్మాణ నిబంధనలకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. అనుమతి పొందిన ప్లాన్ ప్రకారమే నిర్మాణాలు చేపట్టాలని, నిబంధనల ఉల్లంఘనలను గుర్తిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ పర్యటనలో సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, టిపిఎస్‌లు ప్రశాంత్, అవినాష్, తదితరులు పాల్గొన్నారు.

17వ రోజుకు చేరుకున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మె

ప్రజాపక్షం/భూపాలపల్లి : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నేషనల్ హెల్త్ మిషన్ జెఎసి ఆధ్వర్యంలో గురువారం కొనసాగుతున్న సమ్మె 17వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ నిరవధిక సమ్మెకు ఎన్ హెచ్ ఎం జెఎసి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పుట్ట మహేందర్ హాజరై ఉద్యోగుల డిమాండ్స్ సాధించేవరకు ఈ నిరవధిక సమ్మె ఇదేవిధంగా కొనసాగుతుందని అన్నారు. ఈ నిరసనకు సంఘీభావం తెలిపిన వరంగల్ నల్గొండ ఖమ్మం పట్టభద్రుల గ్రాడ్యుయేట్స్ తెలంగాణ రక్షణ సేన ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్ ఉద్యోగులకు మద్దతు ప్రకటించారు. ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం జెఎసి జిల్లా అధ్యక్షు దుబడితల రమేష్, ప్రధాన కార్యదర్శి మధు, ఉపాధ్యక్షులు డా॥ రఘు రాం, అడ్వైజర్స్ శ్రీనివాస్, ప్రభాకర్, డిస్టిక్ కోఆర్డినేటర్ ప్రవీణ్, డా॥ జగదీష్, మీడియా ఇన్‌చార్జ్ రాజు, డా॥ విజయ్, డా॥ బాలకృష్ణ, కృష్ణవేణి, పార్వతి, ఎఎన్ఎంలు, స్టాఫ్ నర్స్, ఫార్మసీ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

ఖానాపురాన్ని కరువు మండలంగా గుర్తించాలి: ఎమ్మెల్సీ శ్రీనివాస్ రెడ్డి



ప్రజాపక్షం/ఖానాపురం: ఖానాపురం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని ఎంఎల్‌సి, శాసనమండలి డిప్యూటీ లీడర్ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఖానాపురం మండల కేంద్రంలో నిర్వహించిన పట్టభద్రుల సమీక్ష సమావేశం సందర్భంగా చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నర్సంపేట నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో నాలుగు మండలాలనే కరువు మండలాలుగా ప్రకటించి, మిగిలిన రెండు మండలాలను విస్మరించడం అన్యాయమని పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఎల్‌నినో ప్రభావంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెబుతున్న ప్రభుత్వం క్షేత్రస్థాయిలో కరువు పరిస్థితులను గుర్తించి రైతులకు న్యాయం చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. పంటలు ఎండిపోయి, పెట్టిన పెట్టుబడులు కూడా చేతికందక రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సమయంలో రైతులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం తన బాధ్యతను విస్మరించడం దురదృష్టకరమన్నారు. వెంటనే ఖానాపురం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతులకు తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్, సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, క్లస్టర్ బాధ్యులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, పార్టీ ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పుష్కరాల నాటికి కాళేశ్వరం ఆలయ పనులు పూర్తి

మార్చి నాటికి ప్రధాన ఆలయ పనులు ముగించాలి

అష్టతీర్థాల ఘాట్ల నిర్మాణం వేగవంతం

దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ ఆదేశాలు



ప్రజాపక్షం/భూపాలపల్లి/కాళేశ్వరం: గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ అధికారులను ఆదేశించారు. అష్టతీర్థాల ఘాట్ల నిర్మాణంతో పాటు ఆలయ అభివృద్ధి పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గురువారం దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి శైలజా రామయ్యర్ కాళేశ్వరంలో పర్యటించారు. కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ప్రధాన ఆలయం, రామాలయం, జ్ఞానవాపి బావి, శుభానందిని అమ్మవారి ఆలయ నిర్మాణ పనులను పరిశీలించి పురోగతిని సమీక్షించారు. విజయ గణపతి ఆలయ నిర్మాణ ప్రాంతంలో కొబ్బరికాయ కొట్టి పూజలు నిర్వహించారు. అనంతరం సరస్వతి ఘాట్‌ను సందర్శించి అష్టతీర్థాల అభివృద్ధి, ఘాట్ల నిర్మాణం, భూసేకరణ, పర్యాటక శాఖ ఆధ్వర్యంలో బోట్ జెట్టీ ఏర్పాటు అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశమై గోదావరి పుష్కరాల ఏర్పాట్లు, ఆలయ పునర్నిర్మాణం, ఘాట్ల అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ మాట్లాడుతూ కాళేశ్వరంలో ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రణాళికాబద్ధంగా కొనసాగుతున్నాయని, క్షేత్రస్థాయి పరిశీలనలో పురోగతి సంతృప్తికరంగా ఉందని తెలిపారు. ప్రధాన ఆలయంతో పాటు ఉపాలయాలు, మండపాల నిర్మాణ పనులు కూడా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. గోదావరి పుష్కరాల నాటికి భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలంటే ప్రధాన ఆలయ నిర్మాణ పనులను మార్చి నాటికి పూర్తి చేయడం అత్యంత కీలకమని పేర్కొన్నారు. పనుల నాణ్యతలో రాజీ పడకుండా అధికారులు నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ గడువును తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు.

ఆలయ పునర్నిర్మాణానికి రూ.195 కోట్లు

దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు మాట్లాడుతూ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి రూ.195 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. అష్టతీర్థాల ఘాట్లు, రహదారులు, అభివృద్ధి పనులకు కూడా నిధులు కేటాయించినట్లు వెల్లడించారు. వివిధ శాఖల సమన్వయంతో పనులు పూర్తి చేసి గోదావరి పుష్కరాల నాటికి అవసరమైన ఏర్పాట్లు సిద్ధం చేస్తామని పేర్కొన్నారు.

మరో 18 ఎకరాల భూసేకరణకు చర్యలు

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ గోదావరి పుష్కరాల ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తోందని తెలిపారు. ఘాట్ల నిర్మాణానికి సంబంధించి ఇప్పటికే 13 ఎకరాల భూసేకరణ పూర్తయిందని వివరించారు. మరో 18 ఎకరాల భూసేకరణ కోసం సంబంధిత గ్రామాల ప్రజలతో చర్చించి, నిబంధనల ప్రకారం పరిహారం అందించే చర్యలు చేపడతామని వెల్లడించారు. అవసరమైన డ్రాయింగ్‌లు అందిన వెంటనే ఘాట్ల నిర్మాణ పనులు ప్రారంభించి, అన్ని శాఖల పనులు నిర్ణీత గడువులోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ధార్మిక సలహాదారు గోవింద హరి, సబ్ కలెక్టర్ సౌరవ్ శర్మ, వివిధ శాఖల ఇంజినీరింగ్ అధికారులు, పర్యాటక శాఖ ప్రతినిధులు, ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు, కాంట్రాక్టర్లు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

'గూడూరు'కు తలమానికం ఇంటిగ్రేటెడ్ స్కూల్

గూడూరు - పాకాల వాగుపై హైలెవల్ వంతెన నిర్మాణం: ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్



ప్రజాపక్షం/గూడూరు; మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సిహెచ్‌సి) ఆవరణంలో రూ 15 లక్షల వ్యయంతో నిర్మించిన పోస్ట్‌మార్టం (శవ పరీక్ష) కేంద్ర భవనాన్ని గురువారం మహబూబాబాద్ శాసన సభ్యుడు డాక్టర్ మురళినాయక్ ఘనంగా ప్రారంభించారు.ఈసందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో గూడూరు మండలానికి తలమానికంగా నిలిచేలా ఏకంగా రూ 250 కోట్ల భారీ వ్యయంతో బొద్దుగొండ గ్రామంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం సాధ్యపడిందని తెలిపారు. అత్యంత ఆహ్లాదకరమైన ప్రకృతి ఒడిలో నిర్మించనున్న ఈపాఠశాల ద్వారా పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి నాణ్యమైన విద్య అందుతుందని పేర్కొన్నారు. గూడూరు అంటేనే ఆదివాసీలు, గిరిజనుల అడ్డా. ఇక్కడి గిరిజన బిడ్డలు విద్యాపరంగా సామాజికంగా ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నదే ప్రభుత్వ ప్రధాన సంకల్పం అని స్పష్టం చేశారు.కేవలం పాఠశాలలకే పరిమితం కాకుండా మండల రూపురేఖలు మార్చేందుకు భారీ అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. అంతేకాకుండా గూడూరు మండలం నుండి కేసముద్రం మీదగా నెల్లికుదురు వరకు నాలుగు వరుసల (ఫోర్లేన్) రహదారి నిర్మాణం గూడూరు పాకాల వాగుపై హైలెవల్ వంతేన నిర్మాణం గూడూరు సెంటర్‌లోని కొమురం భీమ్ విగ్రహం జంక్షన్ సుందరీకరణ పనులు ఇవన్నీ కేవలం ప్రతిపాదనలు శంకుస్థాపనలకే పరిమితం కాకుండా రాబోయే రెండేళ్ల వ్యవధిలోనే పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తానని మాటల్లో కాకుండా చేతల్లో చేసి చూపిస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.త్వరలో గూడూరు మండలం కేంద్రంలో 50 పడుకల ఆసుపత్రికి అప్లికేడ్ చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇవ్వడం జరిగింది

ఎమ్మెల్యే మురళి నాయక్‌కు ఘన సన్మానం

కార్యక్రమం అనంతరం గూడూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ డాక్టర్ వీరన్న మహబూబాబాద్ జిల్లా కోఆర్డినేటర్ చింత రమేష్‌లు కలిసి ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్‌ను శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సన్మానించారు. మండల అభివృద్ధికి ఆసుపత్రి వసతుల మెరుగుదలకు ఎమ్మెల్యే చేస్తున్న కృషికి కృతజ్ఞతలు తెలిపారు.ఈకార్యక్రమంలో గూడూరు సర్పంచ్ సునీత కోమ్మాలునాయక్ వైద్య సిబ్బంది పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అగ్రిస్టాక్ కమిటీ ద్వారా వేగవంతమైన సేవలు


హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



ప్రజాపక్షం/హనుమకొండ : జిల్లాలో అగ్రిస్టాక్ కమిటీ ఏర్పాటు ద్వారా రైతులకు నాణ్యమైన, పారదర్శకమైన, వేగవంతమైన సేవలను అందించేందుకు ఈ నూతన టెక్నాలజీ ఉపయోగపడుతుందని హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో అగ్రి స్టాక్ టెక్నాలజీ విధానంపై జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు కోసం వ్యవసాయ, భూములు కొలతలు, పశు సంవర్ధక, ఉద్యాన, సహకార, నాబార్డ్, పౌర సరఫరాలు, తదితర శాఖల అధికారులతో సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. కలెక్టర్ చైర్ పర్సన్ గా, కన్వీనర్ గా జిల్లా వ్యవసాయ అధికారి, సభ్యులుగా వివిధ శాఖల అధికారులతో కమిటీ ఏర్పాటయింది. ఈ సమావేశంలో నూతన టెక్నాలజీ అగ్రిస్టాక్ ద్వారా రైతులకు నాణ్యమైన, వేగవంతమైన ప్రభుత్వ సేవలు, పథకాలను అందించేందుకు నూతన టెక్నాలజీని తీసుకురావడానికి, ప్రస్తుతం ఉన్న టెక్నాలజీలో మార్పులు తెచ్చేందుకు పలు సూచనలు చేశారు.వ్యవసాయం, అనుబంధ రంగాలు, బ్యాంకు సేవలు, మార్కెటింగ్ సదుపాయాలు, పంట కొనుగోలును ఒకేతాటిపైకి తీసుకు వచ్చి రైతులకు వేగవంతమైన సేవలను అందించడం అగ్రి స్టాక్ టెక్నాలజీ ప్రధాన ఉద్దేశమని అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయం, అనుబంధ రంగాలకు సంబంధించి రైతులకు వేగవంతమైన సేవలను అందించేందుకు జిల్లాస్థాయి అగ్రిస్టాక్ కమిటీ పనిచేస్తుందని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర, భూములు కొలతలు శాఖ ఏడి నూర్ సింగ్, పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రాధా కిషన్, ఉద్యాన శాఖ అధికారి కమలాకర్ రెడ్డి, జిల్లా సహకార అధికారి మోహన్, అడిషనల్ డిఆర్‌డిఒ వెంకటేశ్వర్లు, సిపిఒ సత్యనారాయణ రెడ్డి, నాబార్డ్ ఏజిఎం చంద్రశేఖర్, ఎల్‌డిఎం విష్ణుప్రియ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సమగ్ర కార్యాచరణతో ముందుకు


ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



ప్రజాపక్షం/పాలకుర్తి: మండల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి, గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగాలని ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేయాలని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి సూచించారు. గురువారం మండల కేంద్రం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను గుర్తించి, ప్రాధాన్యత క్రమంలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, విద్యుత్, విద్య, వైద్యం, వ్యవసాయం, సాగునీరు వంటి కీలక అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే ప్రారంభించిన అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని, పెండింగ్‌లో ఉన్న పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు. మండలాన్ని అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు పరస్పర సమన్వయంతో పని చేయడం ఎంతో అవసరమని ఆమె చెప్పారు. గ్రామస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. ఈ సమావేశంలో ఆయా గ్రామాల సర్పంచులు వివిధ శాఖల అధికారులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల నియంత్రణలో ల్యాబ్ టెక్నీషియన్ల పాత్ర కీలకం

జిల్లా మలేరియా అధికారి రజని




ప్రజాపక్షం/ వరంగల్ : కీటక జనిత వ్యాధుల నియంత్రణలో ల్యాబ్ టెక్నీషియన్ల పాత్ర కీలకమని వరంగల్ జిల్లా మలేరియా అధికారి రజని అన్నారు. వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజా రెడ్డి ఆదేశాల మేరకు గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలోని సమావేశ మందిరంలో కీటక జనిత వ్యాధుల నిర్ధారణ, నివారణ, నియంత్రణ కు సంబంధించి ల్యాబ్ టెక్నీషియన్లకు పునశ్చరణ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మలేరియా అధికారి రజని మాట్లాడుతూ కీటక జనిత వ్యాధుల నియంత్రణలో ల్యాబ్ టెక్నీషియన్ల పాత్ర అత్యంత కీలకమన్నారు. జ్వరంతో బాధపడుతున్న వ్యక్తుల నుంచి రక్త నమూనాలను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా సేకరించడం, వాటిని సరైన పద్ధతిలో స్టెయిన్ చేయడం, మైక్రోస్కోప్ ద్వారా పరీక్షించడం, వ్యాధిని ఖచ్చితంగా నిర్ధారించడం వంటి బాధ్యతలను ల్యాబ్ టెక్నీషియన్లు సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. మలేరియా వంటి కీటక జనిత వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి, బాధితులకు సకాలంలో చికిత్స అందించేందుకు నాణ్యమైన ప్రయోగశాల పరీక్షలు ఎంతో అవసరమన్నారు. నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం రక్త నమూనాలను పరీక్షించి, అవసరమైన సందర్భాల్లో నాణ్యతా తనిఖీ నిమిత్తం ఉన్నత స్థాయి ప్రయోగశాలలకు పంపాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సెంట్రల్ మలేరియా ల్యాబొరేటరీలో శిక్షణ పొందిన ల్యాబ్ టెక్నీషియన్లు, ఇతర ల్యాబ్ టెక్నీషియన్లకు రక్త నమూనాల సేకరణ, స్టెయినింగ్ పద్ధతులు, మైక్రోస్కోపిక్ పరీక్షలు, మలేరియా పరాన్నజీవుల గుర్తింపు,నాణ్యతా నియంత్రణకు సంబంధించిన అంశాలపై శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ కుమారస్వామి, హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ పి. సదానందం, డిప్యూటి జిల్లా విస్తరణ, మాస్ మీడియా అధికారి ఎస్. వెంకటేశ్వర్లు, మలేరియా విభాగ సిబ్బంది, వివిధ ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

పల్లె ప్రతిభకు ప్రోత్సాహం అందించాలి: కలెక్టర్



ప్రజాపక్షం/ములుగు: గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, స్థానిక సమస్యలకు పరిష్కారం చూపే నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అన్నారు. నేటి ఆవిష్కరణలే రేపటి భవిష్యత్తుకు పునాదులని పేర్కొన్నారు. గురువారం జిల్లా సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ సంపత్‌రావు అధ్యక్షతన నిర్వహించిన ఇన్నోవేషన్ పంచాయతీ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, విద్యార్థులు, మహిళలు, యువత, చేతివృత్తుల వారిలోని సృజనాత్మకతను వెలికితీయాలని సూచించారు. ఆవిష్కరణలు పరిశోధనా కేంద్రాలకే పరిమితం కావని, గ్రామీణ ప్రాంతాల్లోనూ ఎన్నో వినూత్న ఆలోచనలు ఉంటాయని తెలిపారు. వ్యవసాయం, నీటి పొదుపు, పారిశుద్ధ్యం, చేతివృత్తులు తదితర రంగాల్లో స్థానిక సమస్యలకు పరిష్కారాలు కనుగొనే ఆలోచనలను గుర్తించాలని అధికారులకు సూచించారు. తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంపై గ్రామస్థాయిలో విస్తృత ప్రచారం కల్పించాలని ఆదేశించారు. వయస్సు విద్యార్హతలతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ తమ ఆలోచనలకు పంచుకునేలా ప్రోత్సహించాలన్నారు. గ్రామాల్లో తయారుచేసిన పరికరాలు, వినూతన పనివిధానాలు, వాటి ఉపయోగాలను గుర్తించి వివరాలు సేకరించాలని సూచించారు. ఆవిష్కర్తలను గుర్తించడంలో ఎంపిఓలు, పంచాయతీ కార్యదర్శులు చొరవ చూపాలని, విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేలా ఉపాధ్యాయులు మార్గనిర్దేశం చేయాలని కలెక్టర్ తెలిపారు. తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ ప్రతినిధి సోహెల్, టీ హబ్ ప్రతినిధి అమృత, ఈవై ప్రాజెక్టు లీడ్ అన్నీ విజయ్, డిఐసి ప్రతినిధి సిద్దార్థ రెడ్డి, టిజిఐసి గ్రాస్ రూట్స్ లీడ్ రమేష్, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థరెడ్డి, ఈడిఎం దేవేందర్, ఎంపిఓలు, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రూ.1.50కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన




ప్రజాపక్షం/గణపురం: గణపురం మండలంలోని పలు గ్రామాల్లో రూ. 1.50 కోట్ల అంచనా వ్యయం తో చేపట్టనున్న అంగన్‌వాడీ, మహిళా సమాఖ్య భవనాల నిర్మాణ పనులకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు శంకుస్థాపన చేశారు. చెల్పూర్ గ్రామంలో రూ.20లక్షలతో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి, రెండు చోట్ల రూ.10లక్షల చొప్పున మహిళా సమాఖ్య భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. లక్ష్మారెడ్డిపల్లి, కర్కపల్లిలో రూ.10లక్షల చొప్పున మహిళా సమాఖ్య భవనా నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. గాంధీనగర్ లో రూ.20లక్షలతో అంగన్‌వాడీ భవనం, గణపురం మండల కేంద్రంలో మూడు అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణానికి రూ.60లక్షలు, బురకాయలగూడెంలో రూ.10లక్షలతో మహిళా సంఘం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌళిక సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు మహిళలు, చిన్నారులకు మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యమన్నారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి మూర్ఖత్వంతోనే రాష్ట్రంలో కరువు

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

ప్రజాపక్షం/రాయపర్తి: కాంగ్రెస్ ప్రభుత్వం సిఎం రేవంత్‌రెడ్డి మూర్ఖత్వంతోనే రాష్ట్రంలో కరువు ఏర్పడిందని, కరువుకు కారణం కాంగ్రెస్సే అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన పట్టభద్రుల ఎమ్మెల్సీ విస్తృత స్థాయి సమావేశంలో పట్టభద్రుల ఎమ్మెల్సీఅభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టుతో బిఆర్ఎస్ అధినేత మాజీ సిఎం కెసిఆర్ రైతులకు సాగునీరు అందించారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో నీళ్లు పుష్కలంగా ఉన్న మోటార్లు నడిపితే కెసిఆర్ పేరు వస్తుందనే రాజకీయ కక్షతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు సాగునీరు విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు శాపంగా మారిందని అన్నారు. రాబోయే పట్టభద్రుల ఎన్నికలలో బిఆర్ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి పని చేయాలని కోరారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరు నమోదు చేసుకోవాలని అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీల గెలుపుతోనే బిఆర్ఎస్ గెలుపు బాట మొదలవుతుందని అన్నారు. ఎమ్మెల్సీఎన్నికలలో బిఆర్ఎస్ పార్టీ గెలుపుకు పట్టభద్రులు పట్టం కట్టాలని అన్నారు. అనంతరం రాయపర్తి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని కోరుతూ మండల కేంద్రంలోని వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిపై బిఆర్ఎస్ శ్రేణులు చేసిన ధర్నా, రాస్తారోకోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాయపర్తి మండలంతో పాటు వరంగల్ జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు మునావత్ నర్సింహ నాయక్, జినుగు అనిమిరెడ్డి, రంగు కుమార్ గౌడ్, కుందూరు రామచంద్రరెడ్డి, పూస మధు, ఐత రాంచందర్, కర్ర రవీందర్ రెడ్డి, ఎలమంచి శ్రీనివాస్‌రెడ్డి, గాదె రవీందర్ రెడ్డి, గారె నర్సయ్య, లేతాకుల రంగారెడ్డి, తాళ్లపల్లి సంతోష్, భూక్య బద్రు నాయక్, గూడెల్లి శ్రీనివాస్, చిలువేరు సాయి గౌడ్, సంకినేని ఎల్లస్వామి, పల్లె ఎల్లగౌడ్, జాజు నాయక్, కంది ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు ఇండ్లు అందేలా సహకరించండి



ప్రజాపక్షం/జనగామ టౌన్: జనగామ పట్టణంలో ఇల్లులేని అర్హులైన పేదలకు ఇండ్లు మంజూరయ్యేలా ప్రత్యేక చొరవ తీసుకుని సహకరించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యేసిహెచ్ రాజారెడ్డి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిని కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే పార్టీ కార్యాలయంలో సిపిఐ నాయకుతో కలిసి ఎమ్మెల్యేను కలిసిన రాజారెడ్డి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. జనగామ పట్టణంలో ఇల్లులేని అర్హులైన పేదలను గుర్తించి, వారికి ఇండ్లు అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పల్లాకు విజ్ఞప్తి చేశారు. సిపిఐ నేతల విజ్ఞప్తిపై ఎమ్మెల్యే పల్లా సానుకూలంగా స్పందించారు. అర్హులైన పేద ఇళ్ల సమస్యపై జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి, వారికి ఇళ్లు అందేలా తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమ లో సిపిఐ పట్టణ కార్యదర్శి సోమయ్య, నా యకులు శ్రీశైలం, ఐలయ్య, వెంకటాద్రి, సరిత, సత్యవతి,లక్ష్మి ,తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుకు అనుకూల పరిస్థితులు

ప్రస్తుత పరిస్థితుల్లో పంట మార్పిడి తప్పనిసరి
రైతులకు విస్తృత అవగాహన కల్పించాలి
ఎల్ నినో నేపథ్యంలో ఆరుతడికి ప్రాధాన్యం
కలెక్టర్ చిత్రా మిశ్రా



ప్రజాపక్షం/కరీంనగర్: ప్రస్తుత పరిస్థితుల్లో పంట మార్పిడి తప్పనిసరి అని, ఈ సమయంలో దీర్ఘకాలిక ప్రయోజనాలను ఇచ్చే ఆయిల్ పామ్ సాగును రైతులు ఎంచుకోవాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు. వీణవంక మండలంలోని ఘన్ముకుల, పోతిరెడ్డిపల్లి, రెడ్డిపల్లి గ్రామాల్లో ఆయిల్ పామ్, కూరగాయల సాగు చేస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్న రైతులను కలిసేందుకు జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులు గుడిపాటి శివారెడ్డి, మాడ సమ్మిరెడ్డి, కూరగాయలు సాగు చేస్తున్న కారుపాకల శ్రీనివాస్‌తో కలెక్టర్ వారి పంట పొలాల వద్ద మాట్లాడారు. సాగు చేస్తున్న విధానం, విత్తనం, ఎరువులు, క్రిమిసంహారక మందులు, డ్రిప్ వ్యవస్థ, మార్కెటింగ్, పెట్టుబడి ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీ తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. మంచి ఫలితాలను సాధిస్తూ తోటివారికి ఆదర్శంగా నిలుస్తున్న రైతులను అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత ఎల్ నినో నేపథ్యంలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉందని తెలిపారు. వరి పంట జోలికి వెళ్లకుండా నీరు ఉన్న రైతులు ఆరుతడి పంటలు కూరగాయలు సాగు చేయాలని కోరారు. చిన్న, సన్నకారు రైతులు కూరగాయలు, పప్పు దినుసులు, నూనె గింజలు వంటి పంటలు వేసి మంచి లాభాలు గడించవచ్చని తెలిపారు. వీణవంక మండలంలోని పలు గ్రామాల్లో రైతులు ఈ విధానాన్ని ఎంచుకొని లాభాలు గడిస్తున్నారని తెలిపారు.

ఆయిల్ పామ్ సాగుకు డివిజన్ స్థాయిలో ప్రత్యేక ప్రణాళిక: ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో దీర్ఘకాలికంగా రైతుకు ప్రయోజనాలు ఇచ్చే ఆయిల్ పామ్ సాగు చేయాలని కలెక్టర్ సూచించారు. ఆయిల్ పామ్ సాగును పెద్ద ఎత్తున ప్రోత్సహించేందుకు డివిజన్ స్థాయిలో ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆర్‌డిఒ, ఆర్టికల్చర్, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, తెలంగాణ ఆయిల్ ఫెడరేషన్ సిబ్బంది సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. ఆయిల్ పామ్ సాగు లాభాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు వచ్చే వారంలో ఖమ్మం, నర్మెట్ల ప్రాంతాలకు క్షేత్రస్థాయి పర్యటనలు ఏర్పాటు చేయాలని అన్నారు. బిందు సేద్యం, ప్రభుత్వ సబ్సిడీ గురించి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. నాణ్యమైన మొక్కల పంపిణీ, ఎరువులు సూచించాలని, ఈ దిశగా రైతులను వ్యవసాయ అధికారులు ప్రోత్సహించాలని ఆదేశించారు. ఇదివరకే ఆయిల్ ఫామ్ సాగు చేస్తూ మంచి లాభాలు గడిస్తున్న రైతుల వద్దకు ఇతర రైతులను తీసుకెళ్లాలని, వారి తోటలను సందర్శించేలా చూడాలని పేర్కొన్నారు. పంట మార్పిడి లో భాగంగా మండలాల వారీగా ఏ ఏ పంటలు అనుకూలమో ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. సర్పంచులు రైతులకు విస్తృత అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని అన్నారు. రానున్న క్లిష్టమైన కాలంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా తాగునీటి సరఫరా, నిర్వహణ, మరమ్మతులపై ఆర్డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులు సమన్వయంతో దృష్టిసారించాలని ఆదేశించారు. ఈ సందర్శనలో హుజురాబాద్ ఆర్‌డిఒ జల కుమారి, డి హెచ్ ఎస్ ఓ జగన్మోహన్ రెడ్డి, ఆయిల్ ఫెడరేషన్ డిఎం రోహిత్, ఏ డి ఏ సునీత, హార్టికల్చర్ ఆఫీసర్ మధులిక, ఎంఏవో భూమి రెడ్డి, తహసిల్దార్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం అమ్మకాలపై ఆందోళన వద్దు.. ప్రతీ గింజనూ కొంటాం: ఎమ్మెల్యే



ప్రజాపక్షం/తిమ్మాపూర్ : రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డా.కవ్వంపల్లి సత్యనారాయణ స్పష్టం చేశారు. ధాన్యం అమ్మకాల విషయంలో రైతులు ఏలాంటి ఆందోళనలు చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. తిమ్మాపూర్ మండలంలోని రేణికుంట, మహాత్మానగర్ గ్రామాల్లో హాకా, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటలను కొనేందుకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో అవసరమైన కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందన్నారు. ధాన్యం సేకరణకు అవసరాన్ని బట్టి మరిన్ని కేంద్రాలను కూడా అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. రైతులందరూ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ఈ విషయంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

24 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ

ధాన్యం విక్రయించిన రైతులకు సకాలంలో చెల్లింపులు అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. ధాన్యం అమ్మిన 24 గంటలలోపే రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమయ్యేలా చూస్తామని పేర్కోన్నారు. రైతులకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియ సజావుగా జరగాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సయ్య, తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, నుస్తులాపూర్ పీఏసీఎస్ చైర్మన్ మోరపల్లి రమణారెడ్డి, పోరండ్ల పీఏసీఎస్ చైర్మన్ గోపు తిరుపతి రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు ఎలుక ఆంజనేయులు, పొన్నాల సంపత్, తదితరులుపాల్గొన్నారు.

పభుత్వం దృష్టికి మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ సమస్యలు



ప్రజాపక్షం/జగిత్యాల టౌన్: మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుక వెళుతానని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు.జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జగిత్యాల జిల్లా సభ్యులు కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకంలో అమలు చేయనున్న సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని రద్దు చేయాలని,ఇటీవల ప్రభుత్వం ప్రారంభించిన అల్పాహార పథకాన్ని కూడా వంట కార్మికులతోనే నిర్వహించాలని వారు కోరారు.అల్పాహార పథకానికి సంబంధించిన విధి విధానాలను వెంటనే ప్రకటించాలని, వంట కార్మికులకు అవసరమైన గ్యాస్‌తో పాటు వంట సరుకులను ప్రభుత్వం పూర్తిగా సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు.వర్కర్స్ యూనియన్ సభ్యుల సమస్యలను సానుకూలంగా విన్న ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ స్పందిస్తూ,వారి సమస్యలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వెన్న మహేష్, ఉన్నారు.

ఎల్ నినోతో ఆయిల్‌పామ్ తోటల సంరక్షణపై అప్రమత్తంగా ఉండాలి



ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్: ఎల్‌నినో నేపథ్యంలో వర్షపాతం తగ్గి భూగర్భ జలాలపై ప్రభావం పడే అవకాశం ఉన్నందున ఆయిల్‌పామ్ రైతులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని జిల్లా ఉద్యాన అధికారి గడ్డం శ్యాంప్రసాద్ సూచించారు.గురువారం దుగ్గెంపూడి కమలాకర్ రెడ్డి,గట్టు సింగారం తోటలను సందర్శించారు.ఆయిల్‌పామ్ దీర్ఘకాలిక ఆదాయ పంట అయినా నిరంతర నీరు, సమతుల్య పోషక యాజమాన్యం అవసరమని తెలిపారు.డ్రిప్ ద్వారా నీటి పొదుపు, ఎండు ఆకులతో మల్చింగ్ చేసి తేమ కాపాడటం, శాస్త్రీయ పద్ధతిలో తడులు,సేంద్రియ ఎరువులు,వర్షపు నీటి కోసం వ్యవసాయ కుంటలు,కొత్త సాగు చేసేవారు దీర్ఘకాలిక నీటి వనరు నిర్ధారించుకోవాలన్నారు.ప్రభుత్వ రాయితీలు, డ్రిప్ పరికరాలు, యాంత్రీకరణ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని, ఉద్యాన శాఖ సూచనలు పాటించాలని కోరారు.ఈ కార్యక్రమంలో తిరుమల ఆయిల్ కంపెనీ సీఈఓ కేశు కళ్యాణ్‌కర్, విస్తరణ అధికారి రాము,ఫీల్డ్ ఆఫీసర్ అరవింద్,జైన్ డ్రిప్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కెజిబివి విద్యార్థిని లాస్య మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి

ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జేరిపోతుల జనార్ధన్ డిమాండ్



ప్రజాపక్షం/సిద్దిపేట: సిద్దిపేట జిల్లా రాఘవాపూర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని లాస్య మృతి అత్యంత బాధాకరమైన ఘటన అని, ఈ ఘటనపై ప్రభుత్వం తక్షణమే స్పందించి సమగ్ర విచారణ జరిపించాలని ఎఐఎస్ఎఫ్ సిద్దిపేట జిల్లా కార్యదర్శి జేరిపోతుల జనార్ధన్ డిమాండ్ చేశారు. గురువారం రోజున ఆయన లాస్య మృతిపై ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా జనార్ధన్ మాట్లాడుతూ గత మూడు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థిని లాస్య పట్ల హాస్టల్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఆమె మృతి చెందిందనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో, ఈ ఘటనకు దారితీసిన పరిస్థితులపై అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని ఆయన కోరారు. విద్యార్థినికి అనారోగ్యం కలిగినప్పటి నుంచి ఆమెకు అందించిన వైద్య సహాయం, హాస్టల్ సిబ్బంది వ్యవహరించిన తీరు, సకాలంలో మెరుగైన వైద్యం అందించేందుకు తీసుకున్న చర్యలపై సమగ్రంగా దర్యాప్తు చేయాలని పేర్కొన్నారు. 3 రోజులుగా లాస్య తీవ్ర రక్తస్రావంతో బాధపడుతు ఉంటే హాస్టల్‌లో ఏఎన్ఎం, ప్రత్యేక అధికారి కుటుంబానికి సమాచారం అందించక, ఆసుపత్రికి తీసుకెళ్లక నిర్లక్ష్యం చేయడం వల్లే లాస్య మృతి చెందిందని ఆయన అన్నారు. లాస్య మృతికి గల వాస్తవాలను వెలికితీసి, విచారణలో నిర్లక్ష్యం లేదా బాధ్యతారాహిత్యం బయటపడితే సంబంధిత హాస్టల్ సిబ్బంది, అధికారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. లాస్య కుటుంబానికి రూ.50 లక్షల నష్టపరిహారం అందించడంతో పాటు, కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థిని లాస్య మృతిపై నిష్పక్షపాత విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకుని, బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించాలని ఆయన స్పష్టం చేశారు.

జిఎంపివిఎస్ జిల్లా ఇన్‌చార్జిగా అందె అశోక్ నియామకం



ప్రజాపక్షం/చేర్యాల : తెలంగాణ రాష్ట్ర ''గొర్రెల, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం'' (జిఎంపివిఎస్) సిద్దిపేట, జనగాం జిల్లాల ఇన్‌చార్జిగా చేర్యాల మండలం ఆకునూర్ గ్రామానికి చెందిన సిపిఐ పార్టీ సిద్దిపేట జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ నియమితులయ్యారు. హైద్రబాద్‌లోని రాజ్ బహదూర్ గౌర విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ, గొల్ల, కురుమలకు 75 శాతం సబ్సిడీ రుణాలు, పశువులకు నష్టపరిహారం, 50 ఏళ్లు నిండిన వారికి నెలకు 5 వేల రూపాయల పెన్షన్ అందించాలని అశోక్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ పదవి ద్వార తమ గొల్ల, కురుమల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అందె అశోక్ తెలిపారు.

2027 గోదావరి పుష్కరాలకు పకడ్బందీ ఏర్పాట్లు

దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యార్



ప్రజాపక్షం/పెద్దపల్లి : 2027లో జరిగే గోదావరి పుష్కరాలకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు చేపడుతోందని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యార్ తెలిపారు.పుష్కరాలకు మరో ఎనిమిది నెలల గడువు మాత్రమే ఉన్నందున అభివృద్ధి పనులను నిర్దేశిత సమయంలోగా పూర్తి చేసేందుకు నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. గురువారం దేవాదాయ శాఖ డైరెక్టర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి మంథనిలోని గోదావరి పుష్కర ఘాట్ వద్ద జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పుష్కర ఘాట్ పునర్నిర్మాణం, విస్తరణ పనుల పురోగతిని, ఆలయ అభివృద్ధి పనులను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2027లో జరిగే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతోందని తెలిపారు. మంథనిలో భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున టైర్1 కింద అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. మంథని పుష్కర ఘాట్ పునర్నిర్మాణం, విస్తరణ పనుల కోసం ప్రభుత్వం రూ.23 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, పుష్కర ఘాట్‌ను విస్తరించి అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. మంథనిలో కాశీ తరహాలో ప్రతి రోజూ సాయంత్రం గోదావరి నదికి సప్త హారతులు నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. మంథనిలోని గౌతమేశ్వర స్వామి ఆలయాన్ని రూ.10 కోట్ల వ్యయంతో ఆగమశాస్త్ర నిబంధనలకు అనుగుణంగా పునర్నిర్మిస్తున్నట్లు తెలిపారు. గోదావరి పుష్కరాల ఏర్పాట్ల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్ కమిటీకి మంత్రి శ్రీధర్ బాబు చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారని తెలిపారు. పనులన్నీ నిర్దేశిత గడువులోగా పూర్తయ్యేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీరాములు,రెవెన్యూ డివిజనల్ అధికారి సురేష్, అధికారులు,పాల్గొన్నారు.

జగిత్యాల సమగ్రాభివృద్ధే నా లక్ష్యం

ఎమ్మెల్యే సంజయ్ కుమార్



ప్రజాపక్షం/జగిత్యాల: జగిత్యాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల పురపాలక సంఘ కార్యాలయంలో మున్సిపల్ సమిండ్ల వాణి అధ్యక్షతన అక్టోబర్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ హాజరై మాట్లాడారు. చెత్త నిర్వహణలో ఆధునిక విధానాలను అవలంబిస్తూ పారిశుద్ధ్య సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రజలు,ప్రజా ప్రతినిధులు, అధికారులు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. మార్పు మన నుంచే ప్రారంభం కావాలని,ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించినపుడే పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడం సాధ్యమవుతుందని తెలిపారు.అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ మాట్లాడుతూ పట్టణంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ వంటి అంశాలకు ప్రాధాన్యత నిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు మున్సిపాలిటీ కృషి చేస్తుందని తెలిపారు.ప్రజాప్రతినిధులు,అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పట్టణ అభివృద్ధికి సహకరించాలని పేర్కొన్నారు.కౌన్సిలర్లు సభ దృష్టికి తీసుకువచ్చిన ప్రజా సమస్యలను పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ జీనత్ పర్వీన్ మునీరుద్దీన్,మున్సిపల్ కమిషనర్ సత్యప్రణవ్ తదితరులు ఉన్నారు.

మెట్‌పల్లి మున్సిపాలిటీలో వేడెక్కిన రాజకీయం



ప్రజాపక్షం/మెట్‌పల్లి: మెట్‌పల్లి మున్సిపాలిటీ సాధారణ సర్వసభ్య సమావేశం నిరసనల మధ్య చర్చనీయాంశంగా మారింది. మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారపు లింబాద్రి వ్యవహారశైలిపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ అన్ని పార్టీలకు చెందిన కౌన్సిలర్లు సమావేశం నుంచి వాకౌట్ చేశారు. చైర్‌పర్సన్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, వార్డుల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల వివరాలను తమకు తెలియజేయడం లేదని కౌన్సిలర్లు ఆరోపించారు.

వార్డుల్లో పనులపై సమాచారం కరువు! తమ వార్డుల్లో ఏయే అభివృద్ధి పనులు చేపడుతున్నారు? వాటి పురోగతి ఏమిటి? వంటి అంశాలపై ముందస్తు సమాచారం ఇవ్వకపోవడంతో ప్రజలకు సమాధానం చెప్పలేకపోతున్నామని కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత తమపై ఉన్నప్పుడు, అభివృద్ధి పనుల వివరాలు తెలియకపోవడం ఇబ్బందికరంగా మారుతోందని వారు అభిప్రాయపడ్డారు.

కౌన్సిలర్లకు ప్రాధాన్యత ఏదీ? మున్సిపాలిటీలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలపై కౌన్సిలర్లకు సమాచారం అందించాలని, కీలక నిర్ణయాల్లో వారిని భాగస్వాములను చేయాలని వారు డిమాండ్ చేశారు. కౌన్సిల్ సమావేశాల్లో పారదర్శకతతో పాటు ప్రజాప్రతినిధుల అభిప్రాయాలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. తమ అభ్యంతరాలను నిరసన రూపంలో తెలియజేస్తూ సమావేశం నుంచి బయటకు వచ్చారు.అన్ని పార్టీల కౌన్సిలర్లు ఒకేసారి వాకౌట్ చేయడం మెట్‌పల్లి రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. పట్టణ అభివృద్ధిపై చర్చించాల్సిన సమావేశంలోనే ప్రజాప్రతినిధులు నిరసనకు దిగడం గమనార్హం. కౌన్సిలర్ల అభ్యంతరాలపై మున్సిపల్ పాలకవర్గం ఎలా స్పందిస్తుంది? విభేదాలను పరిష్కరించి అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లేందుకు ఎలాంటి చర్యలు చేపడుతుందన్నది వేచి చూడాలి.

మల్లన్నసాగర్‌ను కూల్చేందుకు రేవంత్ సర్కార్ కుట్ర

మల్లన్నసాగర్ వద్ద అక్రమ పేలుళ్లను నిలిపివేయాలని నీటిపారుదల శాఖ మంత్రికి లేఖ రాసిన మాజీ మంత్రి హరీశ్‌రావు



ప్రజాపక్షం/సిద్దిపేట: సిద్దిపేట జిల్లా తిప్పారం గ్రామం వద్ద మల్లన్న సాగర్ రిజర్వాయర్ కట్ట సమీపంలో పైప్‌లైన్లు, పంప్‌హౌస్ నిర్మాణం కోసం జలమండలి అనధికారికంగా భారీ బ్లాస్టింగ్స్ చేస్తుండటంతో రిజర్వాయర్ కట్ట దెబ్బతినే ప్రమాదం ఉందని, గ్రామంలో ఇండ్లు కూలిపోతున్నాయని తిప్పారం గ్రామస్తులు. మాజీ మంత్రి, బిఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్ రావుకు ఫిర్యాదు చేశారు. గ్రామస్తుల సమాచారంతో హరీశ్ రావు శుక్రవారం మల్లన్న సాగర్ వద్దకు చేరుకుని రిజర్వాయర్ కట్టను, అక్రమ బ్లాస్టింగ్స్ జరుగుతున్న ప్రాంతాన్ని, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు ప్రతాప్ రెడ్డి, శ్రీనివాస్, బక్కి వెంకటయ్యకలసి పరిశీలించారు. బ్లాస్టింగ్ ఎవరు చేస్తున్నారని.. అనుమతులు తీసుకున్నారా? అని రెవెన్యూ, పోలీసులు, ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వారు ఏలాంటి అనుమతులు ఇవ్వలేదని చెప్పటంతో మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేసి అక్రమంగా బ్లాస్టింగ్ పనులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు అక్రమ బ్లాస్టింగ్ చేసిన కాంట్రాక్టర్, ఏజెన్సీపై నాన్ బెయిలబుల్ కేసులు కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మల్లన్న సాగర్ కట్ట వద్ద మాజీ మంత్రి హరీశ్ రావు మీడియాతో మాట్లాడుతూ. కాళేశ్వరం ప్రాజెక్టుపైన రేవంత్ రెడ్డి ప్రభుత్వం మొదటి నుంచీ కుట్రలు చేస్తోందన్న విషయం ఇక్కడి పరిస్థితులు చూస్తే స్పష్టంగా అర్థమవుతుందన్నారు. తిప్పారం గ్రామ సర్పంచ్ భద్రప్ప నాకు ఫోన్ చేసి.. మల్లన్న సాగర్ ప్రాజెక్టు దగ్గర మా గ్రామం పక్కనే కట్టకు కేవలం 100 నుంచి 200 మీటర్ల దూరంలోనే రాత్రిపూట చీకట్లో దొంగచాటుగా పెద్ద ఎత్తున బ్లాస్టింగ్స్ చేస్తున్నారు. దీనివల్ల మల్లన్న సాగర్ కట్ట అదురుతోంది. కిలోమీటర్ దూరంలో ఉన్న మా ఊర్లో ఇండ్లు నెర్రెలు బారి కూలిపోతున్నాయి అని ఆవేదన వ్యక్తం చేశారు.

మల్లన్నసాగర్ భద్రతపై నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బహిరంగ లేఖ

మంత్రి తక్షణమే స్పందించి ఈ అక్రమ బ్లాస్టింగ్స్‌పై రివ్యూ చేయాలి, నిపుణులైన ఇంజినీర్లతో కట్టను పరిశీలించి భద్రతా చర్యలు చేపట్టాలి. తక్షణమే ఈ బ్లాస్టింగ్ పనులను నిలిపివేయాలి. తిప్పారం సర్పంచ్, గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు వెంటనే ఎఫ్ఐఆర్ న మోదు చేసి, అక్రమ బ్లాస్టింగ్స్ చేసిన కాంట్రాక్టర్, ఏజెన్సీపై నాన్‌బెయిలబుల్ కేసులు పెట్టా లి. మల్లన్న సాగర్ కట్టకు ఏ చిన్న నష్టం జరిగినా దానికి పూర్తి బాధ్యత జలమండలి అధికారులదే నని రాష్ట్ర ప్రభుత్వాన్ని మాజీ మంత్రి హరీష్ రావు హెచ్చరించారు.

అనుమానిత ప్రదేశాలలో పోలీసుల సోదాలు

ప్రజాపక్షం/జగదేవ్‌పూర్: మాదక ద్రవ్యాలు,మత్తు పదార్థాలు ఆచూకి కోసం అనుమానిత ప్రదేశాలలో పోలీసులు సోదాలు నిర్వహించారు. గురువారం పోలీసులు జగదేవ్‌పూర్‌లో మత్తు పదార్థాలు విక్రస్తూన్నరన్న అనుమానంతో కిరాణ దుకాణాలు, హోటళ్లు, ఫాన్ షాపులలో పోలీస్ జాగిలాలతో విస్తృతంగా సోదాలు నిర్వహించారు. దుకాణాలలో ఎలాంటి నిషేదిత ఫాన్‌మసాలాలు, మత్తు పదార్థాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

అనుమానాస్పద స్థితిలో రాఘవపూర్ కెజిబివి విద్యార్థిని మృతి

స్కూల్ సిబ్బంది నిర్లక్ష్యం వల్లే తమ కూతురు మరణించిందని తల్లిదండ్రుల ఆరోపణ..
సిద్దిపేట ప్రభుత్వ హాస్పిటల్ ముందు ధర్నా, భారీ బందోబస్తు, తోపులాట, తీవ్ర ఉద్రిక్తత
ధర్నాలో పాల్గొన్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్.



ప్రజాపక్షం/ సిద్దిపేట : అనుమానాస్పద స్థితిలో టెన్త్ క్లాస్ విద్యార్థిని మృతి చెందిన సంఘటన సిద్దిపేట రూరల్ మండలం రాఘవపూర్ కెజిబివి లో చోటు చేసుకుంది. స్కూల్ సిబ్బంది నిర్లక్ష్యం వల్లే తమ కూతురు మరణించిందని తల్లిదండ్రుల ఆరోపిస్తున్నారు. రూరల్ సిఐ విద్యాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం తొగుట మండలం గుడికందుల గ్రామానికి చెందిన దాపులగల్ల సంతోష్ కుమార్ కు ముగ్గురు ఆడపిల్లలు, ఒక అబ్బాయి కాగా, పెద్ద కుమార్తె లాస్య (15), రాఘవాపూర్ కేజీబీవీలో పదవ తరగతి చదువుతోంది. దసరా సెలవులకు ఇంటికి వెళ్లిన లాస్య ఈ నెల 24న స్కూల్‌కు తిరిగి రాగా, 28 న ఉదయం 9:00 గంటలకు స్కూల్ టీచర్ లాస్య తండ్రికి ఫోన్ చేసి, ఆమె ఆరోగ్యం బాగాలేదని, మళ్లీ అదే రోజు రాత్రి 9:30 గంటల సమయంలో మళ్లీ ఫోన్ చేసి లాస్య రెండు మూడు రోజుల క్రితమే పుష్పవతి అయిందని, ఉదయాన్నే వచ్చి ఇంటికి తీసుకెళ్లాలని సూచించారని తెలిపారు. దీంతో తెల్లవారుజామున వస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. గురువారం తెల్లవారుజామున 4:00 గంటల ప్రాంతంలో లాస్య తండ్రి స్కూల్ కు ఫోన్ చేసి పరిస్థితిని ఆరా తీయగా, లాస్య ఆరోగ్యం విషమించడంతో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్నామని, అక్కడికి రమ్మని సిబ్బంది చెప్పినట్లు తెలిపారు. కాగా తల్లిదండ్రులు, బంధువులు ఆసుపత్రికి చేరుకునేసరికే లాస్య అప్పటికే మరణించినట్లు వైద్యులు ధృవీకరించారని, తమ కూతురు మరణానికి స్కూల్ సిబ్బంది కారణమని ఆమె మరణంపై అనుమానం ఉందని లాస్య తండ్రి సంతోష్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. లాస్య మృతుని నిరసిస్తూ ఆసుపత్రి ఎదుట మృతురాలి తల్లిదలంద్రులు, బంధువులు పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. వివిధ కులసంఘాలు, విద్యార్థి సంఘాలకు వారికి మద్దతు ప్రకటించారు. పోలీసులు పెద్ద ఎత్తున మోహరించారు. సిద్దిపేట ఏసిపి రవీందర్‌రెడ్డి, సిఐ విద్యాసాగర్ సంఘటన స్థలాన్ని సందర్శించారు. పరిస్థితిని సమీక్షిస్తున్నారు. కలెక్టరేట్ ఎదుట విద్యార్థి మృతదేహం తరలిస్తామని మృతురాలు బంధువులు. వివిధ సంఘాల నేతలు మృతదేహాన్ని మార్చురీని నుండి తరలించే యత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కొద్ది సేపు ఉద్రిక్తతగా దారితీసింది. పోలీసులు వారిని వారించే యత్నం చేశారు. బాధితులు స్కూల్ సిబ్బంది నిర్లక్ష్యమే తమ కుమార్తె లాస్య మృతికి కారణమని సిద్దిపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

లాస్య మృతిపై సమగ్ర విచారణ జరిపి బాధిత కుటుం-బానికి న్యాయం చేయాలి: ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో గుడికందుల గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థిని లాస్య మృతదేహాన్ని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పరిశీలించి, ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు.విద్యార్థిని మృతికి సంబంధించిన పలు అనుమానాలను ప్రస్తావిస్తూ, ఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన విద్యార్థిని కుటుంబానికి 20 లక్షల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.



ఖమ్మం
శుక్రవారం
30-10-2026
www.prajapaksham.in
ప్రజాపక్షం
Telugu National Daily

దేశ వ్యాప్తంగా 'ఓట్‌చోరీ'

నిరసనలు కొనసాగుతాయ్

- బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలను ఎదుర్కోవాలి
- బిజెపికి కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే సవాల్




బెంగళూరు/న్యూఢిల్లీ: ఓట్ల దొంగతనం ఆరోపణలపై దేశవ్యాప్తంగా నిరసనలు కొనసాగుతాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే గురువారం స్పష్టం చేశారు. తమ ఎన్నికల పనితీరుపై నమ్మకం ఉంటే, పార్లమెంటును రద్దు చేసి బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలను ఎదుర్కోవాలని ఆయన బిజెపికి సవాలు విసిరారు. ఓట్ల దొంగతనానికి వ్యతిరేకంగా నవంబర్ 1న ఢిల్లీలో ఇండియా కూటమి భారీ నిరసన కార్యక్రమం చేపట్టనుంది. ఓటర్ల జాబితా నుంచి, ముఖ్యంగా మైనారిటీలు, ఆర్థికంగా, సామాజికంగా బలహీన వర్గాలకు చెందిన అనేక మంది ఓటర్ల పేర్లను పెద్ద ఎత్తున తొలగించడం, మినహాయించడం జరిగిందని ఆరోపించింది. 'ఓట్ల దొంగతనానికి, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా నిరసనలు కొనసాగుతాయి. ఆయన చేసింది కమిషన్‌లో చేసిన అక్రమం. ఈ నిరసనకు అన్ని పార్టీలు మద్దతు ఇస్తున్నాయి' అని ఖర్గే గురువారం బెంగళూరులో విలేకరులతో చెప్పారు. ఎన్నికల అవకతవకలపై అవగాహన కల్పించేందుకు కాంగ్రెస్ తన ప్రచారాన్ని కొనసాగిస్తుందని, ఇందులో భాగంగా శుక్రవారం మాక్ పార్లమెంటును, నవంబర్ 1వ తేదీన ఒక ర్యాలీని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. అయితే బ్యాలెట్ పేపర్ ఓటింగ్ విధానం ఉపయోగించినప్పటికీ, కర్ణాటక శాసన మండలి ఎన్నికలలో బిజెపి, జెడి(ఎస్)లు నాలుగు స్థానాలనూ గెలుచుకున్న ఫలితాల గురించి అడగగా, భవిష్యత్తులో జరిగే అన్ని ఎన్నికలకు తమ పార్టీ బ్యాలెట్ పేపర్ల కోసం డిమాండ్ చేస్తూనే ఉంటుందని ఖర్గే అన్నారు. బిజెపి గెలుస్తుందని తాము తమ డిమాండ్‌ను వదులుకోవాలని దీని అర్థం కాదని, ఒకప్పుడు (బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలు జరిగినప్పుడు) వారు కేవలం రెండు పార్లమెంట్ సీట్లు మాత్రమే గెలుచుకున్నారని గుర్తుచేశారు. అభ్యర్థులు వేర్వేరు మెజారిటీలతో గెలవడంలోని ప్రాముఖ్యతను ప్రశ్నిస్తూ, ఫలితాల పట్ల ఆత్మసంతృప్తి చెందవద్దని ఖర్గే బిజెపిని హెచ్చరించారు.

'సర్' ఓ కుట్ర : జైరామ్ రమేశ్

'సర్' అనేది, భారతదేశంలోని అత్యధిక వర్గాల ప్రజల రాజ్యాంగబద్ధమైన ఓటు హక్కును హరించడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా రూపొందించి, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ అమలు చేసిన ఒక 'కుట్ర' అని కాంగ్రెస్ ఆరోపించింది. ఓటర్ల జాబితాలను శుద్ధి చేసేందుకు చొరబాటుదారులను గుర్తించడం, తొలగించడం, బహిష్కరించడం అనే మూడు లక్ష్యాలతో సర్ పనిచేస్తుందని హోం మంత్రి చెప్పారు అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ గుర్తుచేశారు. అసలు సర్ సాధించింది ఏమిటి? అని ఆయన ప్రశ్నించారు. 'కర్ణాటక, జార్ఖండ్, మేఘాలయ, కేరళ, గోవా, మిజోరం రాష్ట్రాల్లో, వివిధ దేశాలకు చెందిన కేవలం 1600 మంది విదేశీయులను గుర్తించి తొలగించారు. ఈ రాష్ట్రాల్లో 1600 మంది విదేశీయులను కనుగొనడం కోసం దాదాపు 10 కోట్ల మంది సర్‌ను పరిశీలించారు' అని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. మిగిలిన 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు డేటాను అందించలేదు, ఎందుకంటే అలాంటి డేటాను సేకరించమని ఇసిఐ కోరలేదని రమేశ్ అన్నారు. హోం మంత్రి అబద్ధం చెబుతున్నారని ఆయన మండిపడ్డారు. 99.7 లక్షల పేర్లను తొలగించిన కర్ణాటకలో, 716 మంది విదేశీ జాతీయులను గుర్తించగా, వారిలో 545 మంది నేపాల్‌కు చెందినవారని ఆయన తెలిపారు. 'జ్ఞానేష్ కుమార్ వెళ్ళిపోవాలి. ఎస్ఐఆర్‌ను నిలిపివేయాలి. సిఇసిని ట్‌ను పునరుద్ధరించాలి' అని ఈ విషయంపై కాంగ్రెస్ డిమాండ్లను వివరిస్తూ రమేశ్ అన్నారు.

లాఠీలకు భయపడొద్దు

- కుతంత్రాలను ప్రయోగించే దమ్ము బిజెపికి లేదు
- ఇండియా కూటమి ర్యాలీలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి
- విద్యార్థి సంఘాలకు ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ పిలుపు



న్యూఢిల్లీ : ఇండియా కూటమి నవంబరు 1వ తేదీన తలపెట్టిన చలో ఢిల్లీ ర్యాలీలో ప్రతిఒక్కరూ పాల్గొనాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. పోలీసులు, లాఠీలకు భయపడాల్సిన అవసరం లేదన్నారు. తమ కుతంత్రాలను ప్రయోగించే దమ్ము బిజెపికి లేదన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి, ఓట్ల దొంగతనాన్ని అరికట్టడానికి, రాజ్యాంగాన్ని పరిరక్షించడానికి, వారి రాజకీయ అనుబంధాలతో సంబంధం లేకుండా, ఇండియా కూటమి నిర్వహించే యాత్రలో విద్యార్థి సంఘాలు పాల్గొనాలని కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. 'చలో ఢిల్లీ' రామ్ లీలా యాత్ర ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి, ఓట్ల దొంగతనానికి ముగింపు పలకడానికి, రాజ్యాంగాన్ని పరిరక్షించడానికి చేసే యాత్ర అని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు ఉద్ఘాటించారు. ఏ ఒక్క రాజకీయ పార్టీ కోసమూ చేసే యాత్ర కాదని, భారతదేశ ఆత్మ కోసమే చేసేది ఆయన నొక్కి చెప్పారు. 'నరేంద్ర మోదీ, అమిత్ షా, జ్ఞానేష్ కుమార్‌ల మీద విసిగిపోయిన వారందరినీ, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, రాజ్యాంగాన్ని రక్షించాలని కోరుకునే ప్రతి ఒక్కరినీ యాత్రలో ఆహ్వానిస్తున్నాను' అని అన్నారు. 'మాతో కలిసి యాత్రకు రండి రాజ్యాంగాన్ని పరిరక్షించడానికి, భారత దేశాన్ని రక్షించడానికి మనం కలిసి నడుద్దాం' అని ఆయన అన్నారు. రాజకీయ అనుబంధంతో సంబంధం లేకుండా, విద్యార్థి సంఘాలన్నింటినీ కోరుతున్నాను... భారతదేశంపై దాడి జరుగుతోందని, మీపై దాడి జరుగుతోందని, మీ భావప్రకటనా స్వేచ్ఛ, మీ ఆలోచనలు, మీ ఆలోచనా విధానంపై దాడి జరుగుతోందని మీకు అనిపిస్తే, ముందుకు వచ్చి మాతో చేరండి' రాహుల్ సూచించారు. 'ఇది ఒక అద్భుతమైన యాత్ర అవుతుంది, ఇది ఈ దేశ ఆత్మ కోసం చేసే యాత్ర' అని చెప్పారు. మీ అందరినీ అక్కడ చూడాలని ఎదురుచూస్తున్నానన్నారు.

రామ్‌లీలా మైదానంలో 'ర్యాలీ'కి ముమ్మర ఏర్పాట్లు





న్యూఢిల్లీ : 'ఓట్ల దొంగతనం' ఆరోపణలపై సిఇసి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్‌చేస్తూ ఇండియా కూటమి నవంబర్ 1న ర్యాలీ నిర్వహించనుంది. రామ్‌లీలా మైదాన్‌లో నిర్వహించే ర్యాలీకి ఏర్పాట్లు ముమ్మరమయ్యాయి. కార్మికులు పెద్ద త్రివర్ణ పతాకాన్ని ఏర్పాటు చేస్తుండగా, అమరిక కోసం ప్లాస్టిక్ కుర్చీల భారీ కుప్పలు, కాపలాగా అమర్చే బారికేడ్లు కనిపించాయి. ప్రతిపక్ష నాయకుల కోసం ఏర్పాటు చేసిన ప్రధాన వేదికపై ఒక పెద్ద గుడారాన్ని నిర్మిస్తుండగా, ఇండియా కూటమి పార్టీల రాష్ట్ర విభాగాల కోసం మరో వేదికను సిద్ధం చేస్తున్నన్న దృశ్యాలు దర్శనమిచ్చాయి. సమీపంలో తెల్లటి గుడారాల వరుసలను ఏర్పాటు చేశారు. ప్రజల రాకపోకలను నియంత్రించడానికి లోహపు బారికేడ్లను అమర్చుతున్నారు. కార్మికులు తాత్కాలిక వేదికలను ఏర్పాటు చేసి, వేదికను సిద్ధం చేస్తుండగా, మినీట్రక్కులు ప్లాస్టిక్ కుర్చీలు, ఇతర సామాగ్రిని తీసుకురావడం వంటి పనులు చకచకా జరుగుతున్నాయి. ఎన్నికల సంఘం పనితీరులో జరిగిన అవకతవకలు, ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ (సర్)కు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు సాగిస్తున్న ప్రచారంలో భాగంగా, నవంబర్ 1వ తేదీన ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ ప్రదర్శన జరగనుంది. ఈ ర్యాలీలో సుమారు 10 లక్షల మంది పాల్గొంటారని అంచనా వేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. అయితే, సుమారు 50,000 మంది గుమిగూడే అవకాశం ఉందని, భద్రత, జన సమూహా నియంత్రణ కోసం దాదాపు 3,500 మంది సిబ్బందిని మోహరిస్తామని ఢిల్లీ పోలీసులు తెలిపారు. నవంబర్ 1న జరిగే ర్యాలీ కోసం రాష్ట్రాలవ్యాప్తంగా కార్యకర్తలను సమీకరించాలని కాంగ్రెస్ చూస్తోంది. ఇందు కోసం హాజరును సమన్వయం చేయడానికి పార్టీ నాయకులు రాష్ట్ర విభాగాలతో సమావేశమవుతున్నారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించే ఉద్యమంగా దీనిని అభివర్ణిస్తూ, విద్యార్థులు, పౌర సంఘాలతో సహా ప్రజలందరూ ఈ సభలో చేరాలని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ విజ్ఞప్తి చేశారు. ఢిల్లీకి పొరుగు రాష్ట్రాల పార్టీ నాయకులను పెద్ద సంఖ్యలో కార్యకర్తలను సమీకరించాలని కోరారు. సభ జరిగే ప్రదేశాన్ని పర్యవేక్షించడానికి 200కు పైగా సిసిటివి కెమెరాలు, శరీరానికి అమర్చుకునే కెమెరాలు, నిఘా పరికరాలు అమర్చిన వాహనాలను ఉపయోగిస్తామని పోలీసులు తెలిపారు. జన సమూహ నియంత్రణ కోసం పోలీసులు వేదికను 14 జోన్లుగా విభజించి, 10 కంపెనీల రిజర్వ్ బలగాలను రంగంలోకి దించారు. ప్రతి జోన్‌ను ఒక అసిస్టెంట్ కమిషనర్ హోదా అధికారి పర్యవేక్షిస్తారు, కాగా రెండు జోన్‌లను అదనపు డిప్యూటీ కమిషనర్ హోదా అధికారులు పర్యవేక్షిస్తారు. చనిపోయినట్లుగా గుర్తించబడిన లేదా ఓటర్ల జాబితా నుండి తొలగించబడిన ఓటర్లకు ప్రతీకగా, పాల్గొనేవారు దెయ్యాల వలె కనిపించడానికి తెల్లని వస్త్రాలు ధరిస్తారని ఇండియన్ యూత్ కాంగ్రెస్ తెలిపింది. కొంతమంది పాల్గొనేవారు బాట్‌మాన్ మాస్క్‌లను కూడా ధరిస్తారని ఆ సంస్థ పేర్కొంది. కాంగ్రెస్ నాయకుడు మనీష్ చత్రత్‌కు అక్టోబర్ 17న పంపిన ఒక అధికారిక లేఖలో, భూమి యాజమాన్య సంస్థ నుండి అనుమతి, నిర్దిష్ట షరతులకు లోబడి, అక్టోబర్ 25 నుండి నవంబర్ 3 వరకు రామ్‌లీలా మైదాన్‌ను బుక్ చేసుకోవడానికి పార్టీ చేసిన అభ్యర్థనను మంజూరు చేశారు. నిర్వాహకులను కీలక ప్రదేశాలలో హైడెఫినిషన్ సిసిటివి కెమెరాలను ఏర్పాటు చేయాలని, ఫుటేజీని పర్యవేక్షించడానికి ఒక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఆహ్వానితులు, వాలంటీర్లు, పాల్గొనేవారిని తరలించే బస్సుల వివరాలను కూడా కోరినట్లు పోలీసులు తెలిపారు. కార్యక్రమ స్థలంలో రాత్రి బస చేయడానికి అనుమతి లేదని, అలాగే అవాంఛనీయ ప్రవర్తన లేదా మత సామరస్యానికి వారు తెలిపారు.

100 శాతం ఇథనాల్‌తో నడిచే వాహనాలకు అనుమతిస్తే...

అవసరమైన సప్లయ్ ఎలా చేస్తారు?

ప్రభుత్వాన్ని 'ప్రశ్నించిన' సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ : వంద శాతం ఇథనాల్‌తో నడిచే వాహనాలకు అనుమతి ఇచ్చినట్లయితే, దానికి అవసరమైన ఇంధన సరఫరాను ఎలా చేపడతారని సుప్రీంకోర్టు గురువారం ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. అక్టోబరు 26న, రోడ్డు రవాణ మంత్రిత్వ శాఖ, ఇ-100 (దాదాపు స్వచ్ఛమైన ఇథనాల్) వరకు ఇంధనంతో నడిచే ఫ్లెక్స్-ఫ్యూయల్ వాహనాలను అనుమతిస్తూ, సెంట్రల్ మోటార్ వెహికిల్ రూల్స్ 1989కి మార్పులను నోటిఫై చేసింది. ఇ-100 ఇంధనం, వాహనాలను దాదాపు స్వచ్ఛమైన ఇథనాల్‌తో నడపడానికి వీలు కల్పిస్తుంది. అక్టోబరు 27న, పెట్రోలియనం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి మాట్లాడుతూ, పెట్రోల్‌లో ఇథనాల్ మిశ్రమాన్ని ప్రస్తుత 20 శాతానికి మించి పెంచేందుకు కేంద్రానికి తక్షణ ప్రణాళిక ఏదీ లేదని స్పష్టంచేశారు. 2925'-26 ఇథనాల్ సరఫరా సంవత్సరం (ఇఎస్‌వై) కోసం ఇథనాల్ కేటాయింపులకు సంబంధించిన పిటిషన్లపై విచారణ జరుపుతున్నప్పుడు సుప్రీంకోర్టు గురువారం ఈ అంశంపై ఇటీవలి మీడియా కథనాలను ప్రస్తావించింది. 'మొన్న మేం కొన్ని వార్తా పత్రికల కథనాలను చూశాం. 100 శాతం ఇథనాల్‌తో నడిచే వాహనాలకు అనుమతి ఉందని అందులో పేర్కొనబడ్డాయి' అని జస్టిస్ ఎంఎం. సుందరేశ్, జస్టిస్ ప్రసన్న బి.వరాలేలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం పేర్కొంది. 100 శాతం ఇథనాల్‌తో నడిచే వాహనాలకు అనుమతి ఇచ్చినప్పుడు మీరు సప్లయ్ ఎలా చేస్తారు? అనే విషయాన్ని మేము క్షుణ్ణంగా తెలుసుకోవాలని అనుకుంటున్నాం' అని ధర్మాసనం అడిగింది. దీనిపై అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి సమాధానమిస్తూ 'దానికి భారీ స్థాయిలో తయారీ రంగంలో పునర్వ్యవస్థీకరణలు అవసరం అవుతాయి' అని తెలియజేశారు. విచారణ సందర్భంగా, దేశంలోని రైతులకు సాధికారత కల్పించే విషయమై ధర్మాసనం నొక్కిచెప్పింది. విస్తృత ప్రజా ప్రయోజనాల అంశాన్ని పరిగణనలోనికి తీసుకోవడంతో పాటు, ఈ సమస్యను పర్యావరణ కోణంలో నుంచి కూడా చూడాల్సిన అవసరం ఉందని ధర్మాసనం పేర్కొంది. ఇక మూడవది దేశంలోని అధిక సంఖ్యాక ప్రజలైన రైతుల దృక్కోణం నుంచి చూడటం చాలా ముఖ్యమైనదని నేను భావిస్తున్నాను. రైతులకు ఎలా సాధికారత కల్పించాలనే మూడవ సమస్యను మనం పరిష్కరించాలి. ఈ అంశాన్ని ఎవరూ ప్రముఖంగా ప్రస్తావించడం లేదు' అని జస్టిస్ సుందరేశ్ వ్యాఖ్యానించారు. ఈ విషయమై తన వాదనల సందర్భంగా రైతులకు సంబంధించిన సమస్యను తాను ప్రస్తావిస్తానని వెంకటరమణి చెప్పారు. 'ఇంకా గ్రామాలలో ఉన్న సామాన్యుడికి మనం సాధికారత కల్పించాలి' అని ధర్మాసనం పేర్కొంది.ఈ అంశాలకు సంబంధించి హాజరైన న్యాయవాదులలో ఒకరు మాట్లాడుతూ ఇథనాల్ ప్రోత్సాహం రైతులకు ఏదో ఒక రూపంలో సహాయపడుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ పాలసీ రైతుల ప్రయోజనాల అంశాన్ని కూడా పరిగణనలోనికి తీసుకుంటుందని న్యాయవాది తెలిపారు. అనంతరం ధర్మాసనం ఈ విషయమై విచారణను వచ్చే నెలకు వాయిదా వేసింది. ప్రస్తుతం తక్కువ ఇథనాల్ గాఢతలకు ఆమోదం పొందిన సాంప్రదాయ పెట్రోల్ వాహనాలకు భిన్నంగా, ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాలు ఇ-85 (85 శాతం ఇథనాల్, 15 శాతం పెట్రోల్), ఇ-100 (దాదాపు 100శాతం ఇథనాల్) వంటి అధిక ఇథనాల్ మిశ్రమంతో నడిచేలా రూపొందించబడ్డాయి. ఇదిలాఉంటే, ఇటీవల రోడ్డు రవాణ, రహదారుల మంత్రిత్వ శాఖ ఇ-85తో పాటు ఇ-100ను కూడా స్పష్టంగా చేర్చడం ద్వారా ఉద్గార ధృవీకరణ నిబంధనలను నవీకరించే సవరణలను ప్రకటించింది. ఇథనాల్ సరఫరా సంవత్సరం (ఇఎస్‌వై) 20225-26 సంవత్సరం కోసం ఇథనాల్ కేటాయింపులు పెంచాలన్న కర్ణాటక హైకోర్టు ఆదేశంపై జూన్ 30న సుప్రీంకోర్టు యథాతథ స్థితిని కొనసాగించాలని ఆదేశించింది. పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలపాలనే జాతీయ పాలసీని హైకోర్టు ఆదేశంఅస్థిరపరుస్తుందని పేర్కొంటూ ఒక ఒక ఆయిల్ మార్కెటింగ్ కంపెనీ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణవిచారణ జరుపుతున్నది.

బాణసంచా నియంత్రణ ఉత్తర్వుతో ఉపయోగమేంటి?

- ఏటా చెప్తున్నా క్షేత్రస్థాయిలో అమలు చేయడం లేదు
- ఢిల్లీ కాలుష్యంపై ప్రభుత్వాన్ని మందలించిన సుప్రీంకోర్టు
- ప్రముఖుల సహాయంతో ప్రజల్లో మార్పు తేవాలని సూచన
- నవంబరు నుంచి వరుస చర్యలు చేపడుతున్నట్లు ప్రభుత్వ వివరణ



న్యూఢిల్లీ:క్షేత్రస్థాయిలో అమలు చేయనప్పుడు ఢిల్లీ-జాతీయ రాజధాని ప్రాంతం(ఎన్‌సిఆర్)లో బాణసంచా నియంత్రణ ఉత్తర్వులు ఇచ్చినా ఉపయోగం ఏముందని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. కార్యాచరణ చేపట్టని అధికార యంత్రాంగాన్ని మందలించింది.ఢిల్లీ-ఎన్‌సిఆర్‌లో బాణసంచా కాలుష్యంపై కేసు విచారణ సందర్భంగా,అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్యాభాటి చేసిన వాదనకు జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్,జస్టిస్ ప్రసన్న,జస్టిస్ బి.వరలేలతో కూడిన ధర్మాసనం పైవిధంగా స్పందించింది. హరిత-పర్యావరణహితం పేరుతో బాణసంచా కాల్చడాన్ని రోజులో కొన్ని గంటలకు మాత్రమే పరిమితం చేయాలని అదేశించింది. మరో పిటిషనర్ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది శంకరనారాయణన్ ధర్మాసనానికి ఒక ఫిర్యాదు చేస్తూ,న్యాయస్థానం వరుసగా ఇస్తున్న మార్గదర్శకాలు, ఉత్తర్వులను ఉల్లంఘిస్తున్నందువల్ల బాణసంచా తయారీ నిషేధించాలని కోరారు. మరో న్యాయవాది ఈ ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రజల మనోభావాలు తమకు తెలుసునని,బాణసంచాను పూర్తిస్థాయిలో నిషేధించేందుకు సుప్రీంకోర్టు సిద్ధంగా లేదని,అలాగని ఇరవైనాలుగు గంటలూ బాణసంచా కాల్చేందుకు అనుమతించబోమని సెప్టెంబరు 30వ తేదీన ఈ కేసు విచారణ సందర్భంగా ఇప్పటికే ధర్మాసనం తన వైఖరిని తెలియజేసింది.''కాలుష్యం ప్రతి జీవికీ సంబంధించిన విషయం'' అని ధర్మాసనం పేర్కొంటూ,అమలు చేయనప్పుడు ప్రతి సంవత్సరం మేం ఉత్తర్వులు జారీ చేయడంలో అర్థం లేదు అని ప్రభుత్వాన్ని మందలించింది.''ఇది సలహాపూర్వకమైన విషయం కాదు,అధికారులు దీనిని తీవ్రంగా పరిగణించాలి,కార్యాచరణ చేపట్టాలి,మీరు క్షేత్రస్థాయిలో నిజంగా నియంత్రించాలి, మేం సమన్వయం చేస్తాం, ప్రజల మనోభావాలు మాకు తెలుసు,అసలు క్షేత్రస్థాయిలో ఏం జరుగుతోందో తెలుసుకోండి,ప్రజల ఆలోచనల్లో మార్పు తెచ్చేందుకు అవసరమైతే సమాజంలో క్రీడాకారులు,ఇతర ప్రజాచైతన్య ప్రముఖుల సహాయం ఎందుకు తీసుకోకూడదు? ఈ విషయంలో ప్రతి ఒక్కరూ సహకరించాలి,ప్రతి సంవత్సరం మేం ఉత్తర్వులు జారీ చేయడం ఒక చట్టపరమైన విషయంగా ఉందితప్ప కాలుష్య నియంత్రణకు మీరు ఏం చర్యలు తీసుకుంటున్నారు?'' అని ధర్మాసనం ప్రశ్నించింది.గాలి నాణ్యత నిర్వహణకు సంబంధించిన కమిషన్,ఢిల్లీ ప్రభుత్వం తీసుకున్న చర్యల గురించి ఐశ్వర్యాభాటి ధర్మాసనానికి తెలియజేశారు.ఈ ఏడాది ఢిల్లీ ప్రభుత్వం కాలుష్య నియంత్రణకు విస్తారణమైన ప్రణాళిక రూపొందించిందని ఆమె తెలియజేశారు.ప్రభుత్వం తీసుకున్న వరుస చర్యలు ఈ నవంబరు నుండి అమలులోకి వస్తాయని చెప్పారు.పాత వాహనాలను అదుపుచేయడం, పని సమయాలను మార్పు చేయడం,నిర్మాణ కార్యకలాపాల నియంత్రణ, కూల్చివేతలు వంటివాటిని అదుపు చేస్తున్నట్లు భాటి తెలియజేశారు. ఈ కాలుష్య సీజన్‌లో నియంత్రణ చర్యలను ప్రభుత్వం ముమ్మరం చేసిందని చెప్పారు.బాణసంచాలో బేరియం వినియోగంపై అంతర్గతత చర్యలు కూడా కొనసాగుతున్నాయని కేంద్ర ప్రభుత్వం ధర్మాసనానికి తెలియజేసింది.ఈ సంప్రదింపుల ప్రక్రియ పూర్తి చేయడానికి మూడు వారాలు గడువు అవసరం అవుతుందని భాటి తెలియజేశారు.ఈ విషయాన్ని మూడు వారాల తర్వాత తాము సమీక్షిస్తామని ధర్మాసనం పేర్కొంది.ఢిల్లీ-ఎన్‌సిఆర్‌లో బాణసంచా,పంట వ్యర్థాలను దగ్ధంచేయడం,ఇతర ఘన వ్యర్థాల నిర్వహణపై సుప్రీంకోర్టు తనంతట తానుగా (సుమోటో)చేపట్టిన కేసుతోపాటు బాణసంచా తయారీ,మరో రెండు అనుబంధ పిటిషన్లపై విచారణ జరుపుతోంది.సుమోటో కేసులో సుప్రీంకోర్టు తరపున కోర్టు మిత్రుడుగా వ్యవహరిస్తున్న న్యాయవాది ఒకరు మాట్లాడుతూ,బాణసంచా కాల్చడంవల్ల కాలుష్యం చెలరేగి ఊపిరితిత్తులకు తీవ్రహాని కలుగుతుందన్నారు.దసరా సందర్భంగా ఢిల్లీ-ఎన్‌సిఆర్ గాలి నాణ్యతలో కాలుష్యం గణనీయంగా పెరిగిందని,''పర్యావరణ అనుకూలం'' అనే పేరుతో బాణసంచా కాలుస్తున్నారని,దీనిపై పర్యవేక్షణకు ఒక తనిఖీ యంత్రాంగం లేదని అన్నారు. హరిత, పర్యావరణహిత బాణసంచా పేరుతో ఢిల్లీ-ఎన్‌సిఆర్‌లో భారీస్థాయిలో బాణసంచాను కాల్చారని నివేదికలు వచ్చాయని ఆమె చెప్పారు.

రామాలయ విరాళాల కేసులో

పెద్దమనుషుల పాత్రపై విచారించరా?

చంపత్ రాయ్, అనిల్ మిశ్రాలను నిందితులుగా కాకుండా సాక్షులుగా ఎందుకు పరిగణిస్తున్నారు? : కాంగ్రెస్

న్యూఢిల్లీ : రామ మందిర విరాళాల కేసులో నిందితులపై మూడోసారి కూడా అభియోగాలు నమోదు చేయలేకపోయినట్లు వార్తలు రావడంతో, గురువారం కాంగ్రెస్ పార్టీ బిజెపిపై విమర్శలు గుప్పించింది. చంపత్ రాయ్, అనిల్ మిశ్రా వంటి మాజీ ఆలయ ట్రస్ట్ అధికారులను నిందితులుగా కాకుండా సాక్షులుగా ఎందుకు పరిగణిస్తున్నారని, పెద్ద మనుషుల పాత్రపై ఎప్పుడు విచారణ జరుపుతారని ప్రశ్నించింది. మందిర నిర్మాణానికి 'ఫ్రుడూ క్రెడిట్ తీసుకోవడంలో ముందుండే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఇప్పుడు జవాబుదారీతనం నుండి ఎందుకు వెనకడుగు వేస్తున్నారని ప్రతిపక్షం ప్రశ్నించింది. 'రామ మందిరానికి సంబంధించిన పూర్తి వీడియో ఫుటేజ్, ఆడియో బయటకు వస్తే ఎవరి రహస్యాలు బయటపడతాయి అన్నదే ప్రశ్న. విరాళాల అక్రమాలకు సంబంధించిన దొంగతనం, పెద్ద మనుషుల ప్రమేయం వంటి కీలక రహస్యాలను ఈ పూర్తి ఫుటేజ్, ఆడియో బయటపెట్టవచ్చనే అనుమానం దేశ ప్రజల మదిలో ఉంది' అని కాంగ్రెస్‌ప్రధాన కార్యదరి జైరామ్ రమేశ్ ఎక్స్‌లో పోస్టు చేశారు. ఈ రికార్డింగ్‌లలో ఏం నమోదైందో, వాటిని అందుబాటులోకి తేవడంలో ఎందుకు జాప్యం జరుగుతోందో దేశం తెలుసుకోవాలనుకుంటోంది అని ఆయన అన్నారు. విరాళాల డబ్బును తరలించిన 105 ఘటనలు సిసిటివిలో నమోదయ్యాయని రమేశ్ గుర్తుచేశారు. '2020 ఆడిట్ నుండి హెచ్చరికలు జారీ అయ్యాయి, జూన్ 4న దొంగతనానికి సంబంధించిన వీడియో బయటపడింది, జూన్ 25న ఎఫ్ఐఆర్ నమోదైంది. ఈ రోజుకి కూడా, మొత్తం వ్యవస్థకు జవాబుదారీతనం నిర్ధారించలేదు. ఎందుకలా?' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అన్నారు.ఆర్ఎస్ఎస్-విహెచ్‌పి-బిజెపిలతో సంబంధం ఉన్న వ్యక్తులను కాపాడటంలో బిజెపి ప్రభుత్వాలు ఎందుకంత ఆసక్తి చూపుతున్నాయని ఆయన ప్రశ్నించారు. మొత్తం కేసుపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో స్వతంత్ర, నిష్పక్షపాత విచారణ జరపాలన్నది కాంగ్రెస్ డిమాండ్ అని ఆయన స్పష్టం చేశారు. 'ఆడిట్ హెచ్చరికలు, సిసిటివి ఫుటేజ్, ఆర్థిక లావాదేవీలు, ట్రస్ట్ అధికారుల పాత్రపై విచారణ జరపాలి. శ్రీరాముడి పేరుతో అందిన విరాళాల పూర్తి లెక్కలను దేశం ముందు ఉంచాలి' అని రమేష్ అన్నారు.

అర్నాబ్ నష్టం రూ.4,600 కోట్లు

- తుఫాను బాధిత ప్రాంతాల్లో సిఎం చంద్రబాబు ఏరియల్ సర్వే
- కృష్ణా, పశ్చిమ గోదావరి, కోనసీమ జిల్లాల్లో పర్యటన
- నీటమునిగిన పొలాలు, దెబ్బతిన్న కొబ్బరి చెట్ల పరిశీలన
- బాధిత రైతులతో నేరుగా మాట్లాడి ధైర్యం చెప్పిన ఆంధ్ర ప్రదేశ్ సిఎం



అమరావతి/ అమలాపురం: అర్నాబ్ తుఫాను కారణంగా ప్రాథమిక అంచనా ప్రకారం రూ.4,600 కోట్ల నష్టం వాటిల్లిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. పూర్తిస్థాయి అంచనాల అనంతరం ఈ నష్టం మరింత పెరిగే అవకాశముందన్నారు. తుఫాన్ వల్ల రాష్ట్రానికి జరిగిన నష్టంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో మాట్లాడి, ప్రభుత్వం చేపట్టిన సహాయక చర్యలను వివరించామని తెలిపారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి వాస్తవ పరిస్థితులను పరిశీలించేందుకు కేంద్ర బందాలను శుక్రవారం రాష్ట్రానికి పంపనున్నట్లు కేంద్ర హోంమంత్రి తెలిపారని సిఎం అన్నారు. తుఫాన్ వల్ల ప్రాథమికంగా జరిగిన నష్టానికి సంబంధించిన నివేదికను ఇప్పటికే కేంద్రానికి పంపినట్లు చెప్పారు. అర్నబ్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం పర్యటించారు. కోనసీమ జిల్లాలోని వేట్లపాలెంలో నీట మునిగిన పంట పొలాలను పరిశీలించి, బాధిత రైతులతో ముఖాముఖి మాట్లాడారు. అలాగే గచ్చకాయలపోర గ్రామంలో పునరావాస శిబిరాన్ని సందర్శించారు. అక్కడ వసతులు, ఏర్పాట్లను పరిశీలించారు. తుఫాన్ బాధితులతో ముఖ్యమంత్రి మాట్లాడారు. అనంతరం మీడియా సమావేశం నిర్వహించారు. వేట్లపాలెం గ్రామంలో నీట మునిగిన పొలాలను సందర్శించిన స్థానిక రైతులతో మాట్లాడారు. దిగుబడి తగ్గితే బీమా ద్వారా పరిహారం అందుతుందని, రైతులకు నష్టం జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. వ్యవసాయ, ఉద్యాన పంటలకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి వీలైనంత త్వరగా పరిహారం మొత్తాన్ని రైతుల ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించారు. తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న కొబ్బరి చెట్లను ముఖ్యమంత్రి పరిశీలించారు. తుఫాన్ కారణంగా కొబ్బరి చెట్లకు ఉన్న మువ్వ మొత్తం రాలిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లుతుందని కొబ్బరి రైతులు వివరించారు. కొబ్బరి చెట్టుకు రూ.1,500, ఆయిల్‌పామ్ చెట్టుకు రూ.1,500 చొప్పున పరిహారం అందిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు.

బాధితులకు భరోసా... సమస్యల పరిష్కారానికి ఆదేశాలు

వేట్లపాలెంలో రైతులతో మాట్లాడిన అనంతరం ముఖ్యమంత్రి గచ్చకాయలపోర గ్రామంలో తుఫాన్ బాధితుల కోసం ఏర్పాటు చేసిన పునరావాస శిబిరాన్ని పరిశీలించారు. బాధితులను పరామర్శించి వారికి అందుతున్న సహాయక చర్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక అధికారులు ముందస్తుగా అప్రమత్తం చేసి తమను సహాయక శిబిరాలకు తరలించారని బాధితులు తెలిపారు. తుఫాన్ కారణంగా తాము నివసిస్తున్న పాకలు కూలిపోయాయని కొందరు మహిళలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. పడిపోయిన పాకలను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న పేదలకు నిబంధనల ప్రకారం పట్టాలు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. బోట్లకు రిజిస్ట్రేషన్లు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మత్స్యకారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకురాగా, రిజిస్ట్రేషన్లకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సూచించారు. ప్రకృతి విపత్తుల సమయంలో ప్రభుత్వ యంత్రాంగం సమర్థంగా పనిచేసిందని ప్రశంసించిన ముఖ్యమంత్రి, అక్కడక్కడా ఉన్న సమస్యలను కూడా వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పునరావాస కేంద్రాల నుంచి ఇళ్లకు తిరిగి వెళ్లే బాధితులకు 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకుల ప్యాకెట్‌తో పాటు ఖర్చుల కోసం నగదు అందిస్తామని చెప్పారు.

నేలకూలిన విద్యుత్ స్థంభాలు

తుఫాన్ ప్రభావంతో కోనసీమ జిల్లాలోనే సుమారు 8 వేల విద్యుత్ స్తంభాలు కూలిపోయాయని ముఖ్యమంత్రి వెల్లడించారు. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు తెలంగాణ ప్రభుత్వంతో మాట్లాడి వెయ్యి మంది విద్యుత్ సిబ్బందిని పంపించాలని కోరినట్లు తెలిపారు. అవసరమైతే కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా సిబ్బందిని రప్పిస్తామని చెప్పారు. పడిపోయిన విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించి వీలైనంత త్వరగా సరఫరాను పునఃప్రారంభిస్తామని స్పష్టం చేశారు. టెలికమ్యూనికేషన్ వ్యవస్థను కూడా పునరుద్ధరిస్తున్నట్లు వివరించారు. తుఫాన్లు రావని, ప్రభుత్వం అతిగా జాగ్రత్తలు తీసుకుంటోందని కొందరు విమర్శలు చేస్తున్నారని ముఖ్యమంత్రి ప్రస్తావించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చేపడుతున్న సహాయక చర్యలపైనా రాజకీయంగా మాట్లాడేవారిని పట్టించుకోవాల్సిన అవసరం లేదని అధికారులకు స్పష్టం చేసినట్లు తెలిపారు. ప్రజల రక్షణ, సంక్షేమమే ప్రభుత్వానికి ముఖ్యమని పేర్కొన్నారు.తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం రేయింబవళ్లు పనిచేసిందని. ఇందుకోసం సుమారు 30 వేల మంది అధికారులను సమాయత్తం చేసి ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామని, ప్రాణ, ఆస్తి నష్టాన్ని సాధ్యమైనంత మేర తగ్గించడమే లక్ష్యంగా పనిచేశామని చెప్పారు.

ఓటు దోపిడీకి సమాధానం కావాలి


బెంగాల్ మాజీ సిఎం మమతా బెనర్జీ



కోల్‌కతా : ఎన్నికల అవకతవకలపై ప్రతి పక్షాలు ఐక్యంగా పోరాడాలని పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, టిఎంసి అధినేత్రి మమతా బెనర్జీ పిలుపునిచ్చారు. పశ్చిమ బెంగాల్, ఇతర రాష్ట్రాల్లో ఓటు దొంగతనం జరిగిందని ఆరోపిస్తూ, ఈ పోరాటంలో ప్రతిపక్ష పార్టీలతో చేతులు కలపాలని, నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో జరిగే ఇండియా కూటమి ర్యాలీకి హాజరు కావాలని విద్యార్థులు, యువత, మహిళలు, కార్మికులు, పౌర సమాజ సభ్యులకు ఆమె పిలుపునిచ్చారు. 'ఓటు దొంగతనానికి వ్యతిరేకంగా చేసే పోరాటం, ప్రతి భారతీయుడి ఓటు హక్కును కాపాడే పోరాటమే. బెంగాల్, ఇతర రాష్ట్రాల్లో జరుగుతున్న ఓటు దోపిడీకి సమాధానాలు కావాలి, మౌనం కాదు!' అని ఆమె ఒక సోషల్ మీడియా పోస్ట్‌లో పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియపై ఆందోళన వ్యక్తం చేస్తూ, ఇవిఎంలు పరిశీలనలో ఉన్నాయని, ఓటర్ల డేటా ప్రశ్నార్థకంగా ఉందని, ఓటర్ల జాబితాలు అనుమానాస్పదంగా ఉన్నాయని, ఓట్ల లెక్కింపు సవాలుకు గురవుతోందని బెనర్జీ ఆరోపించారు. ఓటుకు ముప్పు పొంచి ఉన్నప్పుడు, మౌనం వహించడం కుదరదు, మన ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడానికి, మన రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి మనమందరం ఏకమవుదాం అని ఆమె అన్నారు.

ఇజ్రాయెల్ ఎన్నికల్లో ఖతార్, టర్కీ జోక్యం

తక్షణ దర్యాప్తు
నెతన్యాహూ డిమాండ్



టెల్అవీవ్ : అరబ్ పార్టీ(జాయింట్ లిస్ట్)ల అండదండలతో ప్రభుత్వ ఏర్పాటును అడ్డుకుంటామని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూ ఉద్ఘాటించారు. ఇజ్రాయెల్ ఎన్నికల్లో విదేశీ జోక్యం జరిగిందని, ఈ విషయంపై దేశ అత్యున్నత భద్రతా సంస్థ వెంటనే దర్యాప్తు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఖతార్,టర్కీ ప్రభుత్వాలు ఈ ఎన్నికల్లో జోక్యం చేసుకున్నాయని నెతన్యాహూ, ఆయన మంత్రులు ఆరోపించారు. ఎన్నికల్లో విదేశీ నిధుల ప్రభావంపై నెతన్యాహూ తన విమర్శలు, ఆరోపణల దాడిని తీవ్రతరం చేశారు. ఈ విదేశీ జోక్యాన్ని ఆయన ఒక భూకంపంగా అభివర్ణించారు. విదేశీ సంస్థలు అరబ్ పార్టీలకు అనుకూలంగా ఓట్లు వేయాలని కోరుతూ ఓటర్లకు లంచాలు ఇచ్చాయని ఆరోపించారు. మితవాదులను అంతంచేసి,ఇజ్రాయెల్‌ను ఇస్లామీకరణ చేయడం కోసమే విదేశీయులు తమ దేశ పార్లమెంటును స్వాధీనం చేసుకోవడమే ఈ విదేశీజోక్యం లక్ష్యమని తీవ్ర ఆరోపణలు చేశారు. ఐతే ఎన్నికల్లో విస్తారంగా మోసాలు జరిగాయన్న ఆరోపణలను ఎన్నికల ప్యానల్ డైరెక్టర్ తిరస్కరించారు. ఎన్నికలు చట్టబద్ధంగా జరిగాయని చెప్పారు.
కానీ అరబ్ పార్టీలు దేశంలో ఎన్నికలను తమ చేతుల్లోకి లాక్కున్నాయని నెతన్యాహూ విమర్శించారు. దేశంలో జరిగిన ఎన్నికల్లో విదేశీ నిధులు పాత్ర పోషించాయని, దేశంలోకి అక్రమంగా విదేశీ నిధులు తరలివచ్చాయన్న అనుమానాలపై దర్యాప్తు చేయాలని షిన్‌బెట్ అధిపతి డేవిడ్ జినినీకి విజ్ఞప్తి చేయాలని సెంట్రల్ ఎలక్షన్ కమిటీ ప్రధానాధిపతి నోమ్‌సోల్‌బర్గ్ తీసుకున్న నిర్ణయాన్ని ఈ ఆరోపణల సందర్భంగా నెతన్యాహూ ఉదహరించారు. ఎన్నికలను అరబ్ పార్టీలు దొంగతనం చేశాయని ఆరోపించారు. ''రామ్ గేట్ వ్యవహారం ఒక భూకంపం, వారు ఎన్నికలను దొంగతనం చేశారు'' అని రామ్ (యునైటెడ్ అరబ్ లిస్ట్), జాయింట్ లిస్ట్ కూటమిని లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియా వేదికగా విమర్శలు చేశారు. ఈ పరిస్థితులమధ్య షిన్‌బెట్ అధినేత డేవిడ్ జీనీ బుధవారం రాత్రి నెతన్యాహూను కలిసి ఆయనతో చర్చలు జరిపారు. గురువారం ఉదయం ఆయన గాడి ఐసెన్‌కోట్‌తో కూడా సమావేశం జరిపారు.
మంగళవారంనాడు పోలింగ్ తర్వాత ఇప్పటివరకూ 90 శాతం బ్యాలెట్ బాక్సుల లెక్కింపు పూర్తి చేశారు. ఈ కౌంటింగ్‌లో లికుడ్ పార్టీ సారథ్యంలోని నెతన్యాహూ కూటమి 53 స్థానాలు గెలుచుకోగా,ప్రతిపక్ష గాడి ఐసెన్‌కోట్ నాయకత్వంలోని కూటమి 48 సీట్లు సంపాదించుకుంది. ఇక అరబ్‌పార్టీలు 19 స్థానాలతో బలమైన నిర్ణయాత్మకమైన శక్తిగా మారాయి. జాయింట్ లిస్ట్ అనేది ఇజ్రాయెల్‌లో అరబ్ మెజార్టీ పార్టీట కూటమి.2015లో ఈ కూటమి ఆవిర్భవించిది.సెక్యులర్,నేషనలిస్ట్,హదాష్ వంటి వామపక్ష అనుకూల పార్టీలు కూడా ఒఇందులో చేతులు కలిపాయి.పౌర సమానత్వంకోసం ఇజ్రాయెల్‌లో ఈ జాయింట్ లిస్ట్ ప్రచారం చేస్తోంది.ప్రస్తుతం నెతన్యాహూను తిరిగి అధికారంలోకి రానివ్వకూడదని జాయింట్‌లిస్ట్ కంకణం కట్టుకుంది.ఇతర ప్రతిపక్షాలు తమతో చేతులు కలపాలని కోరుతున్నది.ఈ అరబ్ పార్టీలలో మన్సూర్ అబ్బాస్(52)ఒక డెంటిస్ట్.అరబ్–ఇజ్రాయెలీ రాజకీయ నాయకుడు.''రామ్స్'పార్టీ నాయకుడు.2019లో ఆయన పార్లమెంటుకు ఎన్నికయ్యారు.ఇజ్రాయెల్‌లో అరబ్ రాజకీయాలకు ఒక మౌలిక స్వరూపాన్ని తీసుకువచ్చారు.వాస్తవానికి గడచిన రెండు దశాబ్దాలుగా ఇజ్రాయెల్‌లో ఉన్న పాలస్తీనియన్లు అని చెప్పుకునే అరబ్ ప్రజలు ఎన్నికలపై ఎలాంటి ఆసక్తి చూపించడంలేదు.కానీ వారికి గడచిన మూడు సంవత్సరాలుగా తీవ్ర అభద్రత ఏర్పడింది. వారంతా ఐక్యమయ్యారు. ఇది జాయింట్ లిస్ట్‌కు ఉపకరించింది.ఇజ్రాయెల్ పార్లమెంటు తీరుతెన్నులలో గణనీయ మార్పులు తీసుకురావడానికి దోహదపడుతుంది. ఐతే అరబ్ ఓటర్లలో చాలామంది ఇతర పార్టీలను కూడా సమర్థిస్తున్నారు. సైద్ధాంతిక భావజాలం రీత్యా పదిశాతం అరబ్ ఓటర్లు ఎన్నికలపట్ల తిరస్కారభావంతో ఉండేవారు.

బ్రెజిల్‌కు నిజమైన అధ్యక్షుణ్ణి నేనే... పారిపోలేదు

మియామీ నుండి ఫ్లావియో
బోల్సెనారో సంచలన ప్రకటన
అడ్డదారిలో ట్రంప్ సహాయం
లులా ప్రభుత్వం ఆగ్రహం
అది రాజకీయ ప్రవాసం
లిబరల్‌పార్టీ ప్రకటన



వాషింగ్టన్ : బ్రెజిల్‌కు నిజమైన అధ్యక్షుడిని తానేనని ఫ్లావియో బోల్సెనారో (45)తనకు తాను ప్రకటించుకున్నారు. తాను దేశం వదలి పారిపోలేదని అధ్యక్ష ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయిన ఫ్లావియో చెప్పారు. భార్య, ఇద్దరు కుమార్తెలతో కుటుంబసమేతంగా ఆయన అమెరికాలోని మియామీకి ఎవరికీ చెప్పకుండా వెళ్ళిపోయారు. డోనాల్డ్ ట్రంప్ ఆయనకు వత్తాసు పలికి బ్రెజిల్ వదిలి అమెరికా వచ్చేందుకు సహకరించారు. ఆశ్రయం ఇచ్చి రెడ్ కార్పెట్ పరిచారు. అవినీతి ఆరోపణలలో కేసు దర్యాప్తులను తప్పించుకోవడంకోసమే పారిపోయారన్న వాస్తవాన్ని లులా ప్రభుత్వం గుర్తించింది. దొడ్డిదారిన ట్రంప్ ఆయనకు సహాయం చేశారని బ్రెజిల్ ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ విషయంపై సెనేట్‌లో బోల్సెనారో లిబరల్ పార్టీకి చెందిన నాయకుడు రోజిరియో మారిన్‌హో గురువారం పాత్రికేయులతో మాట్లాడుతూ, ఫ్లావియో బోల్సెనారో దేశం వదిలిపారిపోలేదని, ఆయన రాజకీయ ప్రవాసంలో ఉన్నారని వివరణ ఇచ్చారు.తమ నాయకుడికి తాము పూర్తి సంఘీభావం ప్రకటిస్తున్నట్లు చెప్పారు. ఐతే ఎన్నికల్లో అక్రమాలు జరిగాయన్న ఫ్లావియో బోల్సెనారో ఆరోపణలకు ఆయన దూరంగా ఉన్నారు. వాటిని సమర్థించలేదు. ఎన్నికల పోలింగ్‌లో అక్రమాలు జరిగాయన్న ఆధారాలు లేవని స్పష్టం చేశారు. నాయకుడని చెప్పుకోవడానికి ఆయనకు పూర్తి హక్కులు ఉన్నాయని, అది వాస్తవమని అన్నారు. ఎన్నికల్లో ఆయన ఓటమి తర్వాత, ఫ్లావియో బోల్సెనారోకు ఆశ్రయం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని ట్రంప్ స్వయంగా ప్రకటించారు.స్వదేశంలో ఫ్లావియో అవినీతి,మనీలాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్నప్పటికీ ఇంకా ఆయనపై కేసులు పూర్తిగా నమోదు చేయలేదు. అక్టోబరు 27వ తేదీ మధ్యాహ్నం నుండి ఫ్లావియో బోల్సెనారో ప్రపంచంతో సంబంధాలు తెంచుకున్నారు. ఆయన అర్జెంటీనాలో ఉన్నారని తాను విన్నానని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించగా,ఈక్వెడార్ దేశానికి పారిపోయారని తొలుత వార్తలు వెలువడ్డాయి.చివరకు ఆయన తన భార్య, ఇద్దరు కుమార్తెలతో కలిసి మియామీ విమానాశ్రయంలో దిగుతున్న దృశ్యాలు వీడియోల్లో నమోదయ్యాయి. మొదట అర్జెంటీనా వెళ్ళి అక్కడి నుండి ఈక్వెడార్ చేరుకున్నారు. అక్కడి నుండి అమెరికాలోని మియామీ గమ్యస్థానానికి చేరుకున్నారు. అవినీతికి పాల్పడ్డారని, లెక్కల్లో చూపించని ధనాన్ని అక్రమమార్గాల్లో తరలించారని రెండుకేసులపై విచారణ ప్రారంభం కావాల్సి ఉంది. పోలీసులు ఆయన పాస్‌పోర్టులు స్వాధీనం చేసుకునేలోపే ఫ్లావియో ప్రైవేటు జెట్‌లో పరారయ్యారు.
దేశం వదిలిపారిపోలేదని మియామీ నుండి ఫ్లావియో ప్రకటించడమేకాదు, తానే అధ్యక్షుడినన్నారు, పైగా దేశంలో ప్రతిపక్షాన్ని మియామి నుండే తాను నడిపిస్తానని విరుద్ధ ప్రకటనలు చేశారు. 2022లో ఫ్లావియో తండ్రి జైర్ బోల్సెనారో కూడా లులా దా సిల్వాపై పోటీచేసి ఓడిపోయారు. దేశంలో తిరుగుబాటుకు కుట్రచేసి దొరికిపోయారు. ఈ కేసులో ఆయన ప్రస్తుతం 27 సంవత్సరాలు జైలుశిక్ష(గృహనిర్బంధం) అనుభవిస్తున్నారు. ఈయనకు కూడా ట్రంప్ సంపూర్ణ మద్దతు ఇచ్చారు.

ఎన్నికల తర్వాత ఇరాన్‌పై సుదీర్ఘ సైనిక చర్య

హౌతీసహా ప్రాక్సీ గ్రూపులతో పోరాటం
ముందు జాగ్రత్తలతో సిద్ధంకండి :
మిత్ర దేశాలకు ట్రంప్ సందేశం
వివేకం ఉపయోగించాలని ఇరుదేశాలకు యుఎఇ హితవు

వాషింగ్టన్ : అమెరికాలో నవంబరు మూడో తేదీన మధ్యంతర ఎన్నికలు ముగిసిన తర్వాత ఇరాన్‌పై దాడి చేస్తామని,ఇరాన్ కూడా ప్రతీకార దాడులు చేసే అవకాశం ఉందని,అందుకు సిద్ధంగా ఉండాలని గల్ఫ్ అరబ్ మిత్రదేశాలను అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అప్రమత్తం చేశారు. ఇంధన సదుపాయాలు,ఇతర మౌలిక కేంద్రాలపై ఇరాన్ ప్రతీకార దాడులకు దిగుతుందనే విషయం దృష్టిలో ఉంచుకుని ముందు జాగ్రత్త చర్యలు పాటించాలని కోరారు. ఇరాన్ తరపున హౌతీ తిరుగుబాటు సైన్యాలు,ఇతర అనుబంధ ఉగ్రవాద సంస్థలు కూడా ఈసారి ప్రతీకార దాడులకు దిగుతాయని,అందువల్ల యుద్ధం ఎక్కువరోజులు కొనసాగే అవకాశం ఉండవచ్చునని మిత్రదేశాలకు తెలియజేశారు. ఈ కొత్త విడత సైనిక చర్య చాలా రోజులు కొనసాగే అవకాశం ఉందని బుధవారం సాయంత్రం వాల్‌స్ట్రీట్ జర్నల్ వార్త ప్రచురించింది. ఆ తర్వాత ఇద్దరు దౌత్యవేత్తలను ఉటంకిస్తూ గురువారం పిటిఐ వార్తాసంస్థ అదే విషయం పేర్కొంది. ఈ సున్నితమైన విషయంపై అధికారికంగా వ్యాఖ్యానించే హక్కు లేనందువల్ల ఆ దౌత్యవేత్తలు తమ పేర్లు వెల్లడించలేదు. ఇరాన్‌పై దాడులు చేయాలా?వద్దా? అనే విషయంపై ట్రంప్ తుది నిర్ణయం తీసుకోలేదని వారు చెప్పారు. ఐతే నవంబరు మూడో తేదీ ఎన్నికల తర్వాత దాడులు చేసే విషయాన్ని పరిశీలిస్తున్నామని ట్రంప్ పదే పదే ప్రకటనలు చేస్తున్నారు. ఈ పరిస్థితులమధ్య యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ విదేశీమంత్రిత్వశాఖ ఒక ప్రకటన చేస్తూ, ఫిబ్రవరినాటి ఉద్రిక్త పరిస్థితులు మరోసారి తలెత్తకుండా వివేకాన్ని ఉపయోగించి రాజకీయ పరిష్కారాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఇరు దేశాలకు హితవు చెప్పింది. గడచిన సెప్టెంబరునెల నుండి మధ్యప్రాచ్యంలో అమెరికా యుద్ధం చేయకపోయినప్పటికీ అక్కడి శాంతి భద్రతలు గణనీయంగా క్షీణించాయి. హౌతీ తిరుగుబాటుదారులు సౌదీ అరేబియాలో విధ్వంసం సృష్టిస్తూ ఉండటంతో పరోక్షంగా ఇరాన్–అమెరికా మధ్య యుద్ధం కొనసాగుతోంది. ఎన్నికల సందట్లో ట్రంప్ చిక్కుకుపోయినందువల్ల ఆయన యుద్ధంవైపు దృష్టి మళ్ళించలేకపోతున్నారని, నవంబరు మూడో తేదీ తర్వాత తక్షణ దాడులు మొదలవుతాయని గట్టిగా వార్తలు వెలువడుతున్నాయి.
ట్రంప్ యుద్ధ సన్నాహాలు చేస్తున్నారని పేర్కొంది. టెక్సాస్ నుండి అమెరికా ఒక పేట్రియాట్ రక్షణ దళాన్ని మధ్యప్రాచ్య ప్రాంతానికి తరలిస్తోంది,అదేవిధంగా ఈ ప్రాంతంలో ఇరాన్ దాడులకు గురయ్యే ప్రాంతాలను ఖాళీచేయించి సైన్యాన్ని ఇతర సురక్షిత ప్రాంతాలకు తరలిస్తోంది. ఐతే వార్తాపూర్వకమైన ఈ సైనిక సన్నాహాలపై వ్యాఖ్యానించేందుకు వైట్‌హౌస్ తిరస్కరించింది. కాకపోతే, ఇరాన్‌కు అణ్వాయుధాన్ని అందుబాటులో లేకుండా చేసేందుకు ట్రంప్ అన్ని రకాలుగా అన్ని వైపుల నుండీ చర్యలు తీసుకుంటున్నారని పేర్కొంది. ఐతే ఇరాన్‌తో తక్షణ యుద్ధం లేదా అమెరికా అనుకూల ఒప్పందం జరుగుతుందని నాలుగు రోజుల క్రితం కూడా ప్రకటించారు. ఇరాన్‌ను లొంగదీయడంకోసం గతంలో కూడా ట్రంప్ ఈ విధమైన జిత్తులు ప్రయోగించారు. దీంతో ఏది వాస్తవం?ఏది అవాస్తవం?అనే సందిగ్ధం ఏర్పడింది. ట్రంప్ ప్రకటనలకు చమురు మార్కెట్లు కూడా స్పందించలేదు.

ఏడు రోజుల ప్రణాళికపై మధ్యవర్తులతో ఇరాన్ మంతనాలు

ఉద్రిక్తతలు తగ్గించి, యుద్ధాన్ని ముగించేందుకు ఖతార్ మధ్యవర్తులు గడచిన ఆదివారం ఇరాన్‌కు ముసాయిదా ఒప్పందాన్ని సమర్పించారని,ఈ వారం చివరినాటికి ఇరాన్ తన ప్రతిస్పందన తెలియజేస్తుందని ఆ దేశ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ ఎక్స్‌వేదికగా బుధవారం స్పందించారు. రాయిటర్స్ వార్తా సంస్థ ఈ విషయం వెల్లడించింది.''దౌత్య చర్యలు విజయవంతం కావడానికి ఇరాన్ ఎల్లప్పుడూ అవకాశం ఇస్తూనే ఉంది''అని అరాఘ్చీ తన పోస్టింగ్‌లో పేర్కొన్నారు.

రెట్టింపు చేసుకోండి

(మొదటి పేజీ తరువాయి)

ఉంటుందని, వారి నుంచి నేర్చుకుని, సూచనలను అర్థం చేసుకుని ఆచరణలో పెడతామని సిఎం రేవంత్ రెడ్డి చెప్పారు. తెలంగాణలో పెట్టుబడులకు భద్రత కల్పించడంతోపాటు, అవి వృద్ధి చెందేందుకు అవసరమైన విధానపరమైన నిర్ణయాలు, ప్రభుత్వ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. పెట్టుబడిదారులు తమకు అవసరమైన సహకారం ఏమిటో స్పష్టంగా తెలియజేయాలని కోరారు. మంచి సూచనలను పరిశీలించి ప్రభుత్వ విధానాలుగా అమలు చేస్తామని చెప్పారు.

కేంద్రంతో సమన్వయంతో అభివృద్ధి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంబంధాలపై పెట్టుబడిదారులకు ఉన్న సందేహాలను ప్రస్తావిస్తూ, అభివృద్ధి విషయంలో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి మధ్య సమన్వయం అవసరమని సిఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ కూడా ఈ అంశంపై స్పష్టత ఇచ్చారని తెలిపారు. దేశంలో ఏడు హైస్పీడ్ రైలు కారిడార్లను ఏర్పాటు చేయాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయంలో భాగంగా హైదరాబాద్–చెన్నై, హైదరాబాద్–బెంగళూరు, హైదరాబాద్–పుణె మార్గాలు అనుసంధానం కానున్నాయని చెప్పారు. వరంగల్, ఆదిలాబాద్‌లో కొత్త విమానాశ్రయాల నిర్మాణం సహా పలు అభివృద్ధి కార్యక్రమాల ద్వారా తెలంగాణకు కేంద్రం సహకరిస్తోందన్నారు.

ప్రపంచ నగరాలతో పోటీ పడాలి

ప్రభుత్వ జోక్యం అవసరమైన చోట మాత్రమే ఉండాలని, వ్యాపారాల వృద్ధికి అడ్డంకులను తొలగించి అవకాశాలను విస్తరించడమే ప్రభుత్వ బాధ్యత అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ ఢిల్లీ, ముంబయి, చెన్నై, బెంగళూరు నగరాలతో మాత్రమే పోటీ పడకూడదని, న్యూయార్క్, లండన్, టోక్యో, సియోల్, దుబాయ్ వంటి ప్రపంచ నగరాలతో పోటీ పడే స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. తెలంగాణ అభివృద్ధికి పారిశ్రామికవేత్తలు తమ అత్యుత్తమ ఆలోచనలు, విధానపరమైన సూచనలు



అందించాలని కోరారు. రాష్ట్ర ప్రగతి ప్రస్థానంలో భాగస్వాములై, ప్రభుత్వం, పారిశ్రామిక రంగం కలిసి చరిత్ర సృష్టించాలని రేవంతః రెడ్డి పిలుపునిచ్చారు.

2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల లక్ష్యం

'తెలంగాణ రైజింగ్2047' రాష్ట్ర భవిష్యత్ ప్రణాళిక అని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఇది 'వికసిత్ భారత్2047' లక్ష్యానికి అనుగుణంగా రూపొందించామని చెప్పారు. 2047 నాటికి భారత్ 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదిగితే, అందులో తెలంగాణ వాటా 10 శాతంగా ఉండాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ప్రస్తుతం దేశ జిడిపిలో తెలంగాణ వాటా 5 శాతంగా ఉందన్నారు. 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని సిఎం వెల్లడించారు.

వికసిత్ భారత్ లక్ష్య సాధనకు అన్ని రాష్ట్రాలు కలిసి పనిచేయాలి : గోయల్

2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించేందుకు దేశంలోని అన్ని రాష్ట్రాలు, అన్నిరంగాలు సమష్టిగా కృషి చేయాలని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ పిలుపునిచ్చారు. తెలంగాణలో పెట్టుబడులు, పారిశ్రామిక అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం భాగస్వామిగా ఉంటుందని మంత్రి ప్రకటించారు. సిఎం రేవంత్ రెడ్డి 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్యాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచంలోనే ఐదు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటిగా నిలిచిందని, అంచనాలకు మించి వేగంగా ఆర్థిక వృద్ధిని సాధిస్తోందని పేర్కొన్నారు.అప్పట్లో వ్యాపారులు పెట్టుబడులకు భద్రత, విధాన నిర్ణయాల్లో స్థిరత్వాన్ని కోరుకున్నారని, నేటి పారిశ్రామికవేత్తల ఆకాంక్షలు కూడా అవేనని వివరించారు. అంతర్జాతీయంగా మధ్య ఆసియా సంక్షోభం వంటి సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ, సంప్రదాయ అంచనాలను అధిగమించి భారత్ ఎగుమతులను పెంచిందని పీయూష్ గోయల్ తెలిపారు. వికసిత్ భారత్ లక్ష్య సాధనలో అన్ని రాష్ట్రాలు తమ సామర్థ్యాలను ప్రదర్శించాలని ఆయన సూచించారు.

హైదరాబాద్‌కు అంతర్జాతీయ అవకాశాలు

గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు (జిసిసి), కృత్రిమ మేధ (ఎఐ), లైఫ్ సైన్సెస్ రంగాల్లో హైదరాబాద్ ముందంజలో ఉందని కేంద్ర మంత్రి గోయల్ పేర్కొన్నారు. తెలంగాణలోని తాండూరు కందులు, నిజామాబాద్ పసుపు వంటి ప్రత్యేక ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లలో అవకాశాలున్నాయని తెలిపారు. జిఐ ట్యాగ్ పొందిన తాండూరు కందులను ఆస్ట్రేలియాకు ఎగుమతి చేయడం ప్రశంసనీయమన్నారు. తెలంగాణలో ఫార్మా, బయోటెక్ రంగాలు బలంగా ఉన్నాయని, ఏరోస్పేస్, రక్షణ రంగాలు, క్వాంటం కంప్యూటింగ్‌పై మరింత దృష్టి సారించాలని మంత్రి సూచించారు. సులభతర వాణిజ్య విధానాలను మెరుగుపరచడం ద్వారా పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని మరింత బలోపేతం చేయాలని అన్నారు. తెలంగాణలో వచ్చే ప్రతి పెట్టుబడి, సృష్టించే ప్రతి ఉద్యోగం రాష్ట్ర అభివృద్ధితోపాటు వికసిత్ భారత్ లక్ష్య సాధనకు దోహదపడుతుందని మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు.

ఐఎస్ఎమ్ 2.0లో తెలంగాణను భాగస్వామ్యం చేయండి : మంత్రి శ్రీధర్ బాబు

సెమీకండక్టర్ మిషన్ (ఐఎస్ఎమ్) 2.0లో తెలంగాణను భాగస్వామ్యం చేయాలని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఫలితంగా ఫ్యాబ్ ఇండస్ట్రీ, చిప్ డిజైన్ విభాగాల్లోనూ తెలంగాణ అగ్రగామిగా ఎదిగేందుకు మరింత అనుకూల వాతావరణం ఏర్పడుతుందన్నారు. ఢిల్లీలో గురువారం నిర్వహించిన 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ – 2026' కర్టెన్ రైజర్ లో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర డిఫెన్స్ ఎగుమతులు గతంతో పోలిస్తే 103 శాతం పెరిగాయన్నారు. రాష్ట్రంలో డేటా సెంటర్ల సామర్థ్యాన్ని 2030 నాటికి 5 గిగావాట్లకు చేర్చేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. 2047 నాటికి దేశ జిడిపిలో తెలంగాణ వాటాను 10 శాతానికి చేర్చాలనే సంకల్పంతోనే గతేడాది 'తెలంగాణ రైజింగ్' విజన్‌కు శ్రీకారం చుట్టామన్నారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, టాలెంట్ పూల్, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో భాగంగా అమలు చేస్తున్న విధానాలు రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి ఊతమిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటు, పెట్టుబడులకున్న అనుకూలతలను వివరించి పారిశ్రామికవేత్తలను 'రైజింగ్ తెలంగాణ విజన్ లో భాగస్వామ్యం చేసేందుకే ఢిల్లీలో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ – 2026' కర్టెన్ రైజర్ ను ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న గ్లోబల్ సమ్మిట్ 2.0 లో పాల్గొనాలని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు పారిశ్రామికవేత్తలను కోరారు.

సిఇసిపై ప్రజా అభిశంసన

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిపక్షాల నిరసన కొనసాగుతోందని ఖర్గే అన్నారు. 'మేము దానికి వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్నాము, ఇకపైనా కొనసాగిస్తాము. అన్ని పార్టీలు మాకు మద్దతు ఇస్తున్నాయి. శుక్రవారం కూడా మాక్ పార్లమెంట్ ఉంది. నవంబర్ 1న మేము ఈ ర్యాలీ నిర్వహిస్తున్నాము, దీనికి దేశవ్యాప్తంగా ప్రజలు వస్తున్నారు. మేము పోరాడతాము. ప్రజాస్వామ్యంలో పోరాడకపోతే, ప్రజలు మేల్కొనరు' అని కాంగ్రెస్ అధ్యక్షుడు అన్నారు. కాగా, సమావేశానికి హాజరైన అనంతరం, సిఇసి 'బహిరంగ అభిశంసన' ప్రక్రియను ఎలా ముందుకు తీసుకెళ్లాలనే వివరాలపై చర్చించినట్లు కాంగ్రెస్ మీడియా, ప్రచార విభాగం అధిపతి పవన్ ఖేరా తెలిపారు. ఇండియా కూటమి నాయకులలో చాలా మంది హాజరయ్యారని, బహిరంగ అభిశంసనతో ఎలా ముందుకు సాగాలనే దానిపై అన్ని అంశాలను చర్చించామని అని ఆయన చెప్పారు. లోక్‌సభలో కాంగ్రెస్ ఉప నాయకుడు గౌరవ్ గోగోయ్ మాట్లాడుతూ, సర్, ఓట్ల దొంగతనానికి సంబంధించిన ప్రతి ముఖ్యమైన అంశంపై చర్చ జరగాలని తాము కోరుకుంటున్నామని, చర్చల ద్వారా ప్రజల బాధను, ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిని వెలుగులోకి తీసుకురావాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడటంలో మనమందరం ఐక్యంగా ఉన్నామని ప్రజలకు ప్రోత్సాహం అందించాలన్నారు. సిఇసి బహిరంగ అభిశంసనలో ప్రతి పార్టీ నుండి ఒక్కరే మాట్లాడతారని ఎస్‌పికి చెందిన హరేంద్ర మాలిక్ అన్నారు. పార్టీ నాయకుడే స్వయంగా మాట్లాడాలని లేదా ఆయన తరపున మాట్లాడటానికి ఎవరినైనా నామినేట్ చేయాలని నిర్ణయించామన్నారు. బ్రిట్టాస్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియపై ప్రజల ఆందోళనలను ఇది ప్రతిబింబిస్తుందని, అందువల్ల ఈ విచారణను ఒక బూటకపు ప్రక్రియలా కాకుండా 'ప్రజా అభిశంసన'గా నిర్వహించాలని కూటమి నిర్ణయించిందన్నారు. మీరా కుమార్ అధ్యక్షతన ఒక క్రమబద్ధమైన చర్చ తర్వాత ఈ కార్యక్రమం జరుగుతుందని బ్రిట్టాస్ తెలిపారు. పౌర సమాజ సభ్యులు కూడా హాజరవుతారని, అలాగే సర్ వల్ల ప్రభావితమైన ప్రజలను వారి అనుభవాలను పంచుకోవడానికి ఆహ్వానిస్తారని ఆయన చెప్పారు.

పక్కదారి పట్టనీయొద్దు

(మొదటి పేజీ తరువాయి)

డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి రైతులకు అందుతున్న ప్రయోజనాలపై సమగ్ర నివేదికలు రూపొందించాలని, సుమారు 1,300 ఎకరాల ఖాళీ భూమిని అవసరాలకు అనుగుణంగా వినియోగించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. ప్రతి నియోజకవర్గంలో కమ్యూనిటీ హాళ్లు, శ్మశాన వాటికలు వంటి మౌలిక సదుపాయాల అవసరాలను గుర్తించాలని, గిరిజన ప్రాంతాల్లో మొబైల్ వైద్య యూనిట్ల ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించే అవకాశాలను పరిశీలించాలని ఆదేశించారు.

ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లకుండా పటిష్ట చర్యలు : ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులను గత ప్రభుత్వాల మాదిరిగా ఇతర అవసరాలకు మళ్లించే పరిస్థితి ఇకపై ఉండకూడదని అధికారులు, సంబంధిత శాఖలకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి అభివృద్ధికి కేటాయించిన నిధులను లక్షిత వర్గాల సంక్షేమం, అభివృద్ధికే వినియోగించాలనే స్పష్టమైన విధానంతో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.సబ్‌ప్లాన్ కింద కేటాయించిన ప్రతి రూపాయి ఎస్‌సి, ఎస్‌టి వర్గాల అభ్యున్నతికి ఉపయోగపడేలా శాఖల వారీగా వ్యయం, లబ్ధిదారుల వివరాలు, భౌతిక పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి సూచించారు. నిధుల వినియోగంలో జాప్యం చోటు చేసుకోకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు.ఈ సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు నవీన్ మిట్టల్, సందీప్‌కుమార్ సుల్తానియా, సురేంద్రమోహన్, సిక్తా పట్నాయక్, క్రిస్టినా, విజయేంద్రబోయి, గోపి, గుగులోతు రవి నాయక్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సుప్రీం కోర్టుకు ఎఐటియుసి

(మొదటి పేజీ తరువాయి)

వస్తుందని పేర్కొంది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్య కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఎదుట ఎఐటియుసి తరఫున సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్, న్యాయవాది ఆర్తి రాజన్ హాజరై వాదనలు వినిపించారు. కోడ్‌లో పరిశ్రమకు ఉన్న మినహాయింపుల గురించి ప్రస్తావిస్తూ, ఆ వివరాలను కోర్టుకు సమర్పించారు. ధార్మిక, సామాజిక లేదా పరోపకార సేవలో పూర్తిగా లేదా గణనీయంగా నిమగ్నమైన సంస్థల మొదలు 'సంబంధిత ప్రభుత్వానికి సంబంధించిన ఏదైనా సార్వభౌమ (అధికారిక) విధుల నిర్వహణ పని వరకు లేదా 'కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసే ఏదైనా ఇతర పని' వరకు 'పరిశ్రమ' నిర్వచనం నుంచి మినహాయింపు ఇచ్చినట్లు తెలిపారు. ''పరిశ్రమ' అనే నిర్వచనంలో ఏమైనా సమస్య ఉందా?' అని ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి సూర్య కాంత్ అడిగారు. కోడ్‌లోని నిర్వచనం 'ట్రిపుల్ టెస్ట్' అవసరాలను తీర్చలేదని సీనియర్ న్యాయవాది శంకర్‌నారాయన్ తెలిపారు. బెంగళూరు వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డ్ వర్సెస్ ఎ. రాజప్ప కేసుకు సంబంధించి 1978లో ఏడుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం తరపున జస్టిస్ వి.ఆర్. కృష్ణ అయ్యర్ రాసిన తీర్పును వెలువరించింది. ఇందులో క్రమబద్ధంగా లేదా వ్యవస్థీకృతంగా ఉండే, యజమాని–ఉద్యోగి సహకారం ఆధారంగా నిర్వహించే ఏ పనికైనా పరిశ్రమ అవుతుందనే షరతులను నిర్దేశించింది.
మానవ అవసరాలను తీర్చడానికి వస్తువులు, సేవలను ఉత్పత్తి చేసే కార్యకలాపాలు 'పరిశ్రమ' పరిధిలోకి వచ్చాయి. ఈ తీర్పు ఆసుపత్రులు, విద్యా సంస్థలు, పురపాలక సంఘాలను కూడా పరిశ్రమ పరిధిలోకి తీసుకువచ్చింది.
2026 ఆగస్టులో ప్రధాన న్యాయమూర్తి కాంత్ నేతృత్వంలోని తొమ్మిది మంది న్యాయమూర్తుల ధర్మాసనం 1947 పారిశ్రామిక వివాదాల చట్టంలోని సెక్షన్ 2(జె) కింద 'పరిశ్రమ' నిర్వచనానికి సంబంధించి 1978లో జస్టిస్ అయ్యర్ ఇచ్చిన వ్యాఖ్యానాన్ని పునఃపరిశీలించింది. అయితే, ఈ తొమ్మిది మంది న్యాయమూర్తుల ధర్మాసనం సమీక్షకు ముందే 2020 కోడ్ అమల్లోకి రావడంతో ఆ అవసరం లేకుండా పోయింది. పారిశ్రామిక వివాదాల చట్టంలోని 2(జె) వ్యాఖ్యానం కారణంగా ఐఆర్‌సిలోని సెక్షన్ 2(పి)లో 'పరిశ్రమ' భవిష్యత్తుకు ఇబ్బందిగా మారబోదు,' అని ప్రధాన న్యాయమూర్తి కాంత్ వ్యాఖ్యానించారు.

నష్టపరిహారం చెల్లించాలి

(మొదటి పేజీ తరువాయి)

నష్టపరిహారం అందించడానికి పరిశీలిస్తున్న చర్యలను తెలియజేయాలని ధర్మాసనం ఆర్‌బిఐని కోరింది. మోసపోతున్న వినియోగదారుల అసాధారణ లావాదేవీల గురించి సమీపంలోని పోలీస్ స్టేషన్లను అప్రమత్తం చేయడం బ్యాంకుల విధి అని తెలిపింది. ఖాతాదారుని నిర్దరిత లావాదేవీల సరళికి భిన్నంగా ఉండే అసాధారణ లావాదేవీలను తాత్కాలికంగా నిలిపివేయడం, అనుమానాస్పద కార్యకలాపాలపై ఆటోమేటెడ్ రిపోర్టింగ్, లావాదేవీల ప్రామాణికతను నిర్ధరించడానికి భౌతిక ధ్రువీకరణ వంటి తప్పనిసరి నివారణ చర్యల అవసరాన్ని గుర్తు చేసింది. విచారణ సందర్భంగా కేంద్రం, ఇతర అధికారుల తరపున హాజరైన అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి, గత ఏడాదితో పోలిస్తే నమోదైన డిజిటల్ అరెస్టు కేసులు సుమారు 50 శాతం తగ్గాయని కోర్టుకు తెలిపారు. కోర్టు జోక్యం, ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, విభాగాల సమన్వయ చర్యలు, ప్రజా అవగాహన ప్రచారాల వల్లే ఈ తగ్గుదల సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు.

విద్యావంతులు డిజిటల్ మోసాలకు ఎలా బలి అవుతున్నారు

మరోవైపు విద్యావంతులైన పౌరులు కూడా ఇలాంటి డిజిటల్ మోసాలకు ఎలా బలి అవుతున్నారంటూ సుప్రీం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రజా చైతన్య కార్యక్రమాలు, వార్తా కథనాలు, కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ ప్రజలు ఇంకా మోసపోతుండటం పట్ల భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 'మేము ఆశ్చర్యపోతున్న విషయం ఏమిటంటే ప్రజలకు ఇంకా ఎందుకు అర్థం కావడం లేదు? బాధితులకు ఏమైంది? ఈ బాధితులు ఇలా ఎలా చిక్కుల్లో పడుతున్నారు? వారికి ఈ ప్రాథమిక విషయం అర్థం కావడం లేదా? మొబైల్‌లో అరెస్టు అవుతామనే భయం ఏమిటి? మీడియాలో దీని గురించి అంతగా ప్రచారం జరుగుతోంది కదా! ఒక ప్రజాస్వామ్య దేశంలో ఉంటూ మొబైల్ ఫోన్ ద్వారానే అరెస్టు చేస్తున్నారని ఎవరైనా ఎలా నమ్మగలరా?' అని అసహనం వ్యక్తం చేశారు. డిజిటల్ అరెస్టులను అరికట్టడానికి చాలా చర్యలు తీసుకుంటున్నప్పటికీ, ఈ సమస్య నిరంతరాయంగా కొనసాగుతోందని తనకు పదేపదే సమాచారం అందుతోందని ఈ కేసులో అమికస్ క్యూరీగా ఉన్న సీనియర్ న్యాయవాది ఎన్.ఎస్. నాప్పినై కోర్టుకు చెప్పారు. గత వారం ఇలాంటి ఘటనతో ఒక మహిళ రూ. 2.5 కోట్లు కోల్పోయిందని ఆమె కోర్టుకు తెలిపారు. 'ఈ ప్రాథమిక విషయం వారికి అర్థం కావడం లేదా? మొబైల్ ద్వారా అరెస్టు అవుతామనే భయం ఏమిటి? మొబైల్‌ను గోడకు కొడితే అరెస్టు ఆగిపోతుంది. ప్రజలలో ఏదో లోపం ఉంది. అందులో ఏముందో దేవుడికే తెలియాలి. మిమ్మల్ని మీరే బాధితులుగా చేసుకుంటున్నారు. చదువుకున్న వారందరూ మోసపోతుండటం మాకు నిరాశ కలిగిస్తోంది. మీరే డిజిటల్ పద్ధతిలో అరెస్టు అయితే తర్వాతి తరానికి ఏమి అందిస్తారు? డిజిటల్ అరెస్ట్‌పై ఏమైనా ఉత్తర్వులు ఉన్నాయేమో తెలుసుకోవడానికి ప్రజలు కోర్టు వెబ్‌సైట్‌కు కూడా వెళ్లవచ్చు.' అని సిజెఐ జస్టిస్ సూర్య కాంత్ అన్నారు.

ఆ విషయంలో నాకు ఎలాంటి ఇబ్బంది లేదు

తిలక్ వర్మ



దో స్థానంలో బ్యాటింగ్ చేసే విషయంలో తనకు ఎలాంటి ఇబ్బంది లేదని టీమిండియా టి–20 వైస్ కెప్టెన్ తిలక్ వర్మ అన్నాడు. తొలి బంతికి భారీ షాట్ ఆడే అవకాశం ఉంటేనే కొడుతానని, లేకుంటే సింగిల్స్ తీసుకుంటానని చెప్పాడు. గతంలో మూడో స్థానంలో బ్యాటింగ్ చేసిన తిలక్ వర్మ.. ఇషాన్ కిషన్ రాకతో ఐదో స్థానంలో బ్యాటింగ్ చేస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం న్యూజిలాండ్ పర్యటనలో ఉన్న అతను మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. ఐదు టి–20ల సిరీస్‌లో టీమిండియా హ్యాట్రిక్ విజయాలతో మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే 3–0తో సిరీస్ కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. నాలుగో టి–20 వెల్లింగ్టన్ వేదికగా శుక్రవారం జరగనుంది. ఈ మ్యాచ్ నేపథ్యంలో గురువారం మీడియాతో మాట్లాడిన తిలక్ వర్మ.. సిరీస్ క్లీన్ స్వీప్ చేయడమే తమ ప్రధాన లక్ష్యమని చెప్పాడు.

అవకాశం ఉంటేనే ఆడుతా.. 'ఐదో స్థానంలో బ్యాటింగ్ చేయడంలో నాకు ఎలాంటి ఇబ్బంది లేదు. గతంలో మూడో స్థానంలో దూకుడుగా ఆడేవాడిని. ఇప్పుడు కూడా తొలి బంతికే భారీ షాట్ ఆడే అవకాశం ఉంటేనే ఆడుతాను. లేకుంటే సింగిల్స్, డబుల్స్, ఇన్నింగ్స్‌కు వీలైనంత వరకు ముందుకు తీసుకెళ్తాను. గ్యాప్ షాట్స్ ఆడి బౌండరీలు రాబడుతాను.'అని చెప్పాడు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌తో తనకు మంచి సమన్వయం ఉందని, మైదానంలో తన సలహాలను అతను స్వీకరిస్తాడని తిలక్ వర్మ చెప్పుకొచ్చాడు. 'కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌తో నాకు మంచి సమన్వయం ఉంది. కెప్టెన్ ఒక్కడే ప్రతీ విషయాన్ని గమనించలేడు. అందుకే ఇద్దరం తరుచూ మాట్లాడుకుంటాం. నేను ఏ విషయాల్లో సాయం చేయగలనో చర్చిస్తాను. అవసరమైనప్పుడు శ్రేయస్ కూడా నా సలహాలను తీసుకుంటాడు. మైదానంలో చిన్న చిన్న బాధ్యతలు పంచుకోవడం నాకు బాగా నచ్చింది 'అని తిలక్ వర్మ పేర్కొన్నాడు.

సాకులు చెప్పకూడదు.. న్యూజిలాండ్ పర్యటన నేపథ్యంలో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్.. జట్టుకు ఇచ్చిన సందేశాన్ని కూడా తిలక్‌వర్మ గుర్తు చేసుకున్నాడు. ఇది సుదీర్ఘ పర్యటన అని, టి–20 సిరీస్ ఫలితాలు వస్తేలు, టెస్ట్ సిరీస్‌లకూ ఊపునిస్తాయని గంభీర్ తమతో అన్నాడని తిలక్ తెలిపాడు. ప్రయాణాలు, వరుస మ్యాచ్‌లతో అలసట ఉన్నా.. అంతర్జాతీయ స్థాయిలో ఆడుతున్నప్పుడు సాకులు చెప్పకూడదని తిలక్ వర్మ అభిప్రాయపడ్డాడు.

డబ్ల్యుపిఎల్–2027 వేలం తర్వాత ఐదు జట్లు ఇవే



ఉమెన్స్ ప్రీమియర్ లీగ్(డబ్ల్యుపిఎల్)2027 సీజన్ మినీ వేలం ముగిసింది. బుధవారం కొచ్చి వేదికగా జరిగిన ఈ మినీ వేలంలో మొత్తం 146 మంది క్రికెటర్లను వేలం వేయగా.. ఐదు ఫ్రాంచైజీలు 25 మంది ఆటగాళ్లను కొనుగోలు చేశాయి. ఇందులో ఏడుగురు ఓవర్సీస్ ఆటగాళ్లు ఉండగా.. మరో 18 మంది భారత ప్లేయర్లు ఉన్నారు. 14 మంది అన్‌క్యాప్డ్ ప్లేయర్లను ఐదు ఫ్రాంచైజీలు కొనుగోలు చేశాయి. ఆస్ట్రేలియా కెప్టెన్ సోఫీ మోలినెక్స్ అత్యధిక ధర పలికింది. రూ.1.10 కోట్లకు యూపీ వారియర్స్ కొనుగోలు చేసింది. కర్ణాటకకు చెందిన 15 ఏళ్ల ఉమా కాశ్వీని ఢిల్లీ క్యాపిటల్స్ రూ.10 లక్షలకు కొనుగోలు చేసింది. డబ్ల్యూపీఎల్ చరిత్రలోనే వేలంలో అమ్ముడైన అత్యంత పిన్న వయస్కురాలిగా ఉమా కాశ్వీ నిలిచింది. డబ్ల్యూపీఎల్ 2027 సీజన్ జనవరి 14 నుంచి ఫిబ్రవరి 7 వరకు జరగనుంది.

మెగా వేలం తర్వాత ఐదు జట్ల పూర్తి వివరాలు..

ఢిల్లీ క్యాపిటల్స్

వేలంలో కొనుగోలు చేసిన ఆటగాళ్లు: కిరణ్ నవ్గిరే(రూ.75 లక్షలు), ఉమా కాశ్వీ(రూ.10 లక్షలు), కిర్టీ గోర్డన్(రూ.10 లక్షలు), నజ్మా ఖాన్(రూ.10 లక్షలు)

రిటైన్ లిస్ట్: జెమిమా రోడ్రిగ్స్, షఫాలీ వర్మ, అన్నాబెల్ సదర్లాండ్, మారిజేన్ కాప్, లారా వోల్వార్డ్, చినెల్లే హెన్రీ, లూసీ హామిల్టన్, మిన్ను మణి, నికి ప్రసాద్, శ్రీ చరణి, మమతా మడివాల, నందిని శర్మ, దియా యాదవ్

గుజరాత్ జెయింట్స్

వేలంలో కొనుగోలు చేసిన ఆటగాళ్లు: జీ కమలిని(రూ.40 లక్షలు), ఓర్లా ప్రెండర్‌గాస్ట్(రూ.30 లక్షలు), సమైరా రాఘవ(రూ.10 లక్షలు)

రిటైన్ లిస్ట్: బెత్ మూనీ, యాష్లీ గార్డనర్, సోఫీ డివైన్, జార్జియా వేర్హామ్, కిమ్ గార్త్, రాజేశ్వరి గయాక్వాడ్, రేణుకా సింగ్, కష్వీ గౌతమ్, తనూజా కన్వర్, యస్తికా భాటియా, అనుష్క శర్మ, భారతి ఫుల్మాలి, కనికా అహూజా, హ్యాపీ కుమారి, జింటిమణి కలిత

ముంబై ఇండియన్స్

వేలంలో కొనుగోలు చేసిన ఆటగాళ్లు: దిశా కసత్(రూ.10 లక్షలు), లతికా ఇనామ్దార్(రూ.10 లక్షలు), భార్తి రావల్(రూ.10 లక్షలు), సనికా చల్కే(రూ.10 లక్షలు), శ్వేత సెహ్రావత్(రూ.20 లక్షలు), అక్షిత భగత్(రూ.10 లక్షలు)

రిటైన్ లిస్ట్: హర్మన్‌ప్రీత్ కౌర్, నాటాలీ సైవర్ బ్రంట్, అమేలియా కేర్, హేలీ మాథ్యూస్, నికోలా కేరీ, షబ్నిమ్ ఇస్మాయిల్, అమన్జోత్ కౌర్, సజీవన్ సజనా, సంస్కృతి గుప్తా, రహీలా ఫిర్దోస్, వైష్ణవి శర్మ

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ)

వేలంలో కొనుగోలు చేసిన ఆటగాళ్లు: జెస్ జొనాసెన్(రూ. 40 లక్షలు), క్లో ట్రయాన్(రూ.30 లక్షలు), తేజల్ హసబ్నిస్(రూ.30 లక్షలు), ప్రిందా దినేష్(రూ.10 లక్షలు).

రిటైన్ లిస్ట్: స్మృతి మంధాన, రిచా ఘోష్, ఎల్లీస్ పెర్రీ, జార్జియా వోల్, లారెన్ బెల్, నాడిన్ డి క్లర్క్, శ్రేయాంక పాటిల్, పూజా వస్త్రాకర్, రాధా యాదవ్, అరుంధతి రెడ్డి, సయాలీ సత్ఘరే, ప్రేమా రావత్, ప్రత్యూష కుమార్

5. యుపి వారియర్స్

వేలంలో కొనుగోలు చేసిన ఆటగాళ్లు: సోఫీ మోలినెక్స్(రూ.1.10 కోట్లు), స్నేహ్ రాణా(రూ.30 లక్షలు), గ్రేస్ హ్యారీస్(రూ.30 లక్షలు), సుష్మా వర్మ(రూ.10 లక్షలు), కాత్రిన్ బ్రైస్(రూ.10 లక్షలు), మనాలి దక్షిణి(రూ.10 లక్షలు), సహనా పవార్(రూ.10 లక్షలు), ఆశా శోభనా(రూ.30 లక్షలు).

రిటైన్ లిస్ట్: దీప్తి శర్మ, సోఫీ ఎక్లెస్టోన్, మెగ్ లానింగ్, ఫోబ్ లిచ్ఫీల్డ్, తారా నోరిస్, హర్లీన్ డియోల్, శిఖా పాండే, ప్రతికా రావల్, క్రాంతి గౌడ్, సిమ్రాన్ షేక్, షిప్రా గిరి.

పోటీ కోసం జీకె

(యుపిఎస్‌సి, గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)



ఆధునిక భారత దేశం
భారత విధానం
భారత భౌగోళిక అంశాలు

ఆధునిక భారత దేశం

- శాశ్వత భూశిస్తు విధానాన్ని ప్రవేశపెట్టిన గవర్నర్ జనరల్ ఎవరు?
  లార్డ్ కార్న్‌వాలిస్.
- 1857 తిరుగుబాటు ఎక్కడ ప్రారంభమైంది?
  మీరట్.
- 1857 తిరుగుబాటులో ఢిల్లీకి నాయకత్వం వహించినవారు ఎవరు?
  బహదూర్ షా జఫర్.
- భారత జాతీయ కాంగ్రెస్ ఎప్పుడు స్థాపించబడింది?
  సమాధానం: 1885.
- భారత జాతీయ కాంగ్రెస్ తొలి అధ్యక్షుడు ఎవరు?
  డబ్ల్యూ. సి. బెనర్జీ.
- బెంగాల్ విభజన ఎప్పుడు జరిగింది?
  1905.
- స్వదేశీ ఉద్యమం ప్రధానంగా ఏ సంఘటనకు వ్యతిరేకంగా ప్రారంభమైంది?
  బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా.
- మహాత్మా గాంధీ భారతదేశానికి ఎప్పుడు తిరిగి వచ్చారు?
  1915.
- గాంధీజీ భారతదేశంలో చేపట్టిన తొలి సత్యాగ్రహం ఏది?
  చంపారన్ సత్యాగ్రహం.
- జలియన్వాలా బాగ్ మారణకాండ ఎప్పుడు జరిగింది?
  1919.
- అసహకార ఉద్యమాన్ని గాంధీజీ ఎప్పుడు ప్రారంభించారు?
  1920.
- దండి మార్చ్ ఏ ఉద్యమానికి సంబంధించినది?
  ఉప్పు సత్యాగ్రహం / సివిల్ డిస్‌ఓబీడియన్స్ ఉద్యమం.
- క్విట్ ఇండియా ఉద్యమం ఎప్పుడు ప్రారంభమైంది?
  1942.
- చేయండి లేదా చావండి అనే నినాదం ఏ ఉద్యమంతో సంబంధం కలిగి ఉంది?
  క్విట్ ఇండియా ఉద్యమం.
- భారతదేశానికి స్వాతంత్ర్యం ఎప్పుడు లభించింది?
  15 ఆగస్టు 1947.
- భారత రాజ్యాంగం ఎప్పుడు ఆమోదించబడింది?
  26 నవంబర్ 1949.

భారత విధానం

- భారత రాజ్యాంగం ఎప్పుడు అమల్లోకి వచ్చింది?
  26 జనవరి 1950.
- భారత రాజ్యాంగ పీఠిక ఏ పదాలతో ప్రారంభమవుతుంది?
  భారతదేశ ప్రజలమైన మేము... (We, the People of India).



- భారత రాజ్యాంగ నిర్మాతగా ఎవరిని పిలుస్తారు?
  డా. బిఆర్ అంబేద్కర్.
- రాజ్యాంగ పరిషత్ అధ్యక్షుడు ఎవరు?
  డా. రాజేంద్ర ప్రసాద్.
- రాజ్యాంగ ముసాయిదా కమిటీ అధ్యక్షుడు ఎవరు?
  డా. బిఆర్ అంబేద్కర్.
- భారతదేశంలో అత్యున్నత న్యాయస్థానం ఏది?
  సుప్రీంకోర్టు.
- భారత రాష్ట్రపతిని ఎవరు ఎన్నుకుంటారు?
  ఎలక్టోరల్ కాలేజ్.
- భారత పార్లమెంటులో ఎన్ని సభలు ఉన్నాయి?
  రెండు. ఒకటి లోక్‌సభ (దిగువ సభ), మరొకటి రాజ్యసభ (ఎగువ సభ)
- లోక్‌సభను సాధారణంగా ఏమని పిలుస్తారు?
  ప్రజల సభ.
- రాజ్యసభను సాధారణంగా ఏమని పిలుస్తారు?
  రాష్ట్రాల మండలి.
- రాజ్యసభ సభ్యుడి పదవీకాలం ఎంత?
  ఆరు సంవత్సరాలు.
- లోక్‌సభ సాధారణ పదవీకాలం ఎంత?
  ఐదు సంవత్సరాలు.
- భారత ప్రధానమంత్రిని ఎవరు నియమిస్తారు?
  రాష్ట్రపతి.
- భారతదేశంలో వాస్తవ కార్యనిర్వాహక అధికారం సాధారణంగా ఎవరి వద్ద ఉంటుంది?
  ప్రధానమంత్రి నేతృత్వంలోని మంత్రి మండలి వద్ద.
- భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు ఏ భాగంలో ఉన్నాయి?
  భాగం 3 (III).
- ప్రాథమిక విధులను ఏ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చారు?
  42వ రాజ్యాంగ సవరణ.
- రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు ఏ భాగంలో ఉన్నాయి?
  భాగం 4 (IV).
- భారతదేశంలో ఓటు వేసే కనీస వయస్సు ఎంత?
  18 సంవత్సరాలు.
- భారత ఎన్నికల సంఘం ఏ రకమైన సంస్థ?
  రాజ్యాంగబద్ధ సంస్థ.
- భారతదేశంలో అత్యున్నత న్యాయవ్యవస్థకు అధిపతి ఎవరు?
  భారత ప్రధాన న్యాయమూర్తి.

భారత భౌగోళిక అంశాలు

- భారతదేశంలో విస్తీర్ణం పరంగా అతిపెద్ద రాష్ట్రం ఏది?
  రాజస్థాన్.
- విస్తీర్ణం పరంగా భారతదేశంలో అతి చిన్న రాష్ట్రం ఏది?
  గోవా.
- భారతదేశంలో అత్యధిక పొడవైన నది ఏది?
  గంగా.
- గంగా నది చివరకు ఏ సముద్రం/ఉపసాగరంలో కలుస్తుంది?
  బంగాళాఖాతం.

సాధించుకున్న హక్కుల కోసం నిరంతరం ఉద్యమాలు

ఎఐటియుసి యాదాద్రి జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ




ప్రజాపక్షం/భువనగిరిరూరల్ :పోరాడి సాధించుకున్న కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటాలు చేయాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు బోలగాని సత్యనారాయణ అన్నారు. ఈనెల 31న నిర్వహించనున్న ఎఐటియుసి 107వ ఆవిర్భావ దినోత్సవాన్ని కార్మికులు, నాయకులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. గురువారం జిల్లాకేంద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సత్యనారాయణ మాట్లాడారు. ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు, కార్మిక సంక్షేమం కోసం పోరాటాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ అసంఘటితరంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సంఘటిత పోరాటాలే మార్గమని, జిల్లాలోని వివిధ రంగాల కార్మికులను ఏకతాటిపైకి తీసుకొచ్చి ఎఐటియుసిని మరింత బలోపేతం చేయాలని సూచించారు. సమావేశంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్, జిల్లా ఉపాధ్యక్షులు గనబోయిన వెంకటేష్, పల్లె శ్రీనివాస్, కోశాధికారి సామల శోభన్ బాబు, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎల్లంకి మహేష్, పాపగల్ల శంకరయ్య కనగళ్ల శ్రీను, పిన్నం జగన్, గొరిగే శంకరయ్య, ముదిగొండ బసవయ్య, నరసింహ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవ వేడుకల నిర్వహణ

ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు అజయ్‌సారథిరెడ్డి పిలుపు

ప్రజాపక్షం/మహబూబాబాద్ : మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా ఈనెల 31న ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు బి.అజయ్ సారథిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రేషపల్లి నవీన్ కార్మికులకు పిలుపునిచ్చారు. గురువారం ఎఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఓమ బిక్షపతి అధ్యక్షతన జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశానికి వారు హాజరై మాట్లాడారు. మానుకోట జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున కార్మిక సంఘాలు ఎఐటియుసిలో చేరుతున్నారని, వారి హక్కుల కోసం అనునిత్యం ఉద్యమిస్తామని తెలిపారు. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలో వీధి వ్యాపారస్తుల కోసం తమ అడ్డాల పోకుండా ఎఐటియుసి పోరాటాలు నిర్వహించిందన్నారు. మానుకోట జిల్లాలో ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలని వారు పిలుపునిచ్చారు. సమావేశంలో వెలుగు శ్రావణ్, మంద శంకర్, వంకాయల పాటి జకరయ్య, తండా శ్రీనాథ్, చిర్రా లక్ష్మీ నరసమ్మ, సారిక శ్రీను, లక్ష్మీ నారాయణ, లక్ష్మణ్ కిరణ్, అబ్దుల్ రెహమాన్, కొత్త నిర్మల, పుచ్చకాయల మధుసూదన్, డొని కెని రవి, యాకూబ్ పాషా, శంకర్, కొమ్ము యాకయ్య, పాషా, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



అనుభవం లేని యాజమాన్యంతో కార్మిక సమస్యలు

పరిష్కారం కావడం లేదు



సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) అధ్యక్ష, కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, రాజ్‌కుమార్

ప్రజాపక్షం/పెద్దపల్లి : అనుభవం లేని యాజమాన్యం వల్ల కార్మికుల సమస్యలు పరిష్కారం కావడం లేదని, రాష్ట్ర ప్రభుత్వ జోక్యం వల్ల సింగరేణిలో కార్మికుల డిమాండ్లపై జరిగిన ఒప్పందాలు అమలు కావడం లేదని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధానకార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ ఆరోపించారు. గురువారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన ప్రెస్ మీట్‌లో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కోల్ బెల్ట్ ఎమ్మెల్యేలతో జరిగిన సమావేశంలో మెడికల్ బోర్డును ఏరియా హాస్పిటల్‌లో ఏర్పాటు చేయాలని నిర్ణయించి ఇంతవరకు ఏర్పాటు చేయలేదని ఆరోపించారు, తక్షణమే మెడికల్ బోర్డును ఏర్పాటు చేసి ఒప్పందాన్ని అమలు చేసి డిపెండెంట్ ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మారుపేర్లు, సొంత ఇంటి పథకాన్ని అమలు చేయాలని, ప్రభుత్వంతో సంబంధం లేకుండా యాజమాన్యం డిపెండెంట్లకు నియామక పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో 190/240 మస్టర్లు పూర్తి చేసిన జనరల్ అసిస్టెంట్ ట్రైనీలకు జనరల్ అసిస్టెంట్‌గా ఆఫీస్ ఆర్డర్లు ఇవ్వకుండా యాజమాన్యం నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు. వారికి జనరల్ అసిస్టెంట్ లెటర్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తమ జోక్యాన్ని సింగరేణిలో విరమించుకోవాలన్నారు. ఆర్ఎల్‌సి వద్ద ఒప్పందం చేసుకున్న డిమాండ్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 4న సింగరేణి వ్యాప్తంగా అన్ని జనరల్ మేనేజర్ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, ఉపాధ్యక్షులు బోగ సతీష్ బాబు, నాయకులు గండి ప్రసాద్, దొంత సాయన్న, ఎంఎ. గౌస్, దాసరి శ్రీనివాస్, అటికేటి రాజు, ఎవిఎస్ ప్రకాశ్, పడాల కనకరాజు, పర్లపెల్లి రామస్వామి, ఎర్రగొల్ల చేరాలు, బూడిద మల్లేష్, సిర్ర మైసయ్య, జనగామ జగదీశ్వర్, రాపోలు రాజేశ్వరరావు, మోరె సమ్మయ్య పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే ఆర్‌టిసి కార్మికులు


ఎర్రజెండాను ఆదరించారు

విజయోత్సవ ర్యాలీలో నేతలు...

ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ : ఆర్‌టిసి సంస్థలో పనిచేస్తున్న కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసమే గుర్తింపుసంఘం ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్‌ను ఆదరించాలని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ పేర్కొన్నారు. గురువారం మంచిర్యాలలో ఆర్‌టిసి గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్‌ను గెలిపించినందుకు విజయోత్సవ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. అనంతరం బస్టాండ్ వద్ద నిర్వహించిన బహిరంగసభలో వారు మాట్లాడుతూ ఆర్‌టిసిలో కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా ఉన్నటువంటి డ్యూటీలను సరిచేయాలని, కార్మిక, ఉద్యోగ భద్రత సాధించడం కోసం, రిటైర్డు కార్మికులకు రావాల్సిన బకాయిలు ఇప్పించడం కోసం, పని విధానం కోసం, కార్మిక హక్కుల రక్షణ కోసం యాజమాన్యంతో పాటు ప్రభుత్వంపై



ఎంప్లాయిస్ యూనియన్ పోరాటం చేస్తుందని వివరించారు. కార్మిక హక్కులను కాపాడేందుకు ఎంప్లాయిస్ యూనియన్ నిరంతరం కార్మిక పక్ష పాతిగా అండగా ఉందన్నారు. కార్యక్రమాలలో ఎఐటియుసి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వాసిరెడ్డి సీతారామయ్య, సిపిఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాను, నాయకులు కలీందర్ ఆలీఖాన్, వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య, జోగుల మల్లయ్య, రేగుంట చంద్రశేఖర్, గోలి శంకర్, మామిడిపల్లె శ్రీనివాస్, రాజేశంతో పాటు పెద్ద ఎత్తున ఆర్‌టిసి కార్మికులు పాల్గొన్నారు.




ఆటో, క్యాబ్ డ్రైవర్ల ఉపాధి దెబ్బతీస్తే తిరగబడతాం


'విదేశీ గ్రీన్ ఎస్ఎం క్యాబ్ సర్వీసులకు' అనుమతులు ఉపసంహరించుకోవాలి

ప్రభుత్వం దిగిరాకపోతే పోరాటాలు తీవ్రతరం చేస్తాం

ఎఐటియుసి నేత ఎండి ఒమర్ ఖాన్

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలో విదేశీ గ్రీన్ ఎస్ఎం క్యాబ్ సర్వీసులను అనుమతించి ఆటో, క్యాబ్ డ్రైవర్ల ఉపాధిని దెబ్బతీస్తే సహించేది లేదని, తిరగబడతామని ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు ఎండి ఒమర్ ఖాన్ హెచ్చరించారు. హైదరాబాద్ విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో గురువారం జరిగిన తెలంగాణ రాష్ట్ర ఆటో, క్యాబ్ డ్రైవర్ల సంఘాల జెఏసి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓలా, రాపిడో, ఉబర్ వంటి సంస్థల కార్యకలాపాలతో ఇప్పటికే ఆటో, క్యాబ్ డ్రైవర్ల ఉపాధి దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తోడు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో తమ ఆదాయం మరింత తగ్గిపోయిందన్నారు. నెలవారీ వాయిదాలు చెల్లించలేక, కుటుంబాలను పోషించలేక డ్రైవర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో విదేశీ క్యాబ్ సర్వీసులను అనుమతించడం తమ ఉపాధిని మరింత దెబ్బతీస్తుందన్నారు. ఆటో మోటార్ రవాణా రంగ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి పాలనలో ఆటో డ్రైవర్ల బతుకులు ఆగమ్యగోచరంగా మారాయని విమర్శించారు. గ్రీన్ ఎస్ఎం కార్యాలయ ప్రారంభోత్సవాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు. కనెక్టెడ్ క్యాబ్ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ గ్రీన్ ఎస్ఎం క్యాబ్ సర్వీసుల అనుమతులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వి.ప్రవీణ్ (టియుసిఐ) మాట్లాడుతూ విదేశీ క్యాబ్ సర్వీసుల వల్ల స్థానిక డ్రైవర్ల ఉపాధికి ముప్పు ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం డ్రైవర్ల ఉపాధిని దెబ్బతీయడం దారుణమన్నారు. శ్రీకాంత్ (సిఐటియు) మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు రవాణా సంక్షేమ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాంరెడ్డి (ఐఎఫ్‌టియు) మాట్లాడుతూ గ్రీన్ ఎస్ఎం క్యాబ్ సర్వీసులకు ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని, లేనిపక్షంలో పోరాటాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిహెచ్ జంగయ్య (ఎఐటియుసి), పరశురామ్ యాదవ్ (బి ఆర్‌టియు), మజీద్ (ఆటో యూనియన్), బి.వినయ్ భూషణ్ (అమ్మ క్యాబ్ అసోసియేషన్), సయ్యిద్ షా నవాజ్ పాషా తదితరులు పాల్గొన్నారు.





'రిమ్స్' కాంట్రాక్ట్ కార్మికులకు రూ.26వేలు వేతనం ఇవ్వాలి

ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిర్ర దేవేందర్

పలువురు కార్మికులు ఎఐటియుసిలో చేరిక

ప్రజాపక్షం/మావల: రిమ్స్, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులకు నెలకు రూ.26వేల కనీస వేతనం ఇవ్వాలని ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు సిర్ర దేవేందర్ డిమాండ్ ఏశారు. గురువారం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో నల్ల శివన్న ఆధ్వర్యంలో పలువురు కార్మికులు ఎఐటియుసిలో చేరగా, వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ విధులకు ఆలస్యమైతే వేధింపులు ఆపాలని కోరారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎండి.ఖాసీం, ఇర్ఫాన్ ఖాన్, సాయి కిరణ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.




సిపిఐకి రాంరెడ్డి సేవలు చిరస్మరణీయం

ప్రజాపక్షం/డిండి: సిపిఐ సీనియర్ నాయకులు కామ్రేడ్ నల్లవెల్లి రాంరెడ్డి సిపిఐకి చేసిన సేవలు చిరస్మరణీయం అని బుధవారం రాంరెడ్డి మరణించడం బాధాకరం అని సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంఎల్‌ఏ పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం రాంరెడ్డి స్వగ్రామం డిండి మండలంలోని కందుకూరు గ్రామంలో రాంరెడ్డి పార్థివదేహంపై ఎర్రజెండాను కప్పి పూల మాల వేసి విప్లవ జోహార్లు అర్పించారు. కామ్రేడ్ రాంరెడ్డి పార్టీలో క్రియాశీలకంగా పనిచేశారని, పార్టీ ఆందోళన కార్యక్రమాల్లో ముందుండే వాడని అన్నారు. రాంరెడ్డి కందుకూరు సిపిఐ గ్రామశాఖ కార్యదర్శిగా, పిఏసిఎస్ వైస్ చైర్మన్‌గా, నీటి సంఘం చైర్మన్‌గా, పార్టీ మండల కార్యవర్గ సభ్యులుగా, ప్రజానాట్యమండలిలో కళాకారునిగా అనేక బాధ్యతలు ఆయన నిర్వహించారని అన్నారు. రాంరెడ్డి మృతి బాధాకరం అని కడవరకు కమ్యూనిస్టుగా ఉండి నిబద్ధత కలిగిన నాయకునిగా ఆయన పార్టీకి సేవలు అందించారని అన్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, మాజీ ఎంఎల్‌ఏ యాదగిరిరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బుచ్చిరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మైనోద్దిన్, జిల్లా కౌన్సిల్ సభ్యులు వెంకటరమణ, సుదర్శన్‌రెడ్డి, విజేందర్‌రెడ్డి, శైలేష్, రంగారెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు నవీన్, మండల కార్యవర్గ సభ్యులు రవీందర్‌శర్మ, హుస్సేన్, శ్రీనయ్య, యాదయ్య, శాఖ కార్యదర్శి శ్రీను, జమిల్ తదితరులు ఉన్నారు.

గ్రామీణాభివృద్ధితోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి

రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి



ప్రజాపక్షం/పెన్‌పహాడ్ : గ్రామాల అభివృద్ధి ద్వారానే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మేఘ్యతండ గ్రామ పంచాయితీ పరిధిలో ట్రైబల్ ఫండ్ ద్వారా రూ.1కోటి 84లక్షల వ్యయంతో మేఘ్యతండ నుంచి గంగ్లీ తండ వరకు నిర్మించనున్న బిటి రోడ్డు నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాణ్యమైన రహదారుల నిర్మాణం ద్వారా ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణ సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే మేఘ్యతండ, గంగ్లీ తండ గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడడంతోపాటు ప్రయాణ సమయం తగ్గి విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, ఇతర ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం వంటి సౌకర్యాలు మరింత మెరుగుపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భూక్య రాజు నాయక్, వార్డు సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

వీరేశం సమక్షంలో కాంగ్రెస్‌లోకి చేరికలు



ప్రజాపక్షం/నకిరేకల్ : కట్టంగూర్ మండలం మల్లారం గ్రామానికి చెందిన వార్డు సభ్యులు దాసరి లింగయ్య,దాసరి కళమ్మతో పాటు మొత్తం 80 మంది వివిధ పార్టీల కార్యకర్తలు ప్రభుత్వ విప్ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సమక్షంలో గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు.వారికి ఆయన కాంగ్రెస్ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు,కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని తెలిపారు.ప్రజా సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లింగాల వెంకన్న, పన్నాల రాఘవరెడ్డి,పెద్ది యాదగిరి,గద్దపాటి దానయ్య తదితరులు పాల్గొన్నారు.

వేగవంతంగా పట్టభద్రుల ఓటరు నమోదు

అడిషనల్ సిఇఒ వెంకటేశ్వర్ రెడ్డి



ప్రజాపక్షం/నల్లగొండ: వరంగల్‌ఖమ్మంనల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర అడిషనల్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి ఆదేశించారు. గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లాల ఈఆర్‌ఓలు,ఆర్‌డిఓలతో ఆయన సమీక్ష నిర్వహించారు.ఫారం18 దరఖాస్తులను వెంటనే పరిశీలించి పరిష్కరించాలని, ఒరిజినల్ సర్టిఫికెట్లు, మెమోలు, ప్రొవిజనల్ సర్టిఫికెట్లను జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు. డూప్లికేట్ ఓట్లను గుర్తించి తిరస్కరించాలని,పోలింగ్ కేంద్రాలను ఓటర్లకు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేయాలన్నారు.పట్టభద్రుల ఓటరు నమోదులో నల్గొండ జిల్లా ముందుండటంపై కలెక్టర్,సిబ్బందిని ఆయన అభినందించారు. యాదాద్రి,సూర్యాపేట జిల్లాల్లోనూ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ మాట్లాడుతూ డీటీసీలో 20 కంప్యూటర్లతో రెండు షిఫ్టుల్లో దరఖాస్తుల పరిశీలన చేస్తున్నామని, ఎంజీ యూనివర్సిటీ విద్యార్థుల సహకారం తీసుకుంటున్నామని తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్,ట్రైనీ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి,దేవరకొండ సబ్ కలెక్టర్ కరోలిన్,ఈఆర్‌ఓలు,ఆర్‌డిఓలు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి నైపుణ్యాలపై శిక్షణ

ప్రజాపక్షం/మర్రిగూడ : మండలం లోని పీఎం శ్రీ ఆదర్శ పాఠశాల విద్యార్థులు గురువారం మాల్‌లోని ఓసూపర్ మార్కెట్‌ను సందర్శించారు.ప్రిన్సిపల్ వెంకటేశం,వృత్తి విద్య ఉపాధ్యాయులు వెంకట రమణ,సబిత మార్గదర్శకత్వంలో విద్యార్థులకు రిటైల్,బ్యూటీషియన్ కోర్సులపై వృత్తి నైపుణ్యాల శిక్షణ అందిస్తున్నారు.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు ఆచరణాత్మక పరిజ్ఞానం కలిగి భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ఉపాధ్యాయులు తెలిపారు.

సూర్యాపేట మార్కెట్ యార్డులో రైతుల ఆందోళన

కమీషన్‌దారుల తీరుపై ఆగ్రహం

రూ.3వేలకు ఆశ చూపి రూ.2వేలకు తగ్గింపు

సిండికేట్‌గా మారారంటూ రైతుల ఆరోపణ



ప్రజాపక్షం/సూర్యాపేట : సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. ధాన్యానికి మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ మార్కెట్ యార్డు ముందు ధర్నా చేపట్టారు. మంచి ధర వస్తుందని ఆశతో రైతులు పెద్దమొత్తంలో ధాన్యాన్ని సూర్యాపేట మార్కెట్‌కు వ్యయప్రయాసలకు ఓర్చి తీసుకువచ్చారు. ధాన్యానికి రూ.3వేలకు పైగా ధర ఇస్తామని చెప్పి మార్కెట్‌కు రప్పించిన కమీషన్‌దారులు, భారీగా ధాన్యం రావడంతో సిండికేట్‌గా మారి ధర తగ్గించారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొదట చెప్పిన ధరకు, ప్రస్తుతం ఇస్తున్న ధరకు మధ్య భారీ వ్యత్యాసం ఉండటంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని వాపోతున్నారు. రూ.1700 వరకు ధర తగ్గించి, ప్రస్తుతం రూ.2వేల నుండి రూ. 2300 మాత్రమే ఇస్తున్నారని ఆరోపిస్తున్నారు.

సిండికేట్‌గా మారారంటూ రైతుల ఆరోపణ...

సూర్యాపేట మార్కెట్‌కు ధాన్యం రాక పెరగడంతో కమీషన్‌దారులు సిండికేట్‌గా మారి ధరను తగ్గించారని రైతులు మండిపడుతున్నారు. మార్కెట్‌లో పోటీ లేకుండా ధరను నిర్ణయిస్తున్నారని, తమకు గిట్టుబాటు ధర దక్కడం లేదని ఆవేదన చెందుతున్నారు. క్వింటాలుకు సుమారు రూ.1400 వరకు ధర తగ్గించారనే ఆరోపణలతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మూడు రోజులుగా నిలిచిన కాంటాలు...

తుఫాన్, కాంటాలు ఆలస్యం కారణంగా మూడు రోజులుగా ధాన్యం కాంటాలు నిలిచిపోయాయి. ఇప్పటికే మార్కెట్‌కు ధాన్యం తీసుకొచ్చి రోజులు గడుస్తున్నా కొనుగోళ్లు జరగకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యం మార్కెట్‌లోనే ఉండిపోవడంతో వర్షానికి తడిసి నష్టపోతామని ఆందోళన చెందుతున్నారు. ఒక వైపు కాంటాలు నిలిచిపోవడం, మరోవైపు ధర తగ్గించడంతో తమ పరిస్థితి దయనీయంగా మారిందని అంటున్నారు.



మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్...

ధాన్యానికి మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేస్తూ రైతులు ఆందోళన చేపట్టారు. ఇచ్చిన మాట ప్రకారం ధర చెల్లించాలని, సిండికేట్‌గా నిర్ణయించిన ధరను రద్దు చేసి తిరిగి కొనుగోళ్లను వేయాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించి ధాన్యం కొనుగోళ్లు వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. రైతుల ఆందోళన నేపథ్యంలో మార్కెట్‌కు భారీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం..

సమాజ అభివృద్ధికి సాహిత్యం దోహదం

నవ చేతన విజ్ఞాన సమితి మొబైల్ వ్యాన్ పుస్తక ప్రదర్శన,అమ్మకాలను సందర్శించిన ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : పుస్తక పఠనం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవడంతో పాటు సమాజంలోని వివిధ అంశాలపై అవగాహన పెంచుకోవచ్చని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు.నల్లగొండ జిల్లా కేంద్రంలో నవ చేతన విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొబైల్ వ్యాన్ పుస్తక ప్రదర్శన,అమ్మకాలను ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ వివిధ రకాల సాహిత్యానికి సంబంధించిన పుస్తకాలను ఒకే చోట ప్రదర్శించి,పాఠకులకు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు.పుస్తకాలు మనిషి ఆలోచనా విధానాన్ని మెరుగుపరచడంతో పాటు సమాజాన్ని అర్థం చేసుకునే దృక్పథాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. విజ్ఞానం, చరిత్ర, సామాజిక అంశాలు,అభ్యుదయ భావాలు, సాహిత్యం తదితర విభిన్న అంశాలకు సంబంధించిన పుస్తకాలను పాఠకులకు అందించేందుకు నవ చేతన విజ్ఞాన సమితి చేస్తున్న కృషి ప్రశంసనీయమని అన్నారు.ప్రస్తుత డిజిటల్ యుగంలో పుస్తక పఠనంపై ఆసక్తి తగ్గకుండా యువత, విద్యార్థుల్లో చదివే అలవాటును పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో నెలకొన్న పరిస్థితులను అర్థం చేసుకోవడానికి, ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి మంచి సాహిత్యం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. నవ చేతన విజ్ఞాన సమితి మొబైల్ వ్యాన్ ద్వారా పుస్తక ప్రియులకు,ప్రజలకు మరింత చేరువ చేసే ఇలాంటి కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. సిపిఐ పట్టణ కార్యదర్శి కె ఎస్ రెడ్డి, మొబైల్ వ్యాన్ ఇంచార్జి వి.శ్రీనివాసులు, సిబ్బంది ప్రభాకర్,నమ్ముల స్వామి ఉన్నారు.

బాలల స్నేహ పూర్వక జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యం

జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : సూర్యాపేట జిల్లాను బాలల స్నేహ పూర్వక జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం ముందడుగు వేస్తోందని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో పిల్లల హక్కుల పరిరక్షణ, వారి స్వేచ్ఛ, అభిరుచులు, ఆలోచనా విధానంపై అవగాహన కల్పించేందుకు యూనిసెఫ్‌తో జిల్లా యంత్రాంగం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా గ్రామ పంచాయితీ కార్యదర్శులు, మున్సిపల్ వార్డు అధికారులు, విద్యాశాఖ క్లస్టర్, గ్రామస్థాయి రిసోర్స్‌పర్సన్లు, అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. పిల్లల హక్కులు, మానసిక వికాసం, వారి ఆలోచనా సరళి, సమస్యలను గుర్తించడం, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి అధికారి పిల్లల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. బాలలు తమ హక్కులను, స్వేచ్ఛను పూర్తిస్థాయిలో అనుభవించేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పిల్లల్లోని నైపుణ్యాలు, అభిరుచులను గుర్తించి, వారు స్వచ్ఛందంగా తమ ప్రతిభను ప్రదర్శించేలా ప్రోత్సహించాలని ఆదేశించారు. ఈ శిక్షణ సూర్యాపేటను ఆదర్శ బాలల స్నేహపూర్వక జిల్లాగా తీర్చిదిద్దేందుకు దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యూనిసెఫ్ ప్రతినిధి ఫిలిప్స్, జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు, జిల్లా రెవెన్యూ అధికారి ప్రేమ్‌రాజ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటరమణ, ట్రైని డిప్యూటి కలెక్టర్లు రవితేజ, అనూష, జిల్లా బాలల పరిరక్షణ అధికారి బి. రవికుమార్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఉపేంద్ర, వివిధ ప్రాజెక్టుల సిడిపిఓలు, సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఎఐఎస్‌ఎఫ్ మాజీ నాయకుడు చిలుక విద్యాసాగర్‌రెడ్డి గుండెపోటుతో కన్నుమూత



ప్రజాపక్షం/నల్లగొండ: నల్లగొండ జిల్లాకు చెందిన ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకుడు,బత్తాయి రైతు సంఘం నాయకుడు చిలుక విద్యాసాగర్‌రెడ్డి గుండెపోటుతో గురువారం మృతి చెందారు. ఆయన మరణవార్తతో విద్యార్థి,రైతు సంఘాల వర్గాల్లో విషాదం నెలకొంది. సిపిఐ సీనియర్ నాయకుడు మల్లేపల్లి ఆదిరెడ్డికి ఆయన బావమరిది కావడంతో పార్టీ శ్రేణులు,సన్నిహితులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థి దశ నుంచే ప్రజా ఉద్యమాల పట్ల ఆసక్తి కలిగిన విద్యాసాగర్‌రెడ్డి ఎఐఎస్‌ఎఫ్‌లో చురుకైన పాత్ర పోషించారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం సాగిన ఉద్యమాల్లో క్రియాశీలకంగా పాల్గొన్నారు. విద్యార్థి సంఘం నాయకుడిగా పనిచేసిన కాలంలో ప్రజా సమస్యలపై పోరాట పటిమను ప్రదర్శించారని ఆయనతో కలిసి పనిచేసిన వారు గుర్తు చేసుకుంటున్నారు. ప్రస్తుతం బత్తాయి రైతు సంఘంలో పనిచేస్తూ రైతుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేశారు. బత్తాయి రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బంది లు, వారి హక్కులకు సంబంధించిన అంశాలపై పోరాటాల్లో భాగస్వామిగా నిలిచారు.రైతుల సంక్షేమం కోసం ఆయన చేసిన కృషి మరువలేనిదని,ఆయన మరణం బత్తాయి రైతు సంఘానికి తీరని లోటని పలువురు పేర్కొన్నారు విద్యార్థి ఉద్యమం నుంచి రైతు సంఘం వరకు ప్రజా సమస్యలపై పనిచేసిన ఆయన సేవలను స్మరించుకున్నారు.

అక్క,బావ రాక కోసం మెడికల్ కాలేజీలో పార్థివదేహం

చిలుక విద్యాసాగర్‌రెడ్డి అక్క గిరిజ లండన్‌లో నివసిస్తున్నందున,ఆమె స్వదేశానికి చేరుకున్న అనంతరం అంత్యక్రియలు నిర్వహించాలని కుటుంబ సభ్యులు నిర్ణయించినట్లు సమాచారం.ఈ నేపథ్యంలో ఆయన పార్థివదేహాన్ని నల్లగొండ మెడికల్ కాలేజీలో ఉంచినట్లు తెలిసింది. అక్క రాక అనంతరం నల్లగొండ పట్టణంలోని రామగిరిలో ఉన్న ఆయన స్వగృహం నుంచి అంతిమ యాత్ర నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విద్యాసాగర్‌రెడ్డి మృతి పట్ల బత్తాయి రైతు సంఘం నాయకులు, ఎఐఎస్‌ఎఫ్ మాజీ నాయకులు, సిపిఐ నాయకులు, అభిమానులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం సంతాపం

చిలుక విద్యాసాగర్‌రెడ్డి మృతి పట్లసిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి,ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.విద్యార్థి ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించి,అనంతరం బత్తాయి రైతుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేసిన విద్యాసాగర్‌రెడ్డి మరణం బాధాకరమని పేర్కొన్నారు.ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ,ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.



ఎస్‌సి,ఎస్‌టి వర్గాల సంక్షేమానికి చర్యలు

ప్రభుత్వ విప్,నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

ప్రజాపక్షం/నల్లగొండ: ఎస్‌సి,ఎస్‌టి వర్గాల సంక్షేమం,ఆర్థిక అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్,నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అధికారులను ఆదేశించారు.గురువారం నల్గొండ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్‌సి ప్రత్యేక అభివృద్ధి నిధుల (ఎస్‌సి ఎస్‌డీఎఫ్) వినియోగంపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శాఖ తమ పరిధిలో అమలవుతున్న పథకాలపై ఎస్సీ, ఎస్టీ ప్రజలకు అవగాహన కల్పించాలని, నిధుల వినియోగం కేవలం ఖర్చులకే పరిమితం కాకుండా వారి సామాజిక,ఆర్థిక అభివృద్ధికి దోహదపడాలన్నారు.ఎస్‌సి అభివృద్ధి నిధులపై ప్రతి నెలా సమీక్ష నిర్వహించాలని,రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ,ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఉచిత బస్సు,ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు.విద్య,వైద్య రంగాల్లో యంగ్ ఇండియా స్కూళ్ల ఏర్పాటుతో ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తున్నామన్నారు.ఎల్ నినో కారణంగా భూగర్భ జలాలు తగ్గుతున్నాయని,రైతులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్,అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి,జిల్లా సంక్షేమ శాఖ డీడీ శశికళ పాల్గొన్నారు.

మైనారిటీ మహిళల ఆర్థిక స్వావలంబనకు పెద్దపీట

దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్



ప్రజాపక్షం/దేవరకొండ: మైనార్టీ మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి, తమ కాళ్లపై తాము నిలబడాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. గురువారం పట్టణంలోని సాయిశివ ఫంక్షన్ హాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమశాఖ, తెలంగాణ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మైనార్టీ సోదరీమణులకు కుట్టు మిషన్ల పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయించిన ఇందిరమ్మ మహిళా శక్తిపథకం ద్వారా మరోసారి మైనార్టీ మహిళలకు కుట్టు మిషన్లు పంపిణి చేయడం సంతోషంగా ఉందని అన్నారు. ఈకార్యక్రమంలో సంబంధిత అధికారులు, రయిస్, ఆలంపల్లి నర్సింహా, వెంకటేష్‌గౌడ్, వేణుధర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, గిరి, నజీరోద్దిన్, అన్ని మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు, కౌన్సిలర్లు, ముస్లీం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణగిరి క్షేత్రంలో వైభవంగా శ్రీవారి సేవలు



ప్రజాపక్షం/యాదాద్రి భువనగిరి: స్వర్ణగిరి దివ్య క్షేత్రంలో గురువారం శ్రీ వేంకశ్వర స్వామివారికి వివిధ పూజా కార్యక్రమాలు, విశేష సేవలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఉదయాన్నే అర్చక స్వాములు ప్రాతఃకాల సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి, అనంతరం భక్తులకు గోపృష్ట దర్శనం కల్పించారు. శ్రద్ధాభక్తులతో బంగారు బావి నుండి సువర్ణ బిందె తీర్థాన్ని తీసుకువచ్చి, మేళతాళాల నడుమ స్వామివారికి తోమాల సేవ మరియు సహస్రనామార్చన నిర్వహించారు. లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ శ్రీ సుదర్శన నారసింహ హవనం ఘనంగా జరిగింది. గురువారాన్ని పురస్కరించుకుని స్వామివారికి విశేషంగా 'తిరుప్పావడ' (అన్నకూటోత్సవం) సేవ నిర్వహించారు. సకల ప్రాణికోటికి ఆహార కొరత తీరాలని కాంక్షిస్తూ సుమారు 450 కిలోల అన్నప్రసాదంతో పాటు లడ్డూలు, వడలు నైవేద్యంగా సమర్పించి హారతులు ఇచ్చారు. అనంతరం ఉదయం 10:30 గంటలకు వేదమంత్రోచ్చారణల మధ్య వైభవోత్సవ మంటపంలో శ్రీవారి నిత్య కళ్యాణోత్సవం వైభవంగా సాగింది. కాగా, ఈ రోజు దివ్య క్షేత్రంలో సుమారు 3,000 మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

నవంబర్ 4న బహిరంగ వేలం

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : జిల్లా పోలీస్ శాఖలో నిరుపయోగంగా ఉన్న వివిధ రకాల వస్తువులను నవంబర్ 4న బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నట్లు జిల్లా ఎస్‌పి కె. నరసింహ తెలిపారు. పోలీసు కార్యాలయాల్లో నిరుపయోగ వస్తువులను నిబంధనల ప్రకారం వేలం వేయాలని నిర్ణయించినట్లు వివరించారు. ఈ వేలంలో టెంట్ సామాగ్రి, ఫైబర్ ప్లాస్టిక్ సామాగ్రి, ఇనుప సామాగ్రి, ఎలక్ట్రానిక్ పరికరాలు తదితర పనికిరాని వస్తువులు ఉన్నట్లు తెలిపారు. వేలం నవంబర్ 4న ఉదయం 11 గంటలకు సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీ సమీపంలో ఉన్న పాత ఎస్‌పి కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల వారు వేలం ప్రక్రియలో పాల్గొని, సంబంధిత నిబంధనల ప్రకారం వస్తువులను కొనుగోలు చేసుకోవచ్చని సూచించారు. వివరాలకు రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ 8712686018 సంప్రదించాలన్నారు.

హుజూర్‌నగర్ మున్సిపల్ ఆస్తి అక్రమ రిజిస్ట్రేషన్ అధికారులపై చర్యలకు కలెక్టర్ అదేశాలు

ప్రజాపక్షం/హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ మున్సిపాలిటికి చెందిన భూమిని ప్రైవేట్ వ్యక్తుల పేర్లపై అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన వ్యవహారం పై జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. మున్సిపల్ ఆస్తి పన్ను రికార్డులను అక్రమంగా సృష్టించి, వాటి ఆధారంగా రిజిస్ట్రేషన్ చేసిన చేసినట్లు వచ్చిన ఆరోపణలపై సంబంధిత అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అదేశించారు. క్రిమినల్ ఫిర్యాదు నమోదు చేయడంతో పాటు, సమగ్ర విచారణ చేపట్టాలని స్పష్టం చేశారు. హుజూర్‌నగర్‌లో సుమారు 192 చదరపు గజాల స్థలంలో ఉన్న మున్సిపల్ బావి, పక్కనే ఉన్న భూమికి సంబంధించి ఈ వివాదం తలెత్తింది. ఈ స్థలానికి అక్రమంగా మున్సిపల్ ఆస్తి పన్ను మదింపు సృష్టించి దానిని ప్రైవేట్ వ్యక్తుల పేరిట రిజిస్ట్రేషన్ చేసేందుకు ఉపయోగించినట్లు ఆరోపణలు వచ్చాయి. హుజూర్‌నగర్ ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్ ఇచ్చిన నివేదికల ఆధారంగా కలెక్టర్ చర్యలకు అదేశించారు.

ముగ్గురు అధికారులపై చర్యలు...

ఆస్తి రికార్డుల సృష్టి, ధృవీకరణ, ప్రాసెసింగ్‌లో పాత్ర ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న గతంలో పనిచేసిన అప్పటి రెవిన్యూ ఇన్‌స్పెక్టర్, అసిస్టెంట్ రెవిన్యూ ఆఫీసర్, మున్సిపల్ కమిషనర్ పై క్రమశిక్షణ చర్యలు చేపట్టనున్నారు. ప్రస్తుతం వారు ఎక్కడ పనిచేస్తున్నా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అదేశించారు. సంబంధిత ఆవుట్ సోర్స్ డేటా ఎంట్రి ఆపరేటర్‌ను తొలగించారు.

రిజిస్ట్రేషన్ రద్దు...

వివాదస్పద స్థలాన్ని కాపాడేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కలెక్టర్ అదేశించారు. భూమి యాజమాన్యం, విస్తీర్ణం, హద్దులను నిర్ధారించి, రికార్డులను చట్టప్రకారం సరిచేయాలని సూచించారు.

క్రిమినల్ చర్యలకు ఫిర్యాదు

మున్సిపల్ ఆస్తి రికార్డులను మోసపూరితంగా సృష్టించడం, దుర్వినియోగం చేయడం, అక్రమ లావాదేవీలో ప్రమేయం ఉన్నట్లు అనుమానిస్తున్న వ్యక్తులపై క్రిమినల్ ఫిర్యాదు చేయాలని కమిషనర్‌ను అదేశించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో అనుసరిస్తున్న విధానంపై సంబంధిత సబ్ రిజిస్ట్రార్ ద్వారా నివేదిక కోరారు.

ఇతర ఆస్తులపైనా విచారణ...

సూర్యాపేట అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు, రెవిన్యూ) ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టనున్నారు. మున్సిపల్ భూములు, బావులు రోడ్లు, ప్రజా స్థలాలు, ఇతర ఆస్తులకు సంబంధించి జిల్లాలో ఇలాంటి అక్రమాలు జరిగాయా అనే అంశాన్ని కూడా పరిశీలించనున్నారు. సంబంధిత అధికారులు, ప్రైవేట్ వ్యక్తుల పాత్రపై విచారణ జరిపి 15 రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని కలెక్టర్ అదేశించారు. ప్రభుత్వ, మున్సిపల్ ఆస్తుల పరిరక్షణకు ప్రాధాన్యమిస్తామని, అక్రమాలకు పాల్పడినట్లు రుజువైతే బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

క్షయ వ్యాధిని నిర్మూలించాలి

కలెక్టర్ కె.హరిత



ప్రజాపక్షం/కెరమెరి: జిల్లాలో క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ ఒక లక్ష్యంతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ కె.హరిత పిలుపు ని చ్చారు. గురువారం మండలంలోని దేవాపూర్ గ్రామపంచాయతీ పరిధి కొలాంగూడలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమగ్ర ఆరోగ్య పరీక్ష శిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నాగేంద్రతో కలిసి ప్రారంభించారు. క్షయ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి ఆరు నెలల పాటు క్రమం తప్పకుండా మందులు, పౌష్టికాహారం తీసుకుంటే వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చన్నారు. ప్రారంభంలో గుర్తించకపోతే ఇతరులకు వ్యాపిస్తుందని, లక్షణాలు ఉన్నవారు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.ప్రధానమంత్రి జన్ మన్ పథకం ఇళ్ల విషయమై ప్రస్తావించగా అర్హులైన వారందరికీ ఇళ్లు మం జూరు చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లా ప్రోగ్రాం అధికారి వినయ్‌కుమా ర్, సర్పంచ్ కుమ్రంభీం రావు, ఉప సర్పంచ్ బారిక్ రావు, వైద్యులు, పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎండి సంధాని



ప్రజాపక్షం/మందమర్రి: విద్యార్థులు తమ హక్కులను తెలుసుకుంటూనే చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎం.డి.సంధాని పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంచిర్యాల జిల్లా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.విద్యార్థులు చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉంటూ బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలన్నారు. పోక్సో చట్టం, ర్యాగింగ్ నిరోధక చట్టం, బాల్యవివాహాల నిషేధం, మోటారు వాహనాల చట్టాలపై అవగాహన కల్పించారు. బాలలపై లైంగిక వేధింపుల నిరోధం, ర్యాగింగ్‌కు పాల్పడితే ఎదురయ్యే చట్టపరమైన చర్యలు, రహదారి భద్రతా నియమాల ఆవశ్యకతను వివరించారు. న్యాయ నిపుణులు ఆర్.శ్రీనివాస్, సబ్బాని సదయ్య, ఆర్.రాములు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పకడ్బందీగా జనగణన నిర్వహించాలి

కలెక్టర్ ప్రతిమా సింగ్



ప్రజాపక్షం/మెదక్ : జిల్లాలో జనాభా లెక్కల సేకరణ ప్రక్రియను సమగ్రంగా, ఖచ్చితత్వం తో, ఎలాంటి పొరపాట్లకు తా వులేకుండా నిర్వహించాలని జి ల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం ఐడిఓసి కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జనగణన శిక్షణ కార్యక్రమానికి ఆమె హాజరై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జనగణన వివరాలు భవిష్యత్తు అభివృద్ధి ప్రణాళికలకు ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఈసారి డిజిటల్ విధానంలో మొబైల్ యాప్ ద్వారా వివరాలు నమోదు చేయనున్నందున, సిబ్బంది స్వీయ గణన, కులాల వారీగా వివరాల సేకరణ తదితర అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రతి ఇంటి వివరాలను నిబంధనల ప్రకారం ఖచ్చితంగా నమోదు చేయాలని, జనగణన చట్టం1948 ప్రకారం సేకరించిన సమాచార గోప్యతను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. జనగణన విజయవంతానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. మాస్టర్ ట్రైనర్లు, చార్జి అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

టచ్ రగ్బీ జోనల్ పోటీల్లో 'శ్రీచైతన్య' విద్యార్థుల ప్రతిభ



ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్: అస్మిత ఖేలో ఇండియా జోనల్ లెవల్ టచ్ రగ్బీ పోటీల్లో శ్రీచైతన్య విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈశ్వర్ చరణ్ తెలిపారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని శ్రీ రాంపూర్ ప్రగతి స్టేడియంలో ఈ పోటీలను నిర్వహించారు. ఒక ప్రకటన విడుదల చేస్తూ, క్రీడల్లో రాణించిన విద్యార్థులు పాఠశాలకు మంచి గు ర్తింపు తెచ్చారని పేర్కొన్నారు. అద్భుత విజయాన్ని సాధించిన విద్యార్థులతో పాటు వారికి శిక్షణ అందించిన జోనల్ పిఇటి రాజేంధర్, కుమార్, లక్ష్మ ణ్ కుమార్, రాజు, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులను పాఠశాల చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య అభినందించారు.ఏజిఎం అరవిందరెడ్డి, కోఆర్డినేటర్ నాగరాజు, డిన్ సమ్మోన్, ఇన్‌చార్జి, ఎఒ విలాస్, జోనల్ పిఇటి రాజేంధర్ పాల్గొన్నారు.

భూ వివాదాల పరిష్కారమే లక్ష్యం

మెదక్ ఆర్‌డిఒ రమాదేవి



ప్రజాపక్షం/పెద్దశంకరంపేట: భూ రికార్డుల్లో తప్పులను సరిదిద్ది, రైతుల భూములకు స్పష్టమైన హద్దులు నిర్ణయించి, భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడమే సమగ్ర భూ సర్వే లక్ష్యమని మెదక్ ఆర్‌డిఒ రమాదేవి తెలిపారు. గురువారం పెద్దశంకరంపేట మండల పరిధిలోని శివాయపల్లి గ్రామంలో నిర్వహించిన భూ సర్వే అవగాహన గ్రామసభకు ఆమెతో పాటు సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కిషన్ హాజరయ్యారు. పట్టాదారులు తమ పట్టాదారు పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డు, ఇతర భూ సంబంధిత పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.డ్రోన్ సర్వే, రోవర్‌తో సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామసభలో డివిజనల్ సర్వేయర్ అజీమ్, మండల గిర్దావర్ నాగరాజు, మండల సర్వేయర్ నాగరాణి, రెవెన్యూ సిబ్బంది, పట్టాదారులు పాల్గొన్నారు.

గురువుల ఆశీస్సులతో సన్మార్గంలో నడవాలి

మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి

ప్రజాపక్షం/మెదక్: గురువుల ఆశీస్సులతో జీవితంలో సన్మార్గంలో నడుస్తూ, ఆధ్యాత్మిక విలువలను ఆచరించాలని మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మెదక్ పట్టణంలోని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బట్టి జగపతి నివాసంలో నిర్వహించిన శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామివారి పాదుకా పూజ కార్యక్రమంలో పాల్గొని ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా మాధవానంద సరస్వతి స్వామివారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో దైవత్వాన్ని గుర్తించాలని, తల్లిదండ్రులను గౌరవిస్తూ ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలని సూచించారు. ప్రేమ, సేవాభావంతో జీవిస్తూ కర్తవ్యాన్ని నిష్ఠతో నిర్వహించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో బట్టి జగపతి దంపతులు, పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, బ్రాహ్మణ మండలి సభ్యులు, భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో.. పేదలకు నాణ్యమైన వైద్య సేవలు

పటిష్ఠంగా అగ్నిమాపక, నిఘా

కలెక్టర్ భవేశ్ మిశ్రా





ప్రజాపక్షం/నిర్మల్ : జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేదలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా వైద్యారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు.ఆసుపత్రుల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు, వైద్య పరికరాలు అందుబాటులో ఉంచడంతో పాటు అగ్నిమాపక,నిఘా వ్యవస్థలను పటిష్ఠంగా ఏర్పాటు చేయాలని సూచించారు.గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్యారోగ్య శాఖ పనితీరుపై నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ పలు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు,ఆరోగ్య ఉప కేంద్రాలు సహా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వైద్య సేవలు అందించాలని స్పష్టం చేశారు.ఆసుపత్రుల్లో అవసరమైన మరమ్మతులను వెంటనే చేపట్టి,వైద్య పరికరాల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.వైద్యులు, సిబ్బంది విధులకు సకాలంలో హాజరై సమయపాలన పాటించాలని,ఆసుపత్రుల్లో ఎదురయ్యే సమస్యలను వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.జిల్లాలోని ఆసుపత్రులు,ఔషధ దుకాణాలు,రోగ నిర్ధారణ కేంద్రాలు నిబంధనలకు అనుగుణంగా పనిచేసేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు.తరచూ తనిఖీలు నిర్వహిస్తూ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.రోగ నిర్ధారణ పరీక్షల పేరుతో అధిక మొత్తాలు వసూలు చేసే కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. చిన్నారులకు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం టీకాలు అందించాలని,ప్రజలకు జన ఔషధి మందులపై అవగాహన కల్పించాలని తెలిపారు.టిబి వ్యాధి నిర్మూలనకు సమన్వయంతో కృషి చేయాలని,వ్యాధి నిర్ధారణ పరీక్షలు, మెరుగైన వైద్య సలహాలు,నిరంతర పర్యవేక్షణ ద్వారా వ్యాధి వ్యాప్తిని నియంత్రించాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి రాజేందర్,డ్రగ్ ఇన్స్‌పెక్టర్ శ్యామ్‌సుందర్,ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకులు గోపాల్ సింగ్,వైద్య కళాశాల ప్రిన్సిపల్ శారద ,డిసిహెచ్ఎస్ కాశీనాథ్,వైద్య అధికారులు, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

వేగవంతంగా విద్యాసంస్థల్లో అభివృద్ధి పనులు

కలెక్టర్ కుమార్ దీపక్



ప్రజాపక్షం/నస్పూర్ : ప్రభుత్వ విద్యాసంస్థల్లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. గురువారం కాసిపేట మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని పరిశీలించారు. అనంతరం రేకులగూడలోని ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. తాండూర్ మండలం తంగళ్లపల్లిలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న వసతి గృహ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలన్నారు. తాండూర్ కెజిబివిలో సరైన విద్యా వాతావరణం కల్పించడంలో నిర్లక్ష్యం వహించిన స్పెషల్ ఆఫీసర్‌కు షోకాజ్ నోటీసు జారీ చేయాలని డిఇఒను ఆదేశించారు. అనంతరం బెల్లంపల్లిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను పరిశీలించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ మనోజ్‌తో కలిసి తహసిల్దార్లతో సమావేశం నిర్వహించి భూభారతి, భూదాన్ భూములు, రెవెన్యూ అంశాలపై సమీక్షించారు. పెండింగ్ దరఖాస్తులను నిబంధనల ప్రకారం వెంటనే పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో సబ్ కలెక్టర్ మనోజ్, ఎంపిఒ సబ్దర్ అలీ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో ఎసిబి పంజా

రూ.22 వేలు లంచం తీసుకుంటూ చిక్కిన జిపిఒ



ప్రజాపక్షం/కాగజ్ నగర్: రైతు నుంచి రూ.22 వేలు లంచం తీసుకుంటూ కాగజ్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్‌హ్యాండెడ్‌గా ఎసిబి వలలో చిక్కాడు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంపై ఎసిబి డిఎస్‌పి మధు ఆధ్వర్యంలో అధికారులు మెరుపు దాడి నిర్వహించారు.భూ రికార్డుల పని కోసం కార్యాలయానికి వచ్చిన రైతును జిపిఒ శ్రీనివాస్ లంచం డిమాండ్ చేయడంతో బాధితుడు ఎసిబిని ఆశ్రయించాడు. అధికారుల పక్కా వ్యూహంతో బాధితుడు రసాయనం పూసిన నోట్లను అందజేస్తుండగా మాటువేసిన ఎసిబి బృందం క్షణాల్లో చుట్టుముట్టి నగదుతో సహా అదుపులోకి తీసుకున్నారు.అవినీతికి పాల్పడే అధికారులు ఎంతటి వారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు. కార్యాలయంలో విస్తృతంగా సోదాలు చేపట్టి రికార్డులను స్వాధీనం చేసుకున్నామని, మిగతా రెవెన్యూ సిబ్బంది ప్రమేయంపైనా లోతుగా విచారణ జరుపుతున్నామని స్పష్టం చేశారు. ఎసిబి దాడితో కాగజ్ నగర్ రెవెన్యూ వర్గాల్లో తీవ్ర అలజడి రేగింది.

'జైనూర్' ఉర్దూ పాఠశాలలో ఖాళీల భర్తీ చేయండి

మంత్రి మహమ్మద్ అజహరుద్దీన్ పాఠశాల విద్యాశాఖ కమిషనర్, డైరెక్టర్‌కు ఆదేశం

ప్రజాపక్షం ఎఫెక్ట్


ప్రజాపక్షం/జైనూర్: కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (ఉర్దూ మీడియం)లో ఉపా ధ్యాయుల కొరతపై 'ప్రజాపక్షం' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ప్రభుత్వం స్పందించింది. పాఠశాలలో నెలకొన్న తీవ్ర ఉపాధ్యాయుల కొరత ను పరిష్కరించి, ఖాళీ పోస్టులను ప్రాధాన్యతా క్రమంలో వెంటనే భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజహరుద్దీన్ పాఠశాల విద్యాశాఖ కమిషనర్, డైరెక్టర్‌ను ఆదేశించారు. ఈ మేరకు అధికారిక లేఖ రాశారు. జైనూర్ జడ్‌పిఎస్ఎస్ ఉర్దూ పాఠశాలలో దాదాపు 200 మంది విద్యా ర్థులు చదువుతుండగా, కేవలం ముగ్గురు ఉపాధ్యాయులు మాత్రమే విధులు నిర్వ హిస్తున్నారు. రానున్న వార్షి క పరీక్షలకు హాజర వుతున్న 50 మంది పదో తరగతి విద్యార్థులకు సిలబస్ పూర్తి కాక, ప్రత్యేక తరగతులు, మోడల్ పరీక్షలు, సందేహాల నివృత్తి లేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రధానోపాధ్యాయురాలు అయేషా జిల్లా విద్యా శాఖ అధికారి, అదనపు కలెక్టర్ దీపక్ తివారి దృ ష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని ప్ర చురితమైన కథనంపై మంత్రి స్పందించారు. జైనూర్ ఉ ర్దూ మీడియం ఉన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ఆదేశించారు. పదో తరగతి విద్యార్థుల విద్యా సంవత్సరం నష్ట పోకుండా ప్రత్యేక శిక్షణ, రివిజన్ తరగతులు నిర్వహించేలా తగిన చర్యలు తీసు కోవాలని సూచించారు. చేపట్టిన వివరాలను నేరుగా దర ఖాసు దారుడికి తెలియజే యడంతో పాటు తన కా ర్యాలయానికి నివేదం చాలని మంత్రి పేర్కొన్నారు. సమస్యపై మంత్రి స్పందించడం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

టిచర్లు లేకపోతే పదో తరగతి పాసయ్యేదెలా?



కరువు మండలాల ఎంపికలోనూ వివక్షేనా?

జిల్లా అంతటా కరువు ఛాయలు, ఎంపికలో పక్షపాతమంటూ రైతుల ఆందోళన!, సమగ్ర పునఃసర్వే చేయాలని డిమాండ్



ప్రజాపక్షం/నిర్మల్ : నిర్మల్ జిల్లావ్యాప్తంగా కరువు పరిస్థితులు నెలకొని రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో కరువు ప్రభావిత మండలాల ఎంపిక వివాదాస్పదంగా మారుతోంది. వర్షాభావంతో పంటలు దెబ్బతిని, పెట్టుబడులు చేతికందక అన్నదాతలు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతుంటే.. కరువు మండలాల గుర్తింపులోనూ వివక్ష చోటుచేసుకుందంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అంతటా కరువు ఛాయలు కనిపిస్తున్నప్పటికీ, కొన్ని మండలాలనే ఎంపిక చేసి మరికొన్ని ప్రభావిత ప్రాంతాలను విస్మరించడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. వానాకాలంలో ఆశతో పంటలు సాగు చేసిన రైతులకు వర్షాభావ పరిస్థితులు నిరాశను మిగిల్చాయి. సకాలంలో వర్షాలు కురవకపోవడం, సాగునీటి కొరత, పంటల ఎదుగుదల దెబ్బతినడంతో రైతులు నష్టాలను ఎదుర్కొంటున్నారు. జిల్లాలో ఎంపికైన 9 కరువు మండలాలు ఇవే! అందుబాటులో ఉన్న జాబితా ప్రకారం నిర్మల్ జిల్లాలో మొత్తం 9 మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించారు. వీటిలో ఒక మండలాన్ని తీవ్ర కరువు ప్రభావిత ప్రాంతంగా, మరో ఎనిమిది మండలాలను మధ్యస్థ కరువు ప్రభావిత ప్రాంతాలుగా వర్గీకరించారు.

తీవ్ర కరువు ప్రభావిత మండలం :1. ఖానాపూర్, **మధ్యస్థ కరువు ప్రభావిత మండలాలు :** 1. కుబీర్2. భైంసా3. కుంటాల4. నిర్మల్ అర్బన్5. సోన్6.లక్ష్మణచాంద7. కడెం పెదూర్8.దస్తూరాబాద్ఈ జాబితాపై ఇతర మండలాల రైతులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులు తీవ్రంగా ఉన్నప్పటికీ,ఆయా మండలాలకు కరువు జాబితాలో ఎందుకు చోటు దక్కలేదని నిలదీస్తున్నారు. కరువు తీవ్రతను అంచనా వేసిన విధానం, మండలాల ఎంపికకు అనుసరించిన ప్రమాణాలను అధికారులు వెల్లడించాలని కోరుతున్నారు. ఎస్ఆర్‌ఎస్పి పక్కన ఉన్నా కరువు మండలమేనా? శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్ఆర్‌ఎస్పి) సమీపంలో ఉన్న మండలాన్ని కరువు ప్రభావిత ప్రాంతంగా ఎంపిక చేయడంపై ఇతర మండలాల రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. అలాగే సరస్వతి కాల్వ ద్వారా సాగునీరు అందే అవకాశం ఉన్న ప్రాంతాలను కూడా కరువు మండలాలుగా గుర్తించడంపై ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. క్షేత్రస్థాయిలో పంటల పరిస్థితిని సమగ్రంగా పరిశీలించారా? వర్షపాతం వివరాలు, పంటల నష్టం, సాగునీటి లభ్యత, భూగర్భ జలాల పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్నారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రణాళికాబద్ధమైన చర్యలు

మాధవ్‌నగర్ ఆర్‌ఓబీ పనులకు రూ.42 కోట్లు కేటాయింపు



ప్రజాపక్షం/నిజామాబాద్ : ఎల్ నినో ప్రభావంతో విపత్కర పరిస్థితులు నెలకొన్న ప్రస్తుత తరుణంలో జిల్లా వ్యాప్తంగా రానున్న రోజుల్లో ఎక్కడ తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్‌రెడ్డి తెలిపారు. వచ్చే వేసవి సీజన్ ముగిసే వరకు కూడా అన్ని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి హాబిటేషన్‌కు రక్షిత మంచినీరు సరఫరా జరిగేలా ముందస్తుగానే సమగ్ర ప్రణాళికను అమలు చేస్తున్నామన్నారు. తీవ్ర వర్షాభావం, భూగర్భజలాలు గణనీయంగా పడిపోతున్న దృష్ట్యా రబీలో వరి పంటకు సాగునీరందించే పరిస్థితి లేనందున వరి వేయవద్దని రైతులకు హితవు పలికారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో గురువారం కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి మున్సిపల్ కమీషనర్లు, మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్, అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ప్రధాన తాగునీటి వనరులుగా ఉపయోగపడుతున్న నిజాంసాగర్, శ్రీరాంసాగర్ జలాశయాల్లో అందుబాటులోని నీటి నిల్వలను పూర్తిగా తాగునీటి అవసరాల కోసమే వినియోగించాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. మాధవనగర్ ఆర్‌ఓబీ పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 13 విడతలలో రూ.42 కోట్లకేటాయించిందని వివరించారు. ఆర్సపల్లి ఆర్‌ఓబీకి 11 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. తాహెర్‌బిన్ హందాన్, డాక్టర్ కవితారెడ్డి, అదనపు కలెక్టర్లు రాజాగౌడ్, భుజంగరావు, నగరపాలక సంస్థ కమీషనర్ దిలీప్‌కుమార్, జడ్‌పి సిఇఒ సాయగౌడ్, డిఆర్‌డిఒ సాయన్న, జిల్లా వ్యవసాయాధికారి వీరాస్వామి, శ్రీనివాస్, అధికారులు స్వప్న,రాకేష్, పాల్గొన్నారు.

అధికార పార్టీలో ఆధిపత్య పోరు.. ప్రజా సమస్యలకు గ్రహణం!

బొగ్గు బావుల నుంచి పల్లెల దాకా రాజకీయ వర్గపోరుపైనే చర్చ, తాళ్లపేట ఘటనలతో ఆందోళన.. శాంతిభద్రతలపై ప్రజల్లో ప్రశ్నలు

ప్రజాపక్షం/మంచిర్యాల: బొగ్గు గనుల సైరన్ మోతలు, శ్రామిక చైతన్యం, పల్లెల్లో పరస్పర సఖ్యతకు చిరునామాగా నిలిచిన మంచిర్యాల నియోజకవర్గంలో ఇప్పుడు అధికార కాంగ్రెస్ పార్టీ అంతర్గత వర్గపోరు కాకరేపుతోంది. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి వర్గాల మధ్య అంతరం పెరగడం, మరోవైపు కాంగ్రెస్ సీనియర్ నేత మంతెన జగన్ మోహన్ రావు వ్యవహారంతో నియోజకవర్గంలో మొదలైన రచ్చ రాష్ట్ర రాజధాని దాకా చేరింది. దండేపల్లి మండలం తాళ్లపేటలో బతుకమ్మ, దసరా వేళ చోటుచేసుకున్న ఘర్షణలు ఈ ఆధిపత్య పోరు తీవ్రతను బహిర్గతం చేశాయి. ప్రజాప్రతినిధులు రాజకీయ సమరాలకే పరిమితమవడంతో రైతులు, బొగ్గు బావి కార్మికులు, పట్టణ ప్రజల సమస్యలు అటకెక్కాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సింగరేణి బొగ్గు గనులతో విలసిల్లే మంచిర్యాల పారిశ్రామిక ప్రాంతంలో కార్మికుల సంక్షేమం, కొత్త గనుల ఏర్పాటు, వేతన ఒప్పందాల అమలు ప్రధాన ఎజెండా కావాలి. కానీ ఎమ్మెల్యే, మంత్రి వర్గాల పరస్పర ఆధిపత్యానికి వేదికగా మారుతుండటం ఆందోళన కలిగిస్తోంది. బొగ్గు బావుల్లో కార్మికుల సమస్యలు పాలకుల రాజకీయ సమరాల నీడలో మరుగున పడుతున్నాయి.

తాళ్లపేట ఘర్షణలు.. గ్రామాల్లో భద్రత కర ఏదీ?


దండేపల్లి మండలం తాళ్లపేటలో సద్దుల బతుకమ్మ సందర్భంగా అక్టోబరు 18న కాంగ్రెస్‌లోని రెండు వర్గాల మధ్య మొదలైన వివాదం తీవ్రరూపం దాల్చింది. అనంతరం అక్టోబరు 20న జరిగిన పరస్పర ఘర్షణలకు సంబంధించి పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకోవడం, అరెస్టులు జరగడం వంటి పరిణామాలు నియోజకవర్గవ్యాప్తంగా కలకలం రేపాయి. జగన్ మోహన్ రావు వర్గీయులు, ఎమ్మెల్యే పిఎస్‌ఆర్ అనుచరుల మధ్య నెలకొన్న వైరం ఇళ్లపై దాడులు, పోలీస్ కేసుల వరకు వెళ్లింది. పల్లెల్లో శాంతిభద్రతలను కాపాడటానికి పోలీసు బలగాలను మోహరించాల్సిన దుస్థితి తలెత్తడం గ్రామీణ ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తోంది.

పక్కదారి పట్టిన సాగు సమస్యలు..

వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న మంచిర్యాల, లక్సెట్టిపేట, దండేపల్లి మండలాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ కొరవడింది. ప్రస్తుతం పత్తి కొనుగోలు కేంద్రాల నిర్వహణ, సిసిఐ కేంద్రాల్లో నిబంధనల సడలింపు, ధాన్యం సేకరణపై దృష్టి పెట్టాల్సిన పాలకులు పరస్పర రాజకీయ పోరాటాలకే పరిమితమయ్యారు. మార్కెట్ యార్డుల్లో అన్నదాతలు రోజుల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు.

రాజకీయ ఒత్తిళ్లతో స్తంభించిన పాలన

మంచిర్యాల పట్టణ మున్సిపాలిటీలో అభివృద్ధి పనుల బిల్లులు, పరిపాలనా ఫైళ్లు నేతల ఒత్తిళ్లతో పెండింగ్‌లో పడ్డాయి. అధికారుల బదిలీలు, పోలీస్ స్టేషన్లలో పెత్తనం విషయంలో రెండు వర్గాల మధ్య నెలకొన్న పోటీతో అధికార యంత్రాంగం అయోమయంలో పడింది. ప్రజా సమస్యలతో ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే సామాన్యుడికి పరిష్కారం దొరకడం గగనంగా మారింది. నాడు ప్రశాంతతకు మారుపేరైన 'మంచి మంచిర్యాల' నేడు అధికార పార్టీ నేతల వ్యక్తిగత అహాల పోరుకు అడ్డాగా మారడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. నాయకులు తమ ఆధిపత్య పోరును పక్కనపెట్టి నియోజకవర్గ శాంతిభద్రతలు, ప్రజా సమస్యల పరిష్కారంపై ఎప్పుడు దృష్టి సారిస్తారనే ప్రశ్నలు సర్వత్రా వినిపిస్తున్నాయి.



అంతర్రాష్ట్ర ముఠా సభ్యురాలి అరెస్ట్

25 తులాల ఆభరణాలు స్వాధీనం

వివరాలు వెల్లడించిన ఎస్‌పి



ప్రజాపక్షం/మెదక్: రాఖీ పండుగ సందర్భంగా బస్సులో జరిగిన ముప్పై తులాల బంగారు ఆభరణాల చోరీ కేసును నిజాంపేట పోలీసులు ఛేదించారు. అంతర్రాష్ట్ర ముఠాకు చెందిన మేకల సంధ్య(30)ను అరెస్టు చేసి, ఆమె నుంచి సుమారు 25 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్‌పి డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. నల్గొండకు చెందిన సూరం స్నేహ ఆగస్టు 26న నిజాంపేటకు వస్తుండగా బ్యాగులోని బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. సిసిటివి ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితురాలిని గుర్తించారు. ఫేస్‌బుక్ మెసెంజర్ ద్వారా చోరీకి ప్రణాళిక రచించిన ముఠా సభ్యులు స్విఫ్ట్, ఇన్నోవా కార్లలో పరారైనట్లు విచారణలో వెల్లడైందని ఎస్‌పి పేర్కొన్నారు. ప్రయాణించే సమయంలో వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్‌పి సూచించారు.

ప్రజాపక్షం
Telugu National Daily
ఖమ్మం
శుక్రవారం
30-10-2026
www.prajapaksham.in

భారత్‌పై ఎల్ నినో దెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

మరణాలు సంభవించే ప్రమాదం ఉందని న్యూ ట్రాకర్ పేర్కొన్నది. ఇది వాతావరణ సమాచారం, ఉష్ణోగ్రతల అంచనాలు, గతంలో అధిక ఉష్ణోగ్రతలకు సంబంధించిన మరణాల మధ్య ఉన్న సంబంధాల ఆధారంగా రూపొందించిన నమూనా అంచనా మాత్రమే. వాస్తవంగా ఎంతమంది మరణిస్తారో ఈ అంచనా కచ్చితంగా వెల్లడించడం లేదు. కాగా, ఎల్‌నినో అంటే పసిఫిక్ మహాసముద్రంలోని మధ్య, తూర్పు ప్రాంతాల్లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడంవల్ల సంభవించే ఓ పరిణామం. దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా గాలుల దిశ, వర్షపాతం, ఉష్ణోగ్రతల్లో మార్పులు వస్తాయి. ఈసారి ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండవచ్చని నిపుణులు భావిస్తున్నారు. ప్రపంచ వాతావరణ సంస్థ కూడా ఈ ఏడాది ఎల్ నినో బలంగా ఉందని, డిసెంబర్‌లో గరిష్ఠస్థాయికి చేరే అవకాశం ఉందని హెచ్చరించింది. దీని ప్రభావాలు 2027 ప్రారంభం వరకు కొనసాగవచ్చని అంచనా వేసింది. అయితే ఈ న్యూ ట్రాకర్ అంచనాలు మరణాలు తప్పనిసరిగా సంభవిస్తాయని చెప్పడంలేదు. ముందస్తు హెచ్చరికలు, తాగునీటి సదుపాయాలు, చల్లదనం కల్పించే కేంద్రాలు, బయట పనిచేసే కార్మికులకు రక్షణ, ఆరోగ్య సేవలను మెరుగుపరచడం ద్వారా ఈ ప్రాణనష్టాన్ని తగ్గించవచ్చని పరిశోధకులు సూచిస్తున్నారు.

ప్రభుత్వానివే

(మొదటి పేజీ తరువాయి)

జస్టిస్ సతీష్ చంద్ర శర్మతో కూడిన ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది. దీంతో వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములపై సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న న్యాయ వివాదానికి ముగింపు లభించిందని ప్రభుత్వ యంత్రాంగం తెలియజేసింది.

సుదీర్ఘ న్యాయపోరాటం

మియాపూర్ సర్వే నంబర్ 100లో 277 ఎకరాల 5 గుంటలు, సర్వే నంబర్ 101లో 273 ఎకరాల 34 గుంటల భూమి ప్రభుత్వ భూమిగా రెవెన్యూ రికార్డుల్లో నమోదై ఉంది. ఈ భూములపై హక్కులు కోరుతూ ప్రైవేట్ వ్యక్తులు న్యాయస్థానాలను ఆశ్రయించారు. ఈ కేసుల్లో 1997లో ప్రత్యేక న్యాయస్థానం, 2003లో హైకోర్టు ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పులు ఇచ్చాయి. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ ప్రైవేట్ వ్యక్తులు సుప్రీంకోర్టుకు వెళ్లారు. అప్పటి నుంచి దాదాపు 23 ఏళ్లుగా ఈ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.

కాంగ్రెస్ ప్రభుత్వ ప్రత్యేక చొరవ

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఈ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించారు. అత్యంత విలువైన ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు న్యాయపరమైన చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ప్రత్యేక పర్యవేక్షణలో ప్రభుత్వ యంత్రాంగం, న్యాయ నిపుణుల మధ్య సమన్వయం పెంచి సుప్రీంకోర్టులో కేసుల విచారణకు అవసరమైన చర్యలు చేపట్టారు. ప్రభుత్వ పక్షాన సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ సమర్థవంతమైన వాదనలు వినిపించారు. మియాపూర్ భూములు ప్రభుత్వానికే చెందుతాయని స్పష్టం చేసే పాత రెవెన్యూ రికార్డులు, సేత్వార్, క్లాసర్ రిజిస్టర్, గత న్యాయస్థానాల తీర్పులను ప్రభుత్వం ఆధారాలుగా సమర్పించింది. ప్రైవేట్ వ్యక్తులు హక్కులు కోరుతూ చూపిన రెవెన్యూ ఎంట్రీల్లో అవకతవకలు ఉన్నాయని గత న్యాయస్థానాలు గుర్తించిన అంశాలను ప్రభుత్వ వాదనల్లో ప్రస్తావించారు. ప్రభుత్వ వాదనల అనంతరం సుప్రీంకోర్టు ప్రైవేట్ వ్యక్తుల అప్పీళ్లను కొట్టివేయడంతో రాష్ట్ర ప్రభుత్వానికి కీలక విజయం లభించిందని అధికార యంత్రాంగం తెలిపింది.

'మైలురాయి' టైటిల్ లాంచ్



హన్సి ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నెం. 1గా శ్రీ హన్సిక పెద్దిరెడ్డి నిర్మిస్తున్న చిత్రం 'మైలురాయి'. తవిటిరాజు తలచింతల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ చిత్రానికి టాలెంటెడ్ డైరెక్టర్ రఘువర్ధన్ కోట్ల దర్శకత్వం వహిస్తున్నారు. యువ నటీనటులు జగన్ యోగిరాజు, నవ్య చిట్యాల హీరో – హీరోయిన్లుగా నటిస్తున్నారు. వీరితో పాటు సీనియర్ నటుడు దేవీ ప్రసాద్ కీలక పాత్రలో కనిపించనున్నారు. లక్ష్మణ్ మీసాల, పవన్ రమేష్, సునందిని, అంజు వాల్గుమన్ ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. తాజాగా ఈ చిత్ర టైటిల్ లాంచ్ పోస్టర్‌ను సీనియర్ నటుడు, నిర్మాత, ఎపి శాసనమండలి సభ్యుడు, ఎపి గ్రీన్ కార్పొరేషన్ చైర్మన్ నాగబాబు విడుదల చేశారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ ''ఈ సినిమా టైటిల్ 'మైలురాయి' చాలా ఆసక్తికరంగా ఉంది. నిర్మాత హన్సిక మంచి సినిమాతో తన కెరీర్ను ప్రారంభించారు. ఔత్సాహిక దర్శకుడు, యువ హీరోతో ఈ చిత్రాన్ని రూపొందించడం అభినందనీయం. ఫిల్మ్ మేకింగ్‌లో మహిళలకు ఉండే బాధ్యత, క్రమశిక్షణ ఎంతో గొప్పవి. నిర్మాత శ్రీ హన్సిక పెద్దిరెడ్డి మాట్లాడుతూ ''మా హన్సి ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నెం. 1గా రూపొందుతున్న 'మైలురాయి' టైటిల్ లాంచ్ పోస్టర్‌ను నాగబాబు గారి చేతుల మీదుగా విడుదల చేయడం చాలా సంతోషంగా ఉంది. సినిమా షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలోనే టీజర్, పాటలను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం అని తెలిపారు. సహ నిర్మాత తవిటిరాజు తలచింతల , హీరో జగన్ యోగిరాజు ,దర్శకుడు రఘువర్ధన్ కోట్ల పోస్టర్ లంచ్ కార్యక్రమంలో పాల్గొన్నారు.



నవంబర్ 27న 'హై'

అనిల్ రావిపూడితో కలిసి పనిచేసి, పలు సినిమాలకు కోరైటర్‌గా తనదైన గుర్తింపు తెచ్చుకున్న ఎస్ కృష్ణ 'హై' సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ సినిమాకు ఆయనే కథ, స్క్రీన్‌పై బాధ్యతలు చేపట్టడంతో పాటు కీలక పాత్రలోనూ నటిస్తున్నారు. హరీష్ పెద్ది, శేఖర్ దివ్వెలతో కలిసి కోప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఇమేజ్‌స్పార్క్ ఎంటర్‌టైన్‌మెంట్, మైరా క్రియేషన్స్ బ్యానర్లపై తెరకెక్కుతున్న ఈ సినిమా ఎమోషన్స్, డ్రామా, హై ఎనర్జీ మూమెంట్స్‌తో ప్రేక్షకులను అలరించనుంది. అనన్య శర్మ, ఎస్ కృష్ణ, పల్లవి దొర, కృష్ణ కమల్, సాయి కృష్ణ, రేవంత్ (బుల్లిరాజు) కీలక పాత్రల్లో నటిస్తున్నారు. నవంబర్ 27న ప్రపంచ వ్యాప్తంగా 'హై' థియేటర్లలో విడుదల కానుంది.'హై' సినిమా ప్రతి వ్యక్తి తన జీవితంలో కోరుకునే ఆనందం, ఉత్సాహం వెనుక ఉన్న భావోద్వేగ, మానసిక, నైతిక సంఘర్షణలను ఆవిష్కరించనుంది. ఒక పాత్ర ఆత్మహత్య చేసుకోవాలని అనుకుంటే, మరో పాత్ర డబ్బు, మద్యం ద్వారా ఆనందాన్ని వెతుక్కుంటుంది. మరో యువతి తన ఆత్మగౌరవాన్ని తిరిగి సాధించుకోవడం ద్వారా తనలోని బలాన్ని గుర్తిస్తుంది. అదే సమయంలో ఆమె ప్రేమికుడు బెట్టింగ్స్‌లో థ్రిల్‌ను వెతుక్కుంటాడు. ఇలా పరస్పరం అనుసంధానమైన కథల ద్వారా, డేంజర్ మార్గాలను ఎంచుకోవడం కంటే సరైన నిర్ణయాలు తీసుకోవడంలోనే జీవితానికి నిజమైన ఆనందం లభిస్తుందనే విషయాన్ని ఈ సినిమా ప్రజెంట్ చేయబోతోంది.మల్లు నాయక్, సునీల్ రెడ్డి సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, వికాస్ బడిసా సంగీతం సమకూరుస్తున్నారు. జీఆర్‌కే శరణ్ రావుల ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. వి వెంకట్ యాక్షన్ సీక్వెన్స్‌లను రూపొందిస్తున్నారు.

మెగాస్టార్ నెట్‌ఫ్లిక్స్‌లో టాక్ షో 'మెగావర్స్' షూటింగ్ ప్రారంభం



మెగాస్టార్ అంటేనే వైవిధ్యానికి మరో పేరు. దశాబ్దాలుగా తన అద్భుతమైన నటనతో వెండితెరపై కోట్లాది మంది ప్రేక్షకులను అలరిస్తున్న మెగాస్టార్ చిరంజీవి.. ఇప్పుడు నెట్‌ఫ్లిక్స్ అరంగేట్రంతో మరో ఆసక్తికరమైన ప్రయాణానికి సిద్ధమయ్యారు. 'మెగావర్స్' పేరుతో రూపొందుతున్న ఈ షో ద్వారా ఆయన డిజిటల్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రపంచంలోకి అడుగుపెడుతున్నారు.గ్లోబల్ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్ ప్రసారం కానున్న ఈ ప్రత్యేకమైన టాక్ షోలో చిరంజీవి తనదైన చరిష్మా, హాస్యం, విభిన్నమైన ఆలోచనా విధానంతో ప్రేక్షకులను అలరించనున్నారు. ఆసక్తికరమైన సంభాషణలు, అద్భుతమైన కథలు, ఎన్నో కొత్త విషయాల ఆవిష్కరణతో ఈ షో సాగనుంది.'మెగావర్స్'లో ప్రేక్షకులతో తరతరాలుగా ప్రత్యేకమైన అనుబంధాన్ని కొనసాగిస్తున్న చిరంజీవి.. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, విభిన్న తరాలకు చెందిన సార్స్‌తో ముచ్చటించనున్నారు. తన సహజమైన ఆత్మీయత, సందర్భానికి తగ్గట్టుగా స్పందించే ప్రత్యేకమైన శైలి, ఆకట్టుకునే వ్యక్తిత్వంతో ఈ వేదికపై సందడి చేయనున్నారు. ఈ షోకు మెగాస్టార్ చిరంజీవి ప్రధాన ఆకర్షణగా నిలవనున్నారు.గోల్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్, ఆటమ్ మీడియా వెంచర్స్, ఎస్ ఓ ఎల్ ప్రొడక్షన్ ఎల్ ఎల్ పీ సంయుక్తంగా ఈ షోను నిర్మిస్తున్నాయి. ప్రస్తుతం 'మెగావర్స్' షూటింగ్ జరుగుతోంది. ఈ షోకు సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలో వెల్లడించనున్నారు.

హీరో సుమన్‌కు 'కత్తి కాంతారావు జాతీయ పురస్కారం'

తెలుగు ఫిలిం టెలివిజన్ వెల్ఫేర్ పోరం , భారత్ కల్చరల్ అకాడమీ సంయుక్తంగా, ప్రతి సంవత్సరం కళా ప్రపూర్ణ కత్తి కాంతారావు జన్మదినోత్సవాన్ని పునస్కరించుకుని గత 24 సంవత్సరాలుగా పలువురు సినీ ప్రముఖులను సన్మానిస్తూ కత్తి కాంతారావు పేరున జాతీయ పురస్కారాలను అందిస్తున్నది. 2026 జాతీయ పురస్కారానికి గాను నటుడు హీరో సుమన్ ను సుమారు 300కు పైగా తెలుగు తమిళ, మళయాళ, కన్నడ చిత్రాలలో నటించి, పౌరాణిక పాత్రలైన శ్రీవేంకటేశ్వర స్వామిగా శ్రీకృష్ణుడిగా, యంగ్ అండ్ డైనమిక్ పోలీస్ ఆఫీసర్‌గా, యాక్షన్ చిత్రాల హీరోగా, కరాటే యోధుడు అయిన సుమన్ అనేక పాత్రలలో నటించి ప్రేక్షకుల హృదయాలలో గొప్ప స్థానం సంపాదించుకున్న నటుడు సుమన్‌కు 'కత్తి కాంతారావు జాతీయ పురస్కారం'తో సత్కరించాలని తెలుగు ఫిలిం టెలివిజన్ వెల్ఫేర్ ఫోరం , భారత్ కల్చరల్ అకాడమీ నిర్ణయించింది. ఈ అవార్డ్‌ను హైదరాబాద్‌లో కాంతారావు పుట్టిన రోజైన నవంబర్ 16వ తేదీన ప్రధానం చేయనున్నట్టు అవార్డ్ కమిటి చైర్మెన్ కె వి .రమణా చారి..(రిటైర్డ్ ఐ ఎ ఎస్) సి.పార్థసారథి (రిటైర్డ్ ఐ ఎ ఎస్) , నాగబాల డి. సురేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.



వీడిన హత్య మిస్టరీ

(మొదటి పేజీ తరువాయి)

సామినేని రామారావు హత్య కేసుకు సంబంధించి చింతకాని పోలీస్ స్టేషన్‌లో బిఎన్ఎస్ సెక్షన్ 103/1, సెక్షన్ 190 క్రింద కేసు నమోదు చేశామని తెలిపారు. క్లూస్‌టీమ్, ఫోరెన్సిక్ సహా ఇతర సాంకేతిక ఆధారాలతో ఆరు బృందాలు దర్యాప్తు నిర్వహించాయన్నారు. సంఘటన స్థలంలో చెప్పులు, కాలి ముద్రలు, ఎరుపు , తెలుపు రంగు కలిగిన రెండు వస్త్రపు ముక్కలు, కత్తి కవర్‌తో పాటు ఇతర భౌతిక ఆధారాలు లభించాయని ఆయన తెలిపారు. మృతుని శరీరంపై ఉన్న గాయాలను, సాక్ష్యాల వాంగ్మూలాలను పరిశీలించడం జరిగిందని సునీల్ దత్ తెలిపారు. నిందితులను గుర్తించేందుకు సాంకేతిక దర్యాప్తు చేపట్టామని 24 మందికి పాలిగ్రాఫ్ పరీక్షలు నిర్వహించేందుకు న్యాయస్థానం అనుమతి కోరామన్నారు. అనుమానితుల్లో ఆరుగురు మాత్రం స్వచ్ఛందంగా పరీక్షలకు సమ్మతి తెలిపారన్నారు. ఖమ్మం రూరల్ మండలం తెల్దారుపల్లి గ్రామానికి చెందిన బోడపట్ల శ్రీనివాసరావు అలియాస్ మెంటల్ శ్రీను, అదే గ్రామానికి చెందిన నూకల లింగయ్య, మల్లారపు లక్ష్మయ్య, కర్లపూడి ఉదయ్‌కుమార్ అలియాస్ రుక్మాన్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చినట్లు సిపి తెలిపారు. వీరితో పాటు హత్యకు ఉపయోగించిన రెండు కత్తులను, నిందితులు రెక్కీ నిర్వహించే సమయంలో ఉపయోగించినట్లు ఆరోపణలు ఉన్న నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు సిపి సునీల్ దత్ తెలిపారు. ఈ సందర్భంగా మీడియా అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం చెబుతూ వీరిలో ముగ్గురికి నేర చరిత్ర ఉందని గతంలో తమ్మినేని కృష్ణయ్య హత్య కేసులోనూ చౌటుప్పల్ వద్ద జరిగిన ఒక హత్యాయత్నం కేసులోనూ నిందితులుగా ఉన్నారన్నారు. హత్యకు గల కారణాలు ఏమిటని మీడియా ప్రశ్నించగా ఒక వ్యక్తితో ఉన్న ఆర్థిక, రాజకీయ వ్యవహారాల కారణంగా హత్య జరిగిందని మరిన్ని వివరాలను పూర్తి దర్యాప్తు తర్వాత వెల్లడిస్తామన్నారు. రామారావు హత్య జరిగి రేపటికి ఏడాది అవుతున్న నేపథ్యంలో పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. ఇప్పటికే సిపిఎం సామినేని రామారావు వర్ధంతి సభను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసింది. సామినేని రామారావు హత్య కేసుకు సంబంధించి నిందితుల అరెస్టు తర్వాత కొత్త రాజకీయ చర్చకు తెరలేపింది. సిపిఎం ఆరోపించినట్లు సామినేని హత్య కేసులో కాంగ్రెస్ కార్యకర్తలెవరని అరెస్టు చేయకపోవడం ఇప్పుడు రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. నిందితులందరూ సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం స్వగ్రామానికి చెందిన వారు కావడం కూడా రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలకు దారితీస్తుంది. ఇప్పుడు అరెస్టు చేసిన నిందితులు నలుగురిలో ముగ్గురు 2023 ఆగస్టు 15న జరిగిన అప్పటి బిఆర్ఎస్ నాయకుడు తెల్దారుపల్లికి చెందిన తమ్మినేని కృష్ణయ్య హత్య కేసులో ఉండటం గమనార్హం. మీడియా సమావేశంలో దర్యాప్తు అధికారులు వైరా ఏసిపి సారంగపాణి పాల్గొన్నారు. హత్య కేసు దర్యాప్తులో వైరా సిఐ వెంకటప్రసాద్ తో పాటు పలువురు సబ్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొనగా వారందరినీ సిపి అభినందించారు.

వెంటనే ఆపాలి

(మొదటి పేజీ తరువాయి)

వ్యాఖ్యానించారు. కొండా సురేఖ ట్వీటర్‌ను తాను చూడలేదని,ఈ అంశంపైన తమ లీగల్ టీమ్‌తో చర్చిస్తానని వివరించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలోకెటిఆర్ మాట్లాడుతూ రైతులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు రైతుబంధు నిధులను, అలాగే ఎన్నికల హామీల మేరకు కౌలు రైతులకు నాలుగు విడతల రైతుబంధును ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు రైతు డిక్లరేషన్లు ప్రకటించిన కాంగ్రెస్, అధికారంలోనికి రాగానే ప్రస్తుతం రైతుల నుంచి సెల్ఫ్ డిక్లరేషన్లు తీసుకుంటుందన్నారు. అన్ని రంగాలకూ హామీలే ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే హామీలే ఇవ్వాలన్నారు. అన్ని పథకాలకు, అన్ని రంగాలకు హామీలే ప్రకటిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికే ప్రజలు హామీలే పలుకాలన్నారు. కరువు ఉన్నదని చెబుతూనే మూసీ సుందరీకరణ? పనులు చేపట్టాల్సిన అవసరం ఏముందని, సుందరీకరణ డ్రామాలను వెంటనే బంద్ చేయాలన్నారు.

చంద్రబాబును అభినందిస్తున్నా.....

తెలంగాణ రాష్ట్రం కంటే తక్కువ వర్షపాతం నమోదైన ఆంధ్రప్రదేశ్‌లో కరవు లేదని, ఆ రాష్ట్ర సిఎం చంద్రబాబు ముందు చూపుతో నీళ్లు ఎత్తిపోసుకున్నారని, తద్వారా ఎపిలో కరవు, క్రాప్ హాలీడే లేదని, ఈ విషయంలో చంద్రబాబును అభినందిస్తున్నానని కెటిఆర్ అన్నారు. కన్నెపల్లి నుంచి నీళ్లు ఎత్తిపోయాలని నాలుగు నెలల క్రితమే బిఆర్ఎస్ సూచించినప్పటికీ సిఎం రేవంత్ రెడ్డి పెడచెవిన పెట్టారని ఆరోపించారు. గోదావరి నుంచి 750 టిఎంసిలు, కృష్ణా నది నుంచి 250 మొత్తం వెయ్యి టిఎంసిల నీటిని కిందకు వదిలేశారని మండిపడ్డారు. సిఎం రేవంత్ రెడ్డి అహంకారం వల్లనే తెలంగాణలో కరవు వచ్చిందన్నారు.

పెట్టుబడులు, ఉద్యోగాలు, ఎంఒయులపైన శ్వేతపత్రం విడుదల చేయండి...

మూడేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన విదేశీ పర్యటనలు, పరిశ్రమలతో కుదిరిన ఎంఒయూలు, వచ్చిన పెట్టుబడులు, కొత్తగా ఇచ్చిన ఉద్యోగాల అంశంలో సమగ్ర వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని కెటిఆర్ డిమాండ్ చేశారు. గ్లోబల్ సమ్మిట్ పేరుతో వేల కోట్ల రూపాయలను తమ ప్రచారం కోసం వృథా చేస్తున్నారని మండిపడ్డారు. పవర్‌హాలిడే ఇచ్చే రాష్ట్రంలో పెట్టుబడులు ఎవరైనా పెడతారా అని కెటిఆర్ ప్రశ్నించారు. రాష్ట్రంలో పరిశ్రమలకు పవర్ హాలిడేస్ ప్రకటించడం వల్ల పారిశ్రామిక రంగానికి తీవ్ర నష్టం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.









Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com